veluturu telugu daily

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి నల్గొండ | బుధవారం 14.10.2026

సంపుటి : 9 | సంచిక : 122

www. veluturu.com

## దేశ ప్రజలంతా మాతో ఉన్నారు

- జ్ఞానేశ్ రాజీనామా చేసే వరకు నిరసనలు : రాహుల్
- రాహుల్ గాంధీ నివాసంలో తేనీటి విందు
- హాజరైన 'ఇండీ' కూటమి నేతలు, విద్యార్థి, పౌర సంఘాల ప్రతినిధుల

11



## దేశంలోని జర్నలిస్టులకు, మహిళలకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి

కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి



హైదరాబాద్, వెలుతురు:

స్త్రీ శక్తిని, అమ్మవారిని ఆరాధిస్తూ దేశమంతా నవరాత్రి ఉత్సవాలు జరుపుకుంటున్న సమయంలో.. మూడు నెలల గర్భిణి అయిన ఓ మహిళా జర్నలిస్టుపై రాహుల్ గాంధీ అందరూ చూస్తుండగానే దాడి చేశారు.

ఆస్పత్రి నుంచి ఆ జర్నలిస్టు తనకు ఎదురైన చేదు అనుభవాన్ని వివరిస్తుంటే.. రాహుల్ గాంధీ, ఆయన బృందం ఎంత అమానవీయంగా వ్యవహరించారో అర్థమవుతోంది. ఆమె గొంతు వినిపించకుండా నినాదాలు చేస్తూ.. ఆమె ఆవేదనను కూడా అణచివేసేందుకు ప్రయత్నించారు.

రాహుల్ గాంధీ చర్యల కారణంగా కడుపులో స్వల్ప నొప్పి రావడంతో.. మహిళా జర్నలిస్టు రిచాను ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేత హోదాలో ఉంటూ గూండాలా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి దుర్మార్గమైన ప్రవర్తనకు దేశంలోని జర్నలిస్టులందరికీ, మహిళలందరికీ ఆయన క్షమాపణ చెప్పాలి.

# డీఎస్సీ-2008 అభ్యర్థులకు హైకోర్టు షాక్

## మూడు పిటిషన్లు కొట్టివేత

### జీవో నంబర్ 28 సవరణపై అభ్యంతరాలు

### 2008 నాటి నియామకాల నిబంధనలపై విచారణ

### పిటిషనర్ల వాదనలను తోసిపుచ్చిన ధర్మాసనం

**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన డీఎస్సీ 2008 ఉపాధ్యాయ నియామకాల వివాదానికి సంబంధించి తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రభుత్వ జీవో నంబర్ 28.. నియామక నిబంధనల్లో చేసిన మార్పులను సవాల్ చేస్తూ దాఖలైన 3 రిట్ పిటిషన్లను ధర్మాసనం కొట్టివేసింది. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత నిబంధనల్లో మార్పులు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. సుదీర్ఘ విచారణ అనంతరం ఈ నిర్ణయం వెలువడింది. దీంతో డీఎస్సీ-2008 నియామకాలకు సంబంధించిన న్యాయ వివాదంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది.**




హైదరాబాద్, వెలుతురు:

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన డీఎస్సీ 2008 ఉపాధ్యాయ నియామకాల వివాదానికి సంబంధించి తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రభుత్వ జీవో నంబర్ 28.. నియామక నిబంధనల్లో చేసిన మార్పులను సవాల్ చేస్తూ దాఖలైన 3రిట్ పిటిషన్లను ధర్మాసనం కొట్టివేసింది. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత నిబంధనల్లో మార్పులు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. సుదీర్ఘ విచారణ అనంతరం ఈ నిర్ణయం వెలువడింది. దీంతో డీఎస్సీ-2008 నియామకాలకు సంబంధించిన న్యాయ వివాదంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2008 డిసెంబర్‌లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 52,655 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా..

- మిగతా 2 లో..



## తెలంగాణ రహదారులకు కేంద్రం పచ్చజెండా!

### ఎల్బీనగర్-హయత్‌నగర్ రెండంతస్తుల ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం

- జనవరిలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు
- ఐదు రోప్‌వేలు, మూడు రైల్వే పైవంతెనలకు గ్రీన్‌సిగ్నల్
- కేంద్ర మంత్రి గడ్కరీతో కోమటిరెడ్డి భేటీ.. పలు ప్రాజెక్టులపై కీలక చర్చ

న్యూఢిల్లీ, వెలుతురు:

తెలంగాణలో రహదారుల అభివృద్ధికి కేంద్రం పచ్చజెండా ఊపింది. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు.మంగళవారం ఢిల్లీలో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆయనతో సమావేశమై పలు ప్రతిపాదనలపై చర్చించారు. ఎల్బీనగర్-హయత్‌నగర్ రెండంతస్తుల ఎలివేటెడ్ కారిడార్‌ను వార్షిక ప్రణాళికలో చేర్చేందుకు గడ్కరీ అంగీకరించారు. ఈ మార్గంలోని 54 కాలనాల్లో నివసిస్తున్న పది లక్షల మందికి ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గనున్నాయని మంత్రి వివరించారు.

హైదరాబాద్-విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి-65ను 6o2 వరుసలుగా విస్తరించేందుకు నవంబర్‌లో టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి, 2027 జనవరిలో పనులు ప్రారంభిస్తామని గడ్కరీ హామీ ఇచ్చారు. కృష్ణా నదిపై సోమశిల-సంగమేశ్వరం మధ్య నిర్మించనున్న తీగల వంతెన శంకుస్థాపనకు అంగీకరించారు. దీని నిర్మాణంతో తిరుపతికి 80 కిలోమీటర్ల దూరం, మూడు గంటల ప్రయాణ సమయం తగ్గనుంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి-765పై

- మిగతా 2 లో..

## సింగరేణి కార్మికులకు, ఉద్యోగులకు

# దసరా కానుక

### ఒక్కొక్కరికి రూ.1,53,912 లాభాల వాటా

- 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులకు లబ్ధి
- 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్
- సింగరేణి కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తాం
- పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల సమస్యలకు 15రోజుల్లో పరిష్కారం
- ప్రజాభవన్‌లో మీడియాతో ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- పదేళ్లు అధికారంలో ఉండి సమస్యలు పరిష్కరించని వారు ఇప్పుడు ఏం సాధిస్తారు : మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, వెలుతురు:

సింగరేణి బొగ్గు గని కార్మికులకు దసరా పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు లాభాల వాటా కింద ఒక్కొక్కరికి సగటున రూ.1,53,912 చెల్లించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ప్రజాభవన్‌లో మంగళవారం మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ మొత్తం 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులు ఈ నిర్ణయంతో ప్రయోజనం పొందనున్నారని, 29717మంది కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 5,500 చొప్పున దసరా బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు. గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా సింగరేణి లాభాల్లో 34 శాతాన్ని కార్మికులకు లాభాల వాటాగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ ఏడాది సింగరేణి ఆర్జించిన 1754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం అంటే 596 కోట్ల రూపాయలను లాభాల వాటాగా కార్మికులకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. గత ఏడాది కాంట్రాక్టు కార్మికులకు రూ. 5,500 బోనస్ అందించామని, ఈ ఏడాది కూడా అదే మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించినట్లు వివరించారు.

**సింగరేణి ఉద్యోగ, కార్మికులకు సొంతింటి కల సాకారం**

సింగరేణి ఉద్యోగులు, కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తాం. కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల

- మిగతా 2 లో..

## ఓటు నమోదుకు మరో ఛాన్స్

- సీఈవో సుదర్శన్ రెడ్డి కీలక ప్రకటన
- నోటీసుల పంపిణీ ఇంకా పూర్తి కావాల్సి ఉంది
- అర్హులైన వారందరి పేర్లను వచ్చే నవంబర్ 9న విడుదల



హైదరాబాద్, వెలుతురు:

తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా సవరణ కోసం ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా అర్హత సాధించిన వారు, ముసాయిదా జాబితాలో పేర్లు లేని వారి కోసం ప్రత్యేక క్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్నట్లుగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈనెల 15, 16 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లుగా పేర్కొన్నారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువ ఓటర్లు ఈ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకుని ఫారమ్-6

- మిగతా 2 లో..

## చినిగిపోని.. తడిసినా చెడిపోని మీ సేవ సర్టిఫికెట్లు

- 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లతో కొత్త పేపర్
- ఏళ్ల తరబడి భద్రంగా దాచుకునేలా ప్రత్యేక తయారీ
- మీసేవలో జారీ చేసే సర్టిఫికెట్లకు ఇక లామినేషన్ పని లేదు
- ప్రజాభవన్‌లో ప్రారంభించిన ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు

12



## గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత

- హ్యామ్ రోడ్ల పనులు వేగవంతం చేయాలి
- నాణ్యతలో రాజీ పడొద్దు
- ఇంజనీరింగ్ అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు

12

## ఎఫ్‌టీఈలకు గ్రాట్యుటీ భరోసా

### 20 ఏళ్ల పోరాటానికి ఫలితం

- 3,800 మంది ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనం
- రిటైర్మెంట్ వేళ కనీసం రూ.4 లక్షల గ్రాట్యుటీ
- మంత్రి సీతక్క చొరవతో ప్రజా ప్రభుత్వం నిర్ణయం



హైదరాబాద్, వెలుతురు:

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిస్ (ఎఫ్‌టీఈ) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుక అందించింది. సుమారు 3,800 మంది ఉద్యోగులకు గ్రాట్యుటీ ప్రయోజనం కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతో గత రెండు దశాబ్దాలుగా గ్రాట్యుటీ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగుల చిరకాల స్వప్నం సాకారమైంది.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ, పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రిటైర్మెంట్ సమయంలో ఉద్యోగులకు కనీసం రూ.4 లక్షల గ్రాట్యుటీ అందే అవకాశం ఉండగా, పదేళ్ల సర్వీసు పూర్తిచేసిన ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రూ.10 లక్షల వరకు ప్రయోజనం చేకూరనున్నట్లు ఉద్యోగ వర్గాలు పేర్కొన్నాయి.

**మంత్రి సీతక్క చొరవతో పరిష్కారం**

ఎఫ్‌టీఈ ఉద్యోగులకు గ్రాట్యుటీ వర్తింపజేసే విషయంలో మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకున్నారని ఉద్యోగుల సంఘం తెలిపింది. సుమారు 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు పరిష్కారం లభించడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. తమ డిమాండ్‌ను పరిష్క రించడంలో చొరవ చూపిన మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గ్రాట్యుటీ మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఉద్యోగులు ధన్యవాదాలు

- మిగతా 2 లో..

## పీఎంయూ టెండర్లను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలి

- పాత పద్ధతిలోనే స్థానిక వెండర్ల ద్వారా ప్రభుత్వ హాస్టళ్లకు సరుకులు సరఫరా చేయాలి
- మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్
- ప్రభుత్వ పెద్దల కమీషన్ల కోసం బ్లాక్‌లిస్ట్ సంస్థకు టెండర్ కట్టబెట్టడం దుర్మార్గం

2



## తెలంగాణ విద్యారంగం ప్రపంచంతో పోటీపడేలా..!

12 లో

# సింగరేణి కార్మికులకు, ఉద్యోగులకు దసరా కానుక

(మొదటిపేజీ తరువాయి)

సమస్యలను పరిష్కరించి, వారికి న్యాయం చేస్తాం. సింగరేణి కార్మికులకు సొంత ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం. సింగరేణి సంస్థకు చెందిన భూముల్లో ఇప్పటి వరకు మైనింగ్ చేపట్టని ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఇళ్ల నిర్మాణానికి అనువైన లేఅవుట్లు సిద్ధం చేయాలి. మిశ్రమ ఆర్థిక విధానాలను ప్రోత్సహించి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రోత్సహించిన భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరిట నెహ్రూ హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేసే దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించాం. సింగరేణి నుంచి రెవెన్యూ శాఖకు తిరిగి అప్పగించిన 5,774 ఎకరాల భూముల్లో 4,500 ఎకరాలను గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు పట్టాల రూపంలో అందించారు. మిగిలిన సుమారు 1,250 ఎకరాలకు సంబంధించి జీవో నంబర్ 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని" సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించామని తెలిపారు.

సింగరేణిలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఆర్డర్లు, ఇతర చట్టపరమైన ప్రక్రియలను రాబోయే 15 రోజుల్లో పూర్తి చేసి అర్హులైన అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేయాలని ఆదేశించినట్టు తెలిపారు. కార్మికుల పేర్ల మార్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 136 నుంచి గరిష్ఠంగా 170 మంది సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించామని, ఇందుకోసం ఏర్పాటు చేసిన సింగరేణి అధికారుల కమిటీ సిఫార్సుల ఆధారంగా తగిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ప్రతి నెలా నిర్ణీత రోజున మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించాలని ఆదేశించామన్నారు. కార్మికుల కుటుంబాల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని మానవీయంగా వ్యవహరించాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు. సింగరేణి కార్మికులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి సేఫ్టీ కిట్స్ తప్పనిసరిగా పంపిణీ చేయాలని, కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావుండకూడదన్నారు. సింగరేణి ఉద్యోగులకు చెల్లిస్తున్న విధంగానే కార్మికుల పెర్క్స్, అలవెన్స్‌లపై ఆదాయపన్నును కూడా సంస్థ తరపున ప్రభుత్వానికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు వెల్లడించారు.



భూపాలపల్లి నియోజకవర్గంలో వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు సింగరేణి నుంచి స్థలం కేటాయించే అంశాన్ని పరిశీలించాలని, ఇందుకు బదులుగా రెవెన్యూ భూముల్లోని నిరుపయోగ గుట్టల భూములకు సంబంధించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలులో భాగంగా రామగుండంలో సింగరేణి ఆధ్వర్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. సత్తుపల్లి, భూపాలపల్లి నియోజకవర్గాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తామన్నారు. సింగరేణి సంస్థను అభివృద్ధి చేయడంతో పాటు కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భద్రత, ఆరోగ్యం, గృహవసతి వంటి అంశాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతాం అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

### సింగరేణి లాభాలు తగ్గడానికి కారణాలివే..

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సింగరేణి లాభాలు తగ్గడానికి పలు కారణాలున్నాయని ఉప ముఖ్య మంత్రి వివరించారు. ముఖ్యంగా గత పదేళ్లలో కొత్త బొగ్గు బ్లాక్‌లను అదనంగా సాధించడంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన బొగ్గు బ్లాక్‌ల వేలంలో సింగరేణి పాల్గొనకుండా చేయడం వల్ల సంస్థకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆరోపించారు. సుమారు 141 బొగ్గు బ్లాక్‌ల వేలం ప్రక్రియలో సింగరేణి పాల్గొనే అవకాశాన్ని వినియోగించుకోలేదని, దీంతో సంస్థ వ్యాపార విస్తరణకు ఆటంకం ఏర్పడిందని పేర్కొన్నారు.

### కొత్త బ్లాక్‌ల సాధనకు ప్రజా ప్రభుత్వం చర్యలు

సింగరేణి సంస్థను బలోపేతం చేసేందుకు తమ ప్రభుత్వం కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనపై దృష్టి సారించిందని భట్టి విక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వం దిగిపోయిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కొత్త బ్లాక్‌లను సాధించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. తాడిచెర్ల-2, కోయగూడెం బ్లాక్ -3, మణుగూరు పీకే ఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్, నైని వంటి బ్లాక్‌లను ప్రస్తావిస్తూ, కొత్త బ్లాక్‌ల సాధనతో పాటు సంస్థ వ్యాపారాన్ని విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.ఏ మైనింగ్ సంస్థ అయినా నిరంతరం కొత్త బ్లాక్‌లను సాధిస్తూ వ్యాపారాన్ని విస్తరించుకుంటేనే దాని ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల భవిష్యత్తు, సంస్థ మనుగడ, బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం పెంపు దృష్ట్యా ఈ చర్యలు అత్యంత కీలకమని స్పష్టం చేశారు.

### మార్కెట్‌కు అనుగుణంగా బొగ్గు ధరల సర్దుబాటు

ప్రస్తుతం బొగ్గు మార్కెట్‌లో తీవ్రమైన పోటీ నెలకొందని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. మహానది, కోల్ ఇండియా, వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ వంటి సంస్థల నుంచి బొగ్గు సరఫరా అవుతోందని, ప్రైవేటు సంస్థలు కూడా తక్కువ ధరలకు బొగ్గును అందిస్తున్నాయని వివరించారు. సింగరేణి బొగ్గు ధరలు అధికంగా ఉండటంతో కొన్ని సంస్థలు ఇతర వనరుల నుంచి బొగ్గు కొనుగోలు చేసేందుకు మొగ్గుచూపుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మార్కెట్ ధరలకు అనుగుణంగా సింగరేణి బొగ్గు ధరలను హేతుబద్ధీకరించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ధరలను సర్దుబాటు చేయకపోతే బొగ్గు కొనుగోలుదారులను కోల్పోయే ప్రమాదం ఉందని, తద్వారా సంస్థ ఆదాయం మరింత తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సింగరేణి ఆర్థిక ప్రయోజనాలను కాపాడుతూనే మార్కెట్‌లో పోటీతత్వాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు.

### విద్యుత్ సంస్థల బకాయిలపై స్పందన

సింగరేణికి విద్యుత్ సంస్థల నుంచి రావాల్సిన బకాయిల అంశాన్ని కూడా భట్టి విక్రమార్క ప్రస్తావించారు. గత పదేళ్లలో సుమారు రూ.29 వేల కోట్ల బకాయిలు పేరుకుపోగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్లలో సుమారు రూ.27 వేల కోట్ల బకాయిలు ఉన్నట్లు వివరించారు. జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల నుంచి సింగరేణికి రావాల్సిన మొత్తాలను క్రమంగా చెల్లించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలను ఒక్కసారిగా చెల్లించడం సాధ్యం కాకపోయినా, వాటిని దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

### కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సింగరేణి కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించడంతోపాటు సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధన, మార్కెట్‌కు అనుగుణంగా ధరల సర్దుబాటు, బకాయిల వసూలు వంటి అంశాలపై సమగ్రంగా దృష్టి సారిస్తున్నామని తెలిపారు.

### ఇప్పుడు పోరుబాట హాస్యాస్పదం : మంత్రి శ్రీధర్‌బాబు

పదేళ్లు అధికారంలో ఉండి సమస్యలు పరిష్కరించని వారు ఇప్పుడు ఏం సాధిస్తారు. సింగరేణి సంస్థను పదేళ్ల పాటు అధికారంలో ఉండి నిర్వీర్యం చేసి, భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు పోరుబాట పేరుతో ఆందోళనలకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎద్దేవా చేశారు. పదేళ్లపాటు అధికారంలో ఉండి పరిష్కరించలేని సమస్యలను ప్రతిపక్షంలో ఉండి ఎలా పరిష్కరిస్తారో మాజీ మంత్రి హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి సంస్థకు చేసిన మేలేమిటో, కార్మికుల సమస్యలను ఎందుకు పరిష్కరించలేకపోయిందో ముందుగా పోరుబాటలో వివరించాలని శ్రీధర్‌బాబు సూచించారు. కార్మికుల సమస్యలపై ఇప్పుడు ఆందోళనలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు.. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు స్పందించలేదో ప్రజలకు చెప్పాలని అన్నారు. మారుపేర్ల సమస్యను పదేళ్ల పాలనలో ఎందుకు పరిష్కరించలేకపోయారని ప్రశ్నించారు.

# హైకోర్టు షాక్ ..

(మొదటిపేజీ తరువాయి)

వాటిలో 30,558 సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులకు బీఈడీ, డీఈడీ అర్హతలున్న అభ్యర్థులు పోటీపడే అంశం వివాదానికి ప్రధాన కారణం అయింది. నోటిఫికేషన్ రిలీజ్ అయిన తర్వాత 2009 జనవరి 29వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 28ను జారీ చేసింది. ఈ జీవో నంబర్ 28 ద్వారా ఎస్జీటీ పోస్టుల్లో 30 శాతం పోస్టులను డీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులకు కేటాయిస్తూ.. మిగిలిన 70 శాతం పోస్టులకు బీఈడీ, డీఈడీ అభ్యర్థులు పోటీపడే విధంగా నిబంధనల్లో మార్పులు చేసినట్లు పిటిషనర్లు పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత నియామకాలకు సంబంధించిన నిబంధనలను మార్చడం వల్ల తమకు నష్టం జరిగిందని కొందరు బీఈడీ అభ్యర్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యంగా రూల్ 7కు ప్రొవిజన్ జోడించడం.. జీవో నంబర్ 28 ద్వారా తీసుకొచ్చిన మార్పులు న్యాయబద్ధమైనవి కావని వారు వాదించారు. అసలు నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనల ప్రకారమే ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని కోరుతూ పలువురు అభ్యర్థులు న్యాయపోరాటం ప్రారంభించారు. తొలుత అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన అనంతరం.. ఈ వివాదం న్యాయస్థానాల ముందుకు వెళ్లింది. డీఎస్సీ-2008 ప్రక్రియలో మెరిట్ సాధించినప్పటికీ.. నిబంధనల మార్పుల కారణంగా ఉద్యోగావకాశాలు కోల్పోయామని బీఈడీ అభ్యర్థులు తమ వాదనల్లో పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను రద్దు చేసి.. మొదట ప్రకటించిన విధానం ప్రకారం ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.

### దాఖలైన 3 రిట్ పిటిషన్లపై విచారణ

తాజాగా ఈ అంశానికి సంబంధించి దాఖలైన 3 రిట్ పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం ధర్మాసనం వాటిని కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తర్వాత ఆయా ప్రభుత్వాలు తమ పరిధిలో నియామకాలకు సంబంధించిన చర్యలను కొనసాగించాయి. ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగులు కూడా ఇచ్చిన నేపథ్యంలో.. జీవో నంబర్ 28 సవరణకు సంబంధించి పిటిషనర్లు కోరిన విధంగా ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు వెలువడటంతో జీవో నంబర్ 28 రూల్ 7లోని నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ దాఖలైన తాజా 3 పిటిషన్లపై విచారణ ముగిసింది. అయితే ఈ తీర్పు ప్రభావం ఇప్పటికే నియామకాలు పొందినవారి పరిస్థితులు, భవిష్యత్ ప్రయోజనాలు, ఇతర సంబంధిత అంశాలపై ఎలా ఉంటుందన్నది పూర్తి తీర్పు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా నిర్ధారించాల్సి ఉంటుంది.

### వివిధ న్యాయస్థానాల్లో సాగిన విచారణలు

డీఎస్సీ-2008 వివాదం అనేక ఏళ్లుగా కొనసాగుతోంది. నియామక నిబంధనల మార్పులపై అభ్యర్థులు వ్యక్తం చేసిన అభ్యంతరాలు, వివిధ న్యాయస్థానాల్లో సాగిన విచారణలు ఈ అంశాన్ని సుదీర్ఘ వివాదంగా మార్చాయి. మరోవైపు, అర్హులైన అభ్యర్థులకు ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించే అంశంపై 2 తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రభుత్వ స్థాయిలో చర్యలు చేపట్టినట్లు గతంలో వార్తలు వచ్చాయి. ప్రస్తుత తీర్పు మూడు రిట్ పిటిషన్ల పరిష్కారానికి సంబంధించింది కాగా.. మొత్తం డీఎస్సీ-2008 వివాదానికి పూర్తిగా ముగింపు పడిందని చెప్పాలంటే.. సంబంధిత ఇతర కేసులు, ప్రభుత్వ ఉత్తర్వులు, తీర్పులోని తుది ఆదేశాలను కూడా పరిశీలించాల్సి ఉంటుంది.

మొత్తంగా జీవో నంబర్ 28 సవరణను.. రూల్ 7కు ప్రొవిజన్ జోడించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన మూడు పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేయడం డీఎస్సీ-2008 నియామకాల అంశంలో ముఖ్యమైన పరిణామంగా నిలిచింది. ఈ తీర్పుపై మరిన్ని వివరాలు, అధికారిక ఉత్తర్వులు అందుబాటులోకి వస్తే నియామకాలపై దాని పూర్తి ప్రభావం స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# కేంద్రం పచ్చజెండా!

(మొదటిపేజీ తరువాయి)

ఎలివేటెడ్ కారిడార్‌కు కొత్త సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పర్వతమాల పథకం కింద ఐదు రోప్‌వేలు, సేతుబంధన్ పథకంలో మూడు రైల్వే పైవంతెనలకు ఆమోదం తెలిపారు. హైదరాబాద్-అమరావతి నూతన జాతీయ రహదారి ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో 34 రహదారి పనులకు కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి నుంచి నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పుల్లూరు నుంచి నల్లగొండ వరకు పలు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదనను పరిశీలిస్తామన్నారు. నవంబర్ 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరిగే భారత రహదారుల మహాసభకు హాజరయ్యేందుకు గడ్కరీ అంగీకరించారు. సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, అధికారులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణుడి అలంకారంలో శ్రీ మలయప్పస్వామి దివ్యదర్శనం



తిరుమల, వెలుతురు:

గోవింద నామస్మరణలు.. మంగళవాయిద్యాలు.. కోలాటాల నడుమ వైభవంగా వాహన సేవతిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారు ఐదు తలల చిన్నశేష వాహనంపై ద్వారకా శ్రీకృష్ణుడి అలంకారంలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. సర్వాలంకార భూషితుడైన స్వామివారిని దర్శించుకుని భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.ముందుగా గజాలు, అశ్వాలు నడుస్తుండగా, భక్తుల కోలాటాలు, మంగళవాయిద్యాలు, వివిధ కళాబృందాల ప్రదర్శనల నడుమ వాహనసేవ కన్నులపండువగా సాగింది. గోవింద నామస్మరణలతో తిరుమల మాడ వీధులు మార్మోగాయి.చిన్నశేష వాహనం కుటుంబ శ్రేయస్సుకు ప్రతీకవైష్ణవ సంప్రదాయంలో భగవంతుడిని 'శేషి'గా, ప్రపంచాన్ని 'శేషభూతం'గా భావిస్తారు. నాగరాజైన వాసుకిని ప్రతిబింబించే చిన్నశేష వాహనం ఈ శేషి భావాన్ని చాటిచెబుతుంది.చిన్నశేష వాహనంపై స్వామివారిని దర్శించుకోవడంవల్ల కుటుంబ శ్రేయస్సు కలుగుతుందని, కుండలినీ యోగసిద్ధి ఫలాలు లభిస్తాయని భక్తుల విశ్వాసం.

## ఇంద్రకీలాద్రిపై రెండో రోజు కొనసాగుతున్న వీఐపీల తాకిడి

**విజయవాడ, వెలుతురు:** దసరా ఉత్సవాలు జరుగుతున్న ఇంద్రకీలాద్రిపై మంగళవారం కూడా వీఐపీల తాకిడి కొనసాగుతోంది. కార్లు కొండపై దాకా వస్తున్నాయి. మరోవైపు సామాన్య భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో అమ్మవారి దర్శనం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. వీఐపీల పేరుతో కొండపైకి వాహనాలతో వస్తున్నా దేవస్థాన యంత్రాంగం పట్టించుకోవడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు.

# పీఎంయూ టెండర్లను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలి

- **పాత పద్ధతిలోనే స్థానిక వెండర్ల ద్వారా ప్రభుత్వ హాస్టళ్లకు సరుకులు సరఫరా చేయాలి**
- **మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్**
- **ప్రభుత్వ పెద్దల కమీషన్ల కోసం బ్లాక్‌లిస్ట్ సంస్థకు టెండర్ కట్టబెట్టడం దుర్మార్గం**

హైదరాబాద్, వెలుతురు:

రాష్ట్రంలోని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో నిత్యావసర సరుకుల సరఫరా కోసం ప్రభుత్వం చేపట్టిన కేంద్రీకృత పీఎంయూ టెండర్లను తక్షణమే రద్దు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు హరీశ్ రావును కలిసి, ప్రభుత్వం మార్చిన టెండర్ నిబంధనల వల్ల వేలమంది స్థానిక వెండర్ల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలను విన్న అనంతరం హరీశ్ రావు స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గురుకులాలను చిన్నచూపు చూస్తూ పేద విద్యార్థులకు పెట్టే భోజనంపై కూడా కక్కుర్తి పడుతూ, 800 కోట్ల టెండర్లలో కమీషన్ల దందా నడుపుతోందని హరీశ్ రావు ధ్వజమెత్తారు. గురుకులాల్లో పేద విద్యార్థులకు ఇచ్చే స్కూల్ యూనిఫాంలు, నోట్ బుక్కులు, ట్రంక్ పెట్టెల ఇతర వస్తువుల కొనుగోళ్ల టెండర్లలో దాదాపు రూ. 2,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని గతంలోనే తాము ఆధారాలతో సహా నిరూపించామని హరీశ్ రావు గుర్తుచేశారు. ఆ దోపిడీతో కూడా కాంగ్రెస్ పాలకుల కడుపు నిండలేదని.. ఇప్పుడు చివరకు పేద విద్యార్థుల కడుపునింపే నిత్యావసర సరుకులపైనా 20 శాతం కమీషన్లు దండుకోవాలని చూడడం వీరి కక్కుర్తికి నిదర్శనం అని మండిపడ్డారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,023 గురుకులాలు, 3 వేలకు పైగా సంక్షేమ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు గతంలో పాఠశాలను యూనిట్‌గా తీసుకుని స్థానిక వ్యాపారులు సరుకులు సరఫరా చేసేవారని గుర్తుచేశారు. అయితే స్థానిక వెండర్లను తప్పించేందుకు జీవో 17 పేరుతో మొదట జిల్లా యూనిట్ అని, ఆ తర్వాత రూ. 3 కోట్ల నుంచి రూ. 5 కోట్ల భారీ ఈఎండీలు పెట్టి వారిని పోటీ లేకుండా చేశారని ఆక్షేపించారు. వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించినా లెక్కచేయకుండా, ఇప్పుడు మొత్తం రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా చేసి పీఎంయూ విధానం ద్వారా రూ. 800 కోట్ల కాంట్రాక్టును ఒకే వ్యక్తికి, అదీ గతంలో బ్లాక్‌లిస్టులో పెట్టిన సంస్థకు అప్పగించడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారాయని ఆరోపించారు.

గతంలో నిబంధనల ఉల్లంఘన కారణంగా తెలంగాణ సివిల్ సప్లైస్‌లో రూ. 65 కోట్ల డిపాజిట్ జప్తునకు గురై బ్లాక్‌లిస్టులో ఉన్న నాకాఫ్ సంస్థకు, అలాగే ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో నిషేధానికి గురైన కంపెనీకి ఈ టెండర్‌ను ఎలా కట్టబెడతారని హరీశ్ రావు ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం సబ్-కాంట్రాక్టులకు తావులేకపోయినా.. తెరవెనుక 12 మందికి సబ్ కాంట్రాక్టులు, అక్కడి నుంచి 33 జిల్లాలకు పంపకాలు చేసి, ప్రతి జిల్లాకు రూ. 2 కోట్ల చొప్పున ఏకంగా రూ. 66 కోట్ల గుడ్‌విల్, ప్రతినెల బిల్లుల్లో 20 శాతం కమీషన్ల ఒప్పందం కుదుర్చుకున్నారని పత్రికా కథనాలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. అమీర్‌పేటలోని ప్రైవేట్ కార్యాలయం కేంద్రంగా ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి చక్రం తిప్పుతుంటే సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు .

గతంలో ఇదే కాంట్రాక్టర్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో కూడా సరిగ్గా ఇదే కేంద్రీకృత విధానాన్ని అమలు చేయాలని చూశారని హరీశ్ రావు గుర్తుచేశారు. అక్కడ మూడు నెలలు నడిపిన తర్వాత ఈ విధానం ఆచరణ సాధ్యం కాదని తేలడం, సదరు కాంట్రాక్టర్‌పై తీవ్ర ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో అక్కడి ప్రభుత్వమే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే ఆ టెండర్‌ను రద్దు చేసి, తిరిగి పాత పద్ధతిలోనే స్థానిక ప్రొక్యూర్మెంట్ విధానాన్ని కొనసాగిస్తోందని తెలిపారు. పక్క రాష్ట్రంలో అట్టర్‌ఫ్లాప్ అయి, లోపభూయిష్టమని తేలి రద్దు చేసిన విధానాన్ని.. ఇప్పుడు ఎవరి స్వలాభం కోసం, ఎవరి జేబులు నింపడానికి తెలంగాణలో బలవంతంగా అమలు చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ స్వార్థ ప్రయోజనాలు, కమీషన్ల కక్కుర్తి కోసం పేద విద్యార్థుల కడుపు ఎందుకు కొడతారని నిలదీశారు. స్థానిక వెండర్లు సప్లై చేసే సాధారణ రేట్ల కంటే 35 నుంచి 45 శాతం అధిక ధరలకు టెండర్లను ఖరారు చేశారని, ప్రభుత్వం నిర్ణయించిన డైట్ ఛార్జీల కంటే ఎక్కువ రేట్లకు కాంట్రాక్టు ఇస్తే భవిష్యత్తులో విద్యార్థులకు కడుపునిండా అన్నం పెట్టే పరిస్థితి ఎక్కడుంటుందని హరీశ్ రావు నిలదీశారు. జూన్ నెల నుంచే సరుకులు ఇవ్వాల్సిన సదరు సంస్థ ఇప్పటివరకు సరఫరా చేయలేకపోయిందని, హాస్టళ్ల ప్రిన్సిపాళ్లు పాత లోకల్ వెండర్లను బతిమిలాడి మూడు నెలలు సరుకులు తెప్పించుకున్నారని చెప్పారు. దసరా పండుగ సెలవులకు ముందు రాష్ట్రంలోని దాదాపు 4 వేల హాస్టళ్లలో కేవలం 280 కేంద్రాలకే నామమాత్రంగా సరుకులు పంపారని, అవి కూడా ఎలాంటి బ్రాండ్, బిల్లు, ఎక్స్‌పైరీ డేట్ లేని అత్యంత నాసిరకం వస్తువులని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే ప్రభుత్వం వెంటనే మొండివైఖరి వీడి, కమీషన్ల కోసం తెచ్చిన ఈ కేంద్రీకృత పీఎంయూ టెండర్లను రద్దు చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. గతంలో అమలులో ఉన్న విధంగా డిస్ట్రిక్ట్ పర్చేస్ కమిటీ ద్వారా, పాఠశాలను ఒక యూనిట్‌గా పరిగణించి స్థానిక వెండర్లకే నిత్యావసర సరుకుల సరఫరా బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేశారు. దీనిపై ఆధారపడి బతుకుతున్న వేలాది కుటుంబాలు రోడ్డున పడకుండా ఉంటాయని, అంతేకాకుండా స్థానికంగా జవాబుదారీతనం పెరిగి పిల్లలకు నాణ్యమైన ఆహారం అందుతుందని పేర్కొన్నారు. పేద విద్యార్థుల ఆరోగ్యం, చిరు వ్యాపారుల పొట్టకొట్టే ఈ అవినీతి నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, బాధిత కుటుంబాల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్ రావు హెచ్చరించారు.



# ఓటు నమోదుకు మరో ఛాన్స్

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తును సమర్పించి తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సీఈవో సూచించారు.

ప్రస్తుతం విడుదల చేసిన డ్రాఫ్ట్ జాబితాలో ఎవరి పేరు కనిపించకపోయినా, జాబితాలో పేరు లేనివారు వెంటనే ఫారమ్-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ స్పెషల్ క్యాంప్‌ల ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారందరి పేర్లను వచ్చే నవంబర్ 9న విడుదల చేయబోయే తుది ఓటర్ల జాబితాలో చేర్చనున్నట్లుగా సీఈవో సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. ఈ సదావకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది

తెలంగాణలో 95 లక్షల ఓట్లు తొలగించారంటూ జరుగుతున్న ప్రచారంపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) సి. సుదర్శన్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. ఈ వార్తలో వాస్తవం లేదని.. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని తెలిపారు. ఓటర్ల వివరాల పరిశీలన, నోటీసుల జారీ, విచారణల అనంతరం అర్హత నిర్ధారణ వంటి దశలు పూర్తయిన తర్వాతే తుది జాబితాపై స్పష్టత వస్తుందని వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న గణాంకాలను ఆధారంగా చేసుకుని 95 లక్షల ఓట్లు తొలగించినట్లు చెప్పడం సరైంది కాదని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల జాబితా సవరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 73,39,235 మంది ఓటర్లను ఏఎస్‌డీడీ కేటగిరీలో గుర్తించినట్లు సీఈవో వివరించారు.

### 92,88,187 నోటీసులు జారీ

ఓటర్ల వివరాల్లో ఉన్న వ్యత్యాసాలు, పాత రికార్డులతో వివరాలను అనుసంధానించలేకపోవడం వంటి కారణాలతో మొత్తం 92,88,187 నోటీసులు జారీ చేసినట్లు సీఈఓ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. వీటిలో 92,23,486 నోటీసులు సంబంధిత ఓటర్లకు అందజేశారు. మరో 64,701 నోటీసుల పంపిణీ ఇంకా పూర్తి కావాల్సి ఉందని వెల్లడించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ వివరాలను సమర్పించి, అవసరమైన పత్రాలతో విచారణకు హాజరయ్యే అవకాశం ఉందని ఎన్నికల అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత ఈ ప్రక్రియ ద్వారా ఓటర్ల అర్హతను నిర్ధారించి, తుది జాబితాలో పేర్లను చేర్చాలా లేదా అనే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు.

# గ్రాట్యుటీ భరోసా..

(మొదటిపేజీ తరువాయి)

తెలియజేశారు. ప్రభుత్వ నిర్ణయంతో దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం ఆర్థిక భరోసా లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఉద్యోగుల హక్కులకు ప్రాధాన్యం

ఉద్యోగుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కులు, ఆత్మగౌరవానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని, కష్టపడి పనిచేసిన ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని ఆమె పేర్కొన్నారు. జీవిత చరమాంకంలో ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. గ్రాట్యుటీ మంజూరుతో ఎఫ్‌టీఈ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనం చేకూరడమే కాకుండా, వారి దీర్ఘకాలిక పోరాటానికి గుర్తింపు లభించినట్లయిందని ఉద్యోగుల సంఘం అభిప్రాయపడింది.



# ఆక్రమణలపై ఉక్కుపాదం



**మల్కాజిగిరి, వెలుతురు అక్టోబర్ 13 :** ప్రజా రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడంతోపాటు అక్రమ నిర్మాణాల తొలగింపుపై మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) అధికారులు దృష్టి సారించారు. కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్ ఆదేశాల మేరకు మంగళవారం మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్‌బీ నగర్ జోన్ల పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న అనధికార నిర్మాణాలు, రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించారు.

**మల్కాజిగిరి జోన్‌లో..**

బోయిన్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఫతేనగర్‌లో ప్రైవేట్ భవనం వద్ద అనధికారంగా ఏర్పాటు చేసిన సెంటరింగ్‌ను అధికారులు తొలగించారు. ఫతేనగర్ నుంచి గౌతమ్‌నగర్ వరకు ఆక్రమణల తొలగింపు చేపట్టారు. యోగేంద్ర పార్థి ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన గదులను కూల్చివేశారు.

**ఉప్పల్ జోన్‌లో..**

ఘట్‌కేసర్ పరిధిలోని ఎస్వీ నగర్ నుంచి రాంపల్లి ఎక్స్‌రోడ్, నాగారం డివిజన్ వరకు రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. కాచవాని సింగారంలో అక్రమంగా నిర్మించిన ఎనిమిది ర్యాంపులను తొలగించారు. ఉప్పల్ ఎక్స్‌రోడ్ నుంచి నాగోల్ వైపు, ఉప్పల్ భగాయత్ ఫేజ్-2లోని డీ-మార్ట్ ప్రాంతం వరకు ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఈ క్రమంలో అక్రమంగా ఏర్పాటు చేసిన గుడిసెలను తొలగించారు. బోడుప్పల్ పరిధిలోని పీర్జాదిగూడ సర్కిల్-10, శంకర్‌నగర్‌లో రహదారిని ఆక్రమించి నిర్మించిన ర్యాంపులను తొలగించారు.

**ఎల్‌బీ నగర్ జోన్‌లో..**

నాగోల్ పరిధిలోని బండ్లగూడ, నాగోల్ డివిజన్‌లోని అప్కోకాలనీలో అనధికారికంగా చేపట్టిన నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. అక్రమంగా నిర్మించిన పెంట్‌హౌస్, గ్రౌండ్‌ఫ్లోర్ నిర్మాణాలకు సంబంధించి గ్రౌండ్‌ఫ్లోర్ గోడలు, రెండో అంతస్తుపై నిర్మించిన పిల్లర్లను తొలగించారు.

సరూర్‌నగర్ పరిధిలోని అష్టలక్ష్మి కమాన్ నుంచి డీవీఎం కాలేజ్, సిరీస్ రోడ్డు వరకు ఆక్రమణల తొలగింపు డ్రైవ్ నిర్వహించారు. ఈ ప్రాంతంలో సుమారు 1.5 మీటర్ల మేర ఆక్రమణలను తొలగించి, 15 ఆక్రమణలను తొలగించినట్లు అధికారులు తెలిపారు. ఎల్‌బీ నగర్ పరిధిలోని కర్మన్‌ఘాట్ గ్రీన్ పార్క్‌కాలనీలోనూ ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టారు.

**ప్రజా ఆస్తుల పరిరక్షణే లక్ష్యం**

ప్రజా ఆస్తుల పరిరక్షణ, రహదారులపై సాఫీగా రాకపోకలు, పాదచారుల భద్రత, క్రమబద్ధమైన పట్టణ అభివృద్ధి ఎంఎంసీ ప్రధాన లక్ష్యాలని కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. రహదారులు, ఫుట్‌పాత్‌లు, ఇతర ప్రజా వినియోగ ప్రాంతాలను ఆక్రమించడం వల్ల పాదచారుల రాకపోకలకు, ట్రాఫిక్ నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడం, రహదారులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం వంటి చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. ఆక్రమణల తొలగింపు అనంతరం ఆయా ప్రాంతాల్లో తిరిగి ఆక్రమణలు ఏర్పడకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, రెవెన్యూ తదితర విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు మున్సిపల్ నిబంధనలను పాటిస్తూ, ప్రజా స్థలాలను ఆక్రమించకుండా సహకరించాలని కమిషనర్ కోరారు.

# విద్య పేరుతో నిలువుదోపిడీ!

- అనుమతుల్లేని బడులు.. అడ్డగోలు ఫీజులు!
- ఆటస్థలాలు లేవు.. నిబంధనలు పట్టవు.. అయినా అడ్మిషన్ల దందా!
- పేదోడి పిల్లల చదువుతో చెలగాటం.. ఉచిత సీట్లకూ ఎసరు!
- ఇరుకైన గదుల్లోనే తరగతులు.. పట్టించుకోని విద్యాశాఖ అధికారులు!
- ఏటా కాగితాలకే పరిమితమవుతున్న తనిఖీలు



**హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 13:** బడి అంటే విజ్ఞానాన్ని పంచే సరస్వతీ నిలయం కావాలి.. కానీ నేడు నగరంలో అనేక ప్రైవేటు పాఠశాలలు తల్లిదండ్రుల జేబులు గుల్ల చేసే పక్కా వ్యాపార కేంద్రాలుగా మారిపోతున్నాయి. విద్యా ప్రమాణాలను గాలికొదిలేసి, ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ పలు యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా దందా సాగిస్తున్నాయి. అసలు బడి నిర్వహణకు తగిన అనుమతులు ఉన్నాయా? ప్రభుత్వం నిర్దేశించిన తరగతుల వరకే నడుపుతున్నారా? ఆటస్థలం, కనీస అగ్నిమాపక భద్రత ఉన్నాయా? అన్న ప్రాథమిక ప్రశ్నలకే సమాధానాలు కరువవుతున్నాయి. అడ్మిషన్ మొదలుకొని యూనిఫాంలు, పుస్తకాల దాకా ప్రతిదానికీ అధిక ధరలు నిర్ణయించి నిలువుదోపిడీ చేస్తుంటే.. సామాన్య, మధ్యతరగతి తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల కోసం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

**అనుమతి ప్రైమరీకే.. నడిపేది హైస్కూల్!**

నగర పరిధిలో గుర్తింపు పరిమితిని దాటి తరగతులు నిర్వహిస్తున్న బడుల సంఖ్య రోజురోజుకూ పుట్టగొడుగుల్లా పెరిగిపోతోంది. కేవలం ప్రైమరీ స్కూల్ (ఐదో తరగతి వరకు) మాత్రమే అనుమతి తీసుకుని, బోర్డులపై మాత్రం పదో తరగతి వరకు అని ప్రచారం చేసుకుంటూ అడ్మిషన్లు లాగేస్తున్నారు. కొన్ని సంస్థలైతే అసలు విద్యాశాఖ నుంచి ఎలాంటి ప్రాథమిక అనుమతులూ తీసుకోకుండానే కార్పొరేట్ హంగులతో కూడిన రంగురంగుల బ్రోచర్లు, ఫ్లెక్సీలతో ప్రచారం మొదలెడుతున్నాయి. తీరా విద్యా సంవత్సరం ముగిసే సమయానికి లేదా పబ్లిక్ పరీక్షల వేళ హాల్ టికెట్లు రాని పరిస్థితి ఎదురైనప్పుడే మోసపోయామని తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. గుర్తింపు లేని సంస్థల్లో చదివితే పిల్లల విద్యా రికార్డులే చెల్లకుండా పోయే ప్రమాదం పొంచి ఉన్నా.. నిఘా ఉంచాల్సిన యంత్రాంగం ఏటా చూసీచూడనట్లు వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**అగ్గిపెట్టెల్లాంటి గదులు.. నడవడానికే రాని జాగ!**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలకు నిర్దిష్ట విస్తీర్ణంలో ఆటస్థలం, వెలుతురు వచ్చే విశాలమైన తరగతి గదులు, సరిపడా మరుగుదొడ్లు, తాగునీటి వసతితో పాటు అత్యవసర అగ్నిమాపక (ఫైర్ సేఫ్టీ) ఏర్పాట్లు తప్పనిసరి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా మారింది. అపార్ట్‌మెంట్ల గ్రౌండ్ ఫ్లోర్లు, ఇరుకైన గల్లీల్లోని నివాస సముదాయాల్లో గాలి, వెలుతురు సరిగా రాని చిన్న గదుల్లో వందలాది మంది చిన్నారులను కుక్కుతున్నారు. పిల్లలు ఆడుకోవడానికి కాదు కదా, కనీసం ఉదయం ప్రార్థన (అసెంబ్లీ) చేసుకోవడానికి కూడా చోటు దక్కడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే అత్యవసరంగా బయటకు పరుగులు తీసే దారి కూడా లేని భవనాల్లో పాఠశాలలు ఎలా నడుస్తున్నాయన్నది అధికారులకే తెలియాలి.

**పుస్తకాలు, యూనిఫాంల 'సిండికేట్' దందా!**

ఫీజుల నియంత్రణ అనేది కేవలం ప్రభుత్వ ప్రకటనలకే పరిమితమైంది. అడ్మిషన్, ట్యూషన్ ఫీజుల పేరిట వేలకు వేలు లాగడమే కాకుండా.. యాక్టివిటీలు, డిజిటల్ తరగతులు, ల్యాబ్స్ పేరుతో అడ్డగోలుగా వసూళ్లు గుంజుతున్నారు. ఇవి చాలవన్నట్లు పాఠశాల యాజమాన్యాలు సూచించిన నిర్దిష్ట దుకాణాల్లోనే లేదా నేరుగా స్కూల్ కౌంటర్లలోనే పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, బెల్టులు కొనాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. బయట మార్కెట్ కంటే రెట్టింపు, మూడు రెట్ల ధరలకు వీటిని అమ్ముతూ బహిరంగంగా వ్యాపారం చేస్తున్నారు. విద్యా సంస్థల ప్రాంగణాల్లో వాణిజ్య అమ్మకాలు సాగించకూడదన్న ప్రభుత్వ ఉత్తర్వులను పూర్తిగా బేఖాతరు చేస్తున్నారు.

**పేద విద్యార్థుల ఉచిత సీట్లకు ఎసరు!**

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రవేశ స్థాయి తరగతుల్లో 25 శాతం సీట్లను ఆర్థికంగా వెనుకబడిన, బలహీన వర్గాల పిల్లలకు ఉచితంగా కేటాయించాల్సి ఉంది. కానీ నగరంలోని పలు బడుల్లో ఈ చట్టం అమలు కాగితాలకే పరిమితమవుతోంది. అర్హులైన పేద పిల్లలు దరఖాస్తు చేసుకున్నా.. ఏవో సాంకేతిక కారణాలు చూపి దరఖాస్తులను బుట్టదాఖలు చేస్తున్నారు. మరికొన్ని పాఠశాలల్లో అసలు ఈ కోటా వివరాలను నోటీస్ బోర్డులపై పెట్టకుండా గోప్యంగా ఉంచుతున్నారు. పేదలకు చట్టబద్ధంగా దక్కాల్సిన ఈ హక్కును నీరుగారుస్తూ.. ఆ సీట్లను కూడా అక్రమంగా దారి మళ్లిస్తున్నారన్న విమర్శలు బలంగా ఉన్నాయి.

**పర్యవేక్షణ శూన్యం.. చర్యలేవీ?**

ఏటా విద్యా సంవత్సరం ఆరంభంలో హడావుడి తనిఖీలు చేపడతామని, గుర్తింపు లేని పాఠశాలలను మూసివేయిస్తామని విద్యాశాఖ అధికారులు ప్రకటనలు చేయడం, ఆ తర్వాత మిన్నకుండిపోవడం పరిపాటిగా మారింది. అక్రమాలకు పాల్పడుతున్న సంస్థలకు కేవలం నామమాత్రపు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారే తప్ప, కఠినంగా మూసివేయడం గానీ, జరిమానాలు విధించడం గానీ చేయడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి, అధికారిక గుర్తింపు ఉన్న పాఠశాలల జాబితాను, వాటికి అనుమతించిన తరగతుల వివరాలను ప్రజలందరికీ తెలిసేలా ఆన్‌లైన్ పోర్టల్‌లో బహిరంగంగా అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది. నిబంధనలను బేఖాతరు చేస్తూ నడుస్తున్న బడులను తక్షణమే సీజ్ చేయడంతో పాటు, ప్రతి పాఠశాలలో ఫీజుల వివరాలను తప్పనిసరిగా నోటీస్ బోర్డులపై ప్రదర్శించేలా కఠిన నిబంధనలు అమలు చేయాలి. ముఖ్యంగా విద్యాహక్కు చట్టం కింద కేటాయించాల్సిన 25 శాతం ఉచిత సీట్ల ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి, అర్హులైన పేద విద్యార్థులకు న్యాయం జరిగేలా పర్యవేక్షణ పెంచాలి. విద్య అనేది కేవలం లాభాలు దండుకునే వ్యాపార సరుకు కాదని, అది భావితరాల భవిష్యత్తు అని పాలకులు, అధికారులు గుర్తించి క్షేత్రస్థాయిలో కఠినంగా వ్యవహరించినప్పుడే ఈ నిలువుదోపిడీకి పూర్తి అడ్డుకట్ట పడుతుంది.

# వరద నీరు చెరువుకు..

**చెరువుల ఇన్‌లెట్లు - ఔట్‌లెట్లలో పూడిక తొలగింపు పనులు**





**హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 13:** వర్షం ఎప్పుడు పడినా.. ఏ మాత్రం కురిసినా వరద నీరు నేరుగా చెరువులకు చేరేలా హైడ్రా చర్యలు చేప ట్టింది. కాలువలను శుభ్రం చేస్తోంది. పూడికను తొలగించడంతో పాటు.. మధ్యలో ఎలాంటి అంతరాయాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇందు కుగాను హైడ్రా ఎంఆర్‌టీ (మాన్సూన్ రెస్పాన్స్ టీమ్) టీమ్‌లతో పాటు.., హైడ్రా డీఆర్ ఎఫ్ బృందాలను పెద్దసంఖ్యలో వినియోగిస్తోంది. నగరం నలువైపులా చెరువుల చెంత ఉన్న అపరిశుభ్ర వాతావరణాన్ని తొలగించడంతో పాటు.. చెరువుకు ఉండే ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లు సరిగా ఉన్నాయా లేదా చూస్తున్నారు. కొన్ని చెరువుల్లో గుర్రపుడెక్కను తొలగి స్తున్నారు. చెరువుల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను, ముళ్ల పొదలను తొలగించి అందరికీ యాక్సెస్ ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షాకాలంలో వరద ముప్పును తగ్గించేందుకు రంగంలోకి దిగే హైడ్రా బృందాలు.. వర్షాలు లేని సమయంలో చెరువుల పరిరక్షణ, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాయి. చెరువుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం, పూడికతీత చేపట్టడం, నీటిపై విస్తరించే గుర్రపుడెక్కను తొలగించడం వంటి పనులతో పాటు, నీటి ప్రవాహ వ్యవస్థను మెరుగుపరిచే చర్యలకూ ప్రాధాన్యం ఇస్తున్నాయి. అత్యవసర సమయాల్లో వరద నివారణకు సిద్ధంగా ఉంటూనే, సాధారణ రోజుల్లోనూ జలవనరుల నిర్వహణకు ఎంఆర్‌టీ (ఏంఆర్ టి) బృందాల సేవలను హైడ్రా వినియోగిస్తోంది.

**చెరువుల్లో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు**

దసరా పండగ వేళ బతుకమ్మ ఆటలకు వీలుండే చెరువులకు ప్రాధాన్యతనిస్తూ వ్యర్థాల తొలగింపుతో పాటు.. పరిసరాల్లో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను క్లియర్ చేస్తున్నారు. ఎం ఆర్ టీ, డీఆర్ ఎఫ్ బృందాలు పెద్దమొత్తంలో రంగంలోకి దిగి పనులు చేస్తున్నాయి. కుత్బుల్లాపూర్లోని లింగంచెరువు, దూలపల్లి లేక్, లింగంపల్లిలోని గోపి చెరువు, మియాపూర్‌లోని గుర్నాథచెరువు, పాలె చెరువు, మైసమ్మకుంట, హయత్‌నగర్‌లోని బతుకమ్మకుంట, మన్సూరాబాద్ లేక్, సరూర్‌నగర్ ఇలా నగరం నలువైపులా ఉన్న చెరువులను శుభ్రం చేస్తున్నారు. చెరువుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను తొలగించడంతో పాటు, అవసరమైన చోట పూడికతీత పనులు చేపడుతోంది. చెరువుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా జలవనరుల నిర్వహణను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటోంది. గుర్రపుడెక్కను తొలగించడం, నీటి ఉపరితలాన్ని శుభ్రపరచడం వంటి పనులపైనా హైడ్రా దృష్టి సారించింది. వ్యర్థాల తొలగించడం ద్వారా చెరువులను మెరుగైన స్థితిలో ఉంచేందుకు ప్రయత్నిస్తోంది.

**చెరువుల్లోకి నీరు చేరేలా..**

ప్రతి చెరువుకు ఇన్‌లెట్ - ఔట్‌లెట్ సరిగా ఉండేలా హైడ్రా చర్యలు తీసుకుంటోంది. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం ద్వారా వెంటనే వర్షపు నీరు చెరువుకు చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇన్‌లెట్లు, ఔట్‌లెట్ల అభివృద్ధిపై దృష్టి సారించింది. చెరువుల్లోకి నీరు చేరే మార్గాల్లో అడ్డంకులను గుర్తించడం, బయటకు వెళ్లే నీటికి ఆటంకాలు లేకుండా చూడటం, అనుసంధాన నాలాల పరిస్థితిని మెరుగుపరచడం వంటి పనులను ముమ్మరం చేసింది హైడ్రా. వర్షాకాలంలో పని చేసే ఎంఆర్‌టీ బృందాలు ముమ్మరంగా ఈ పనులు చేపట్టాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవడంలేదు.. ఒక్కోసారి కుండపోత వర్షాలు కురిసే ప్రమాదం కూడా ఉంది. వర్షాలు పడితే నేరుగా వరద నీరు చెరువుకు చేరేలా ఇన్‌లెట్లను సిద్ధం చేస్తున్నారు. కూకట్‌పల్లి నాలాలో పూడిక తీత పనులను పెద్దయెత్తున చేపట్టింది హైడ్రా. ఇప్పటికే 40 ట్రక్కుల వరకూ చెత్తను తరలించింది. దాదాపు 3 కిలోమీటర్ల మేర పూడికను తొలగించి వరద ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చేస్తోంది.

# ఎన్‌ఎల్‌ఎంసీ తొలి పూర్తిస్థాయి ఈ-వేలం

**తొలిరోజే ఆర్ఐఎన్ఎల్ భూములకు ?366.33 కోట్ల బిడ్లు; 150 ప్లాట్ల విక్రయం**

**చదరపు గజానికి ?1.80 లక్షలు దాటిన గరిష్ఠ వేలం ధర**

**బలమైన మార్కెట్ డిమాండ్‌కు నిదర్శనం**




**హైదరాబాద్ పిఐబీ, వెలుతురు అక్టోబర్ 13:** విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్న రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)కు చెందిన విలువైన భూభాగాల ఈ-వేలంలో తొలిరోజు ప్రక్రియను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (డీపీఈ) కింద పనిచేస్తున్న నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ (ఎన్ఎల్ఎంసీ) విజయవంతంగా నిర్వహించింది. ఎన్ఎల్ఎంసీ చేపట్టిన తొలి ఎండ్-టు-ఎండ్ ఈ-వేలం కావడంతో మొదటి దశ సంస్థకు కీలక మైలురాయిగా నిలిచింది. మిగులు ప్రభుత్వ ఆస్తుల మానిటైజేషన్‌కు క్రమబద్ధమైన, పారదర్శక, సాంకేతిక ఆధారిత విధానాన్ని ఇది చాటింది. మొదటి దశలో వేలానికి ఉంచిన భూభాగాల్లో 150 ప్లాట్లు విజయవంతంగా అమ్ముడయ్యాయి. వీటి మొత్తం రిజర్వు ధర ?312.48 కోట్లు కాగా, విజయవంతమైన బిడ్ల విలువ ?366.33 కోట్లకు చేరింది. రిజర్వు ధర కంటే సగటున 17.23 శాతం అధికంగా బిడ్లు నమోదయ్యాయి. వేలంలో ఉంచిన ఆస్తులపై మార్కెట్ నుంచి మంచి స్పందన, ఆసక్తి కనిపించినట్లు ఈ ఫలితాలు సూచిస్తున్నాయి. ఈ వేలంలో ధరలు కూడా గణనీయ స్థాయికి చేరాయి. చదరపు గజానికి గరిష్ఠ వేలం ధర ?1.80 లక్షలు దాటింది. విశాఖపట్నంలోని అనుకూల ప్రాంతాల్లో ఉన్న భూభాగాలకు బలమైన మార్కెట్ డిమాండ్ ఉందని ఈ ధర నిర్ధారణ తెలియజేస్తోంది. ప్రభుత్వ ఆస్తుల ఆర్థిక సామర్థ్యాన్ని వెలికితీయడంలో పారదర్శక, పోటీతత్వ ఈ-వేలం ప్రక్రియ పాత్రను ఇది స్పష్టం చేస్తోంది. ఆర్ఐఎన్ఎల్ సమన్వయంతో ఎన్ఎల్ఎంసీ ఈ వేలానికి సదుపాయాలు కల్పిస్తోంది. క్వికర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (క్యూఐపీఎల్) ట్రాన్సాక్షన్ కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తోంది. రైల్‌టెల్ ఈ-నివిదా ప్లాట్‌ఫామ్ ద్వారా ఆన్‌లైన్ బిడ్డింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు.

## ప్రభుత్వం దృష్టికి

# రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు






**-టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి**

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 13 :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ ఉద్యోగులకు సంబంధించిన అనేక సమస్యలను పరిష్కరించుకున్నామని తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి పేర్కొన్నారు. అయినప్పటికీ ఇంకా కొన్ని సమస్యలు పరిష్కారం కావాల్సి ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలన్నింటినీ త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని రెవెన్యూ భవన్‌లో మంగళవారం టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి, తెలంగాణ తహసీల్దార్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, టీజీఆర్ఎస్ఏ ప్రధాన కార్యదర్శి బిక్షం, కోశాధికారి మల్లేష్, సీసీఎల్ఏ విభాగం అధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి చైతన్య, సహాధ్యక్షులు సుధాకర్‌రావు, చంద్రశేఖర్ మోర, రాష్ట్ర ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కార్యనిర్వాహక కార్యదర్శులు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. గత రెండేళ్లలో అసోసియేషన్ ఎన్నో విజయాలు సాధించిందని వి.లచ్చిరెడ్డి, బాణాల రాంరెడ్డి పేర్కొన్నారు. గత పదేళ్లలో ఎవరూ సాధించలేని విజయాలను టీజీఆర్ఎస్ఏ సాధించిందన్నారు. దీంతో రాష్ట్రంలో రెవెన్యూ శాఖకు పూర్వ వైభవం వచ్చిందని తెలిపారు. తక్కువ కాలంలోనే అసోసియేషన్ సాధించిన విజయాలు రెవెన్యూ ఉద్యోగులకు వరంగా మారాయన్నారు. రాబోయే కాలంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై బాణాల రాంరెడ్డి, వి.లచ్చిరెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు.

**సమావేశంలో చేసిన తీర్మానాలు**

రికార్డు సహాయకుడి నుంచి ఉప తహసీల్దార్ వరకు అన్ని హోదాల ఉద్యోగులకు పదోన్నతుల అవకాశం కల్పించాలి. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు ఎఫ్‌టీఏ మంజూరు చేయాలి. ప్రతి మండలానికి మర్యాదపూర్వక కార్యక్రమాల ఖర్చుల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. తహసీల్దార్ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులకు సరైన మరుగుదొడ్ల సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. శిథిలావస్థలో ఉన్న రెవెన్యూ కార్యాలయాల స్థానంలో కొత్త కార్యాలయాలు నిర్మించాలి. 61 ఏళ్లు పైబడిన గ్రామ రెవెన్యూ సహాయకుల వారసులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి. ధరణి నిర్వహణ సిబ్బంది, టీసీఓల సేవలను కొనసాగించాలి. సొంత నియోజకవర్గ నిబంధన నుంచి జీపీఓలకు మినహాయింపు ఇవ్వాలి. గ్రామ రెవెన్యూ సహాయకుల నుంచి జూనియర్ సహాయకులుగా నియమితులైన వారికి సీపీటీ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలి. వార్డు అధికారుల నుంచి జీపీఓలుగా వచ్చిన వారికి పురపాలక శాఖలో ప్రొబేషన్ ఖరారు చేయాలి.

## కార్యకర్త పబ్బ తిరుపతిని ఫోన్‌లో

# పరామర్శించిన మంత్రి బండి సంజయ్



**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 13:** తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన సీనియర్ కార్యకర్త, బిజెపి మండల పార్టీ ఉపాధ్యక్షులు పబ్బ తిరుపతి ఇటీవల ప్రమాదవశాత్తు ఆటో పై నుండి కిందపడటంతో ఆయన కాలు తీవ్రంగా గాయపడి ఫ్రాక్చర్ అయింది. ప్రస్తుతం ఆయన కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతికి ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తిరుపతికి మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులకు ఫోన్ ద్వారా సూచించారు. ఈ సందర్భంగా బిజెపి మాజీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి మాట్లాడుతూ... కేంద్ర మంత్రి బండి సంజయ్ పవిత్రమైన భవానీ దీక్షలో ఉండి కూడా, కార్యకర్త సంక్షేమాన్ని గుర్తుంచుకుని ఆరోగ్య పరిస్థితిపై వెంటనే స్పందించడం, ఆయనకు కార్యకర్తలపై ఉన్న ప్రేమాభిమానాలకు నిదర్శనమని కొనియాడారు. కార్యకర్త కష్టాల్లో ఉన్నాడని తెలిసిన వెంటనే స్పందించి ధైర్యం చెప్పడం అభినందనీయమని, ఈ విషయంలో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ కు తిమ్మాపూర్ మండల బిజెపి పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

# హకీంపేట్‌లో వ్యవసాయ మేళా

- ఏర్పాట్లను పర్యవేక్షించిన రాష్ట్ర ఉన్నతాధికారులు
- ఆన్ లైన్ గేమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి
- వికారాబాద్ ఎస్పీ స్నేహమే ప్ర



**వికారాబాద్, వెలుతురు అక్టోబర్ 13 :** హకీంపేట్‌లో వ్యవసాయ అనుబంధ శాఖల ఎక్స్‌పో నిర్వహణకు సంబంధించి ఏర్పాటు చేస్తున్న వేదిక, ఇతర ఏర్పాట్లను అగ్రికల్చర్ ప్లానింగ్ కమిషన్ సెక్రటరీ శ్రీ సురేంద్ర మోహన్, , జిల్లా కలెక్టర్ శ్రీ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎక్స్‌పోకు హాజరయ్యే ప్రజలు, రైతులు, వివిధ శాఖల ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమం సందర్భంగా ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, ప్రజల భద్రతకు సంబంధించిన అంశాలపై పోలీస్ శాఖ తరఫున తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించారు. అనంతరం జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, నిర్మాణ దశలో ఉన్న కొడంగల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత కాంట్రాక్టర్లను పనుల వివరాలు, ప్రస్తుత నిర్మాణ దశ, మిగిలి ఉన్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు.

## శారదీయ నవరాత్రి

# దుర్గామాత ఆరాధనతో మేల్కొనే మహిళా శక్తి

భారతీయ సంస్కృతిలో శక్తి, విశ్వాసం, ఆధ్యాత్మిక సాధన, ఆత్మశుద్ధిని చాటే పవిత్ర పండుగ శారదీయ నవరాత్రి. దుర్గామాత తొమ్మిది రూపాలను ఆరాధిం చడం మన జీవితాల్లో ధైర్యం, సంయమనం, సహ నం, కరుణ, ఆత్మవిశ్వాసాన్ని అలవరచుకోవాలనే స్ఫూర్తిని ఇస్తుంది. ఈ తొమ్మిది రోజులు పూజలు, ప్రార్థనలకే పరిమితమైన సందర్భం కాదు.. మనలోని శక్తిని గుర్తించి, సమాజం పట్ల మన బాధ్యతలను నెరవేర్చాలనే సంకల్పం తీసుకునే సమయం కూడా.నవరాత్రుల్లో ప్రతి రోజూ ఒక ప్రత్యేక సందేశాన్ని అందిస్తుంది. శైలపుత్రి దృఢ సంకల్పానికి స్ఫూర్తినిస్తారు. బ్రహ్మచారిణి తపస్సు, క్రమశిక్షణకు ప్రతీకగా నిలుస్తారు. చంద్రఘంట ధైర్యస్వరూపిణి కాగా, కూష్మాండ సృజనాత్మకతకు ప్రేరణ నిస్తారు. స్కందమాత మాతృవాత్సల్యానికి, కాత్యాయనీ అన్యాయంపై పోరాటానికి, కాళరాత్రి నిర్భయత్వానికి, మహాగౌరీ పవిత్రతకు, సిద్ధిదాత్రి ఆధ్యాత్మిక సాధన పరిపూర్ణతకు ప్రతీకలు.ఉపవాసం, ధ్యానం, మంత్రో చ్చారణ, సేవ ద్వారా మనస్సును ఏకాగ్రం చేసి, జీవితంలో సానుకూలత, క్రమశిక్షణ పెంపొందించు కోవచ్చు. మన ఆలోచనలను శుద్ధి చేసి, ప్రవర్తనలో సున్నితత్వాన్ని నింపి, ఇతరుల సంక్షేమం కోసం పనిచేసేలా ప్రేరేపించేదే నిజమైన ఆధ్యాత్మిక సాధన.

- తొమ్మిది రోజుల ఆధ్యాత్మిక సాధన
- అంతరంగ బలం, సాధికార సమాజ నిర్మాణ సంకల్పం
- సావిత్రి ఠాకూర్




### మహిళా శక్తికి దేవీ ఆరాధనతో గౌరవం

భారతీయ సంప్రదాయంలో మహిళను శక్తిస్వరూపిణిగా భావిస్తారు. ప్రేమ, కరుణతో పాటు అసాధారణ ధైర్యం, నాయకత్వ సామర్థ్యం, సవాళ్లను అధిగమించే శక్తి మహిళల్లో ఉంటుందని దుర్గామాత రూపం గుర్తుచేస్తుంది. నేడు మహిళలు విద్య, విజ్ఞానం, క్రీడలు, పాలన, వ్యాపార రంగం, వ్యవసాయం, రాజకీయాలు సహా ప్రతి రంగంలో తమ ప్రతిభ, సామర్థ్యాలను చాటుతున్నారు. మహిళల పట్ల నిజమైన గౌరవం దేవతలను పూజించడానికే పరిమితం కారాదు. ప్రతి బాలికకు విద్య, ఆరోగ్య సంరక్షణ, భద్రత, పురోగతిలో సమాన అవకాశాలు లభించేలా చూడటం మన బాధ్యత. మహిళలు స్వావలంబన సాధించేలా కృషి చేయడం, వారి నిర్ణయాలను గౌరవించడం, వివక్షలేని వాతావరణం కల్పించడం ద్వారానే దేవీ ఆరాధనకు నిజమైన సార్థకత చేకూరుతుంది. ఒక మహిళ చదువుకుని స్వావలంబన సాధిస్తే, ఆ సానుకూల ప్రభావం కుటుంబమంతటికీ, సమాజానికీ విస్తరి స్తుంది. అందుకే మహిళా సాధికారత మహిళల అభివృద్ధికే పరిమితమైన అంశం కాదు.. దేశ పురోగతికి మూలస్తంభం. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మహిళలకు గౌరవం నుంచి దేశ నిర్మాణం దిశగా అడుగులు: మహిళా, శిశు అభివృద్ధికి సరికొత్త దార్శనికత మహిళలు, చిన్నారులకు భద్రమైన, ఆరోగ్యకరమైన, అవకాశాలతో నిండిన వాతావరణాన్ని సృష్టించడమే లక్ష్యంగా కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ పనిచేస్తోంది. మాతా శిశు ఆరోగ్యం, పోషణ, బాలికల విద్య, మహిళల భద్రత, ఆర్థిక స్వావలంబన మన సమష్టి కృషిలో ప్రధాన ప్రాధాన్యాలుగా ఉన్నాయి. మహిళా సాధికారతను జాతీయాభివృద్ధిలో అంతర్భాగం చేసేందుకు గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పలు కీలక కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ దార్శనికత మహిళల అభివృద్ధితో ఆగిపోదు.. అభివృద్ధి ప్రక్రియకు వారు నాయకత్వం వహించేలా చేయడమే లక్ష్యం. ఈ దిశగా 2023 నారీ శక్తి వందన్ అధినియమ్ చారిత్రక కార్యక్రమంగా నిలిచింది. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు మూడింట ఒక వంతు, అంటే 33 శాతం స్థానాల రిజర్వేషన్‌కు ఈ చట్టం వీలు కల్పిస్తుంది. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం, నిర్ణయాల రూపకల్పనలో వారి పాత్రను బలోపేతం చేయడం దిశగా ఇది కీలక అడుగు. కేంద్ర ప్రభుత్వం మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారతతో పాటు వారి భద్రత, ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇచ్చింది. బేటీ బచావో, బేటీ పడావో ప్రచారం బాలికల పట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తూ, వారి విద్యను ప్రోత్సహిస్తోంది. మిషన్ శక్తి మహిళల భద్రత, సహాయం, సాధికారతపై దృష్టి సారిస్తే, సక్షమ్ అంగన్‌వాడీ, పోషణ్ 2.0 మాతా శిశు పోషణను బలోపేతం చేస్తున్నాయి. నిర్దేశిత నిబంధనల మేరకు అర్హులైన గర్భిణులు, పాలిచ్చే తల్లులకు ఆర్థిక సహాయం అందించడంలో ప్రధానమంత్రి మాతృ వందన యోజన కీలక పాత్ర పోషిస్తోంది.

### ఈ నవరాత్రుల్లో మహిళలకు గౌరవం, సేవకు సంకల్పం

శక్తి అంటే కేవలం బలం కలిగి ఉండటం కాదు; సత్యం, న్యాయం, ప్రజా సంక్షేమం కోసం దాన్ని వినియోగించడమే నిజమైన అర్థమని శారదీయ నవరాత్రి మనకు బోధిస్తుంది. ఈ పవిత్ర సందర్భంలో బాలికల పురోగతికి అవకాశాలు కల్పించాలని, మహిళల సేవలను గౌరవించాలని, అవసరంలో ఉన్న మహిళలు, చిన్నారులకు అండగా నిలవాలని మనమంతా సంకల్పిద్దాం. ఈ తొమ్మిది రోజుల ఆధ్యాత్మిక సాధనను మన జీవితాల్లో సానుకూల మార్పునకు సాధనంగా మలుచుకుందాం. మన విశ్వాసం అంతరంగ బలానికి మూలం కావాలి. సేవకు భక్తి మార్గం వేయాలి. మన సంకల్పం మహిళా సాధికారత, శిశు సంక్షేమానికి సరికొత్త దిశ చూపాలి. దుర్గామాత కృపతో ప్రతి కుటుంబం సుఖశాంతులు, సౌభాగ్యాలతో వర్ధిల్లాలని.. ప్రతి మహిళ ఆత్మగౌరవంతో జీవిస్తూ స్వావలంబన సాధించే శక్తి పొందాలని.. ప్రతి బాలిక తన కలలను సాకారం చేసుకోవాలని ప్రార్థిద్దాం. మహిళలకు గౌరవం, చిన్నారులకు సురక్షిత భవిష్యత్తు, ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు అందే భారతదేశ నిర్మాణానికి కలిసికట్టుగా కృషి చేద్దాం. శారదీయ నవరాత్రి సందర్భంగా ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు.



జై మాతా దీ!

(రచయిత్రి కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి)

## మైల మంచానికే నా?

# బంగారానికి లేదా?



మరణించిన మనిషి వస్తువులకు మనం ఇచ్చే విలువ, ఆ మనిషికి ఇచ్చిన గౌరవంతో సమానంగా ఉందా? అనేదే. మనవాళ్లు చనిపోయినప్పుడు వారు వాడిన మంచం, కంచం, దిండు, దుప్పటిని "మైల పడింది" అంటూ బయట పడేస్తాం. కానీ అదే వ్యక్తి కష్టపడి సంపాదించిన బంగారాన్ని, ఇంటిని, భూమిని, డబ్బును మాత్రం ఉంచుకుంటాం. అప్పుడు సహజంగానే ఒక ప్రశ్న వస్తుంది: వారు వాడిన వస్తువులకు మైల పడితే, వారు సంపాదించిన ఆస్తులకు ఎందుకు పడదు? ఈ ప్రశ్న ఆచారాన్ని అవమానించడానికి కాదు. ఆచారం పేరుతో మనం చేసే పనుల్లో ఎంత ఆలోచన ఉంది, ఎంత భయం ఉంది, ఎంత స్వార్థం ఉంది అన్నది పరిశీలించుకోవడానికి. ఒక మనిషి వాడిన వస్తువుల్లో కేవలం వస్తువుల విలువ మాత్రమే ఉండదు. వాటితో అనుబంధించిన జ్ఞాపకాలు కూడా ఉంటాయి. నాన్న పడుకున్న మంచంలో ఆయన అలసటకు సంబంధించిన జ్ఞాపకం ఉంటుంది. అమ్మ కప్పుకున్న దుప్పటిలో ఆమె ఆప్యాయత గుర్తుకొస్తుంది. వారు భోజనం చేసిన కంచాన్ని చూస్తే, వారితో కలిసి గడిపిన రోజులు మనసులో మెదులుతాయి. ఆ వస్తువులు వారి స్థానాన్ని భర్తీ చేయలేవు. కానీ వారి జీవితాన్ని గుర్తుచేస్తాయి. అలాంటి వస్తువులను కేవలం "వాళ్లు చనిపోయారు కాబట్టి ఇవి పనికిరావు" అనే భావంతో పారేయడం మన అనుబంధాన్ని కూడా ప్రశ్నిస్తుంది. నిన్నటి వరకు మనవాళ్లు ఉపయోగించిన వస్తువు, వారు మరణించగానే అసహ్యించుకోవాల్సినదిగా ఎందుకు మారాలి? మరణం ఒక మనిషిని మనకు దూరం చేస్తుంది. ఆయనపై ఉన్న ప్రేమను, గౌరవాన్ని దూరం చేయాల్సిన అవసరం లేదు. అయితే వస్తువులు తొలగించే ప్రతి కుటుంబాన్నీ స్వార్థపరులుగా తీర్పు ఇవ్వడం కూడా సరికాదు. కొందరికి వాటిని చూసినప్పుడల్లా బాధ ఎక్కువవుతుంది. వస్తువును ఉంచుకున్నారా, తొలగించారా అన్న ఒక్క విషయంతో వారి ప్రేమను కొలవలేం. దాని వెనుక ఉన్న కారణాన్ని కూడా చూడాలి. కానీ విలువ తక్కువగా ఉన్న వస్తువులను "మైల" పేరుతో పారేస్తూ, విలువ ఎక్కువగా ఉన్న ఆస్తులను మాత్రం ఆసక్తిగా స్వీకరిస్తే---అక్కడ మన ప్రవర్తనలో వైరుధ్యం కనిపిస్తుంది. ఒకే మనిషికి సంబంధించిన వస్తువుల విషయంలో మన నిర్ణయం వాటి ధరను బట్టి మారుతుంటే, ఆ నిర్ణయాన్ని నిజంగా నడిపిస్తున్నది ఆచారమా, ఆర్థిక ప్రయోజనమా అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. మనకు ఉపయోగపడేది అయితే వారసత్వం...

**మనకు ఉపయోగపడనిది అయితే మైల...**

అనే ధోరణి ఉంటే, మన ఆలోచనలో మార్పు రావాలి. పాత వస్తువు ఉపయోగించలేని స్థితిలో ఉంటే తొలగించవచ్చు. శుభ్రం చేయాల్సిన అవసరం ఉంటే ఆ అవసరాన్ని బట్టి నిర్ణయం తీసుకోవచ్చు. ఉపయోగపడే వస్తువును ఉంచుకోవచ్చు; అవసరమైన వారికి గౌరవంగా ఇవ్వవచ్చు. కుటుంబానికి విలువైన జ్ఞాపకంగా అనిపించిన వస్తువును భద్రపరచుకోవచ్చు. ఈ నిర్ణయాల్లో అవసరం, పరిస్థితి, అనుబంధం ఉండాలి. మరణించిన వ్యక్తి పట్ల చులకన భావం ఉండకూడదు. మనవాళ్లు మనకు ఇచ్చింది బంగారం, భూమి, ఇల్లు మాత్రమే కాదు. మన కోసం వెచ్చించిన సమయం, చేసిన త్యాగాలు, నేర్పిన విలువలు, అందించిన ప్రేమ కూడా వారి వారసత్వమే. వారి సంపాదనను స్వీకరించినంత గౌరవంతో వారి మంచితనాన్ని కూడా కొనసాగించగలగాలి. వారు కోరుకున్న కుటుంబ ఐక్యతను కాపాడటం, వారు నేర్పిన నిజాయితీతో జీవించడం, వారి పేరుతో ఒక మంచి పని చేయడం---ఇవీ వారికి ఇచ్చే గౌరవంలో భాగాలే. అన్నిటికంటే పెద్ద విషయం ఏమిటంటే, మనిషి బతికున్నప్పుడే ఆయనకు ప్రేమ, ఆదరణ, గౌరవం అందాలి. చనిపోయిన తరువాత వస్తువుల గురించి ఎంత చర్చించినా, బతికున్నప్పుడు వినని మాటను తిరిగి వినలేం. ఇవ్వని ఆప్యాయతను తిరిగి ఇవ్వలేం. అందుకే మనవాళ్లు ఉన్నప్పుడే వారి దగ్గర కూర్చోవాలి, వారి బాధ తెలుసుకోవాలి, వారికి తోడుగా ఉండాలి. మనవాళ్లు చనిపోయారని వారి జ్ఞాపకాలను అపవిత్రంగా చూడకూడదు. వారు సంపాదించిన ఆస్తిలో వారి కష్టం ఉన్నట్టే, వారు వాడిన సాధారణ వస్తువుల్లో కూడా వారి జీవితం ఉంది. వారి బంగారానికి ఇచ్చే విలువలో కొంతైనా వారి జ్ఞాపకాలకు ఇవ్వగలిగితే... వారి ఆస్తిపై చూపే ఆసక్తిలో కొంతైనా వారు నేర్పిన విలువలపై చూపగలి గితే... అదే మన అనుబం ధానికి అర్థం. అదే వారికి మనం ఇచ్చే నిజమైన గౌరవం.



-మీ నక్క యాదగిరి

# 'అభివృద్ధి ఆర్భాటం సరే.. పేదవాడికి వైద్యం ఎక్కడ?'

***పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వైద్య వ్యవస్థ.. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందా?...హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతున్నామని పాలకులు గొప్పలు చెప్పుకుంటున్నారు. పెట్టుబడులు, ఐటీ సంస్థలు, భారీ నిర్మాణాలు, రహదారులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. కానీ అదే మహానగరంలో పేదవాడు అనారోగ్యానికి గురైతే కనీస వైద్యం అందుతుందనే భరోసా లేకపోతే ఈ అభివృద్ధి ఎవరి కోసం? ఆకాశాన్ని తాకే భవనాలు నిర్మించగలిగిన ప్రభుత్వానికి, ఆసుపత్రుల్లో ప్రాణాలు నిలబెట్టే మందులు అందుబాటులో ఉంచడం సాధ్యం కావడం లేదా? నగరానికి ప్రపంచ స్థాయి గుర్తింపు రావాలంటే ఎత్తైన భవనాలు, విశాలమైన రహదారులు మాత్రమే సరిపోవు. సామాన్యుడికి అందుబాటులో ఉండే నాణ్యమైన వైద్యం, బాధ్యతగా పనిచేసే వైద్య సిబ్బంది, ప్రాణాలకు భరోసా ఇచ్చే ప్రభుత్వ ఆసుపత్రులు కూడా అవసరం. ఇవి లేకుండా అభివృద్ధి గురించి చేసే ప్రకటనలన్నీ ఆర్భాటపు ప్రచారానికే పరిమితమవుతాయి. ప్రభుత్వ ఆసుపత్రి పేదవాడికి కేవలం చికిత్స అందించే భవనం కాదు. ప్రైవేటు ఆసుపత్రుల్లో వేలాది, లక్షలాది రూపాయలు ఖర్చు చేయలేని కుటుంబాలకు అదే చివరి ఆశ.***

రెక్కాడితే గాని డొక్కాడని కార్మికుడు, ఆటో నడిపే డ్రైవర్, భవన నిర్మాణ కార్మికుడు, వీధి వ్యాపారి, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారులు ప్రభుత్వ వైద్యంపైనే ఆధారపడతారు. అలాంటి వ్యవస్థలో మందుల కొరత, వైద్య సిబ్బంది గైర్హాజరు, సౌకర్యాల లేమి, రోగుల పట్ల నిర్లక్ష్యం వంటి సమస్యలపై ఫిర్యాదులు వస్తుంటే ప్రభుత్వం వాటిని సాధారణ విషయాలుగా చూడకూడదు. పేదవాడికి జబ్బు చేయడం ఒక కష్టం అయితే, ఆ జబ్బుకు చికిత్స అందకపోవడం అంతకంటే పెద్ద విషాదం. వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన మనిషికి భరోసా లభించాల్సింది పోయి, అక్కడి పరిస్థితులు మరింత ఆందోళనకు గురిచేస్తే ప్రజారోగ్య వ్యవస్థ తన ప్రాథమిక బాధ్యతను నిర్వర్తిస్తున్నట్టేనా? గాంధీ ఆసుపత్రి, ఉస్మానియా ఆసుపత్రి వంటి ప్రధాన ప్రభుత్వ వైద్య సంస్థలతో పాటు హైదరాబాద్‌లోని ఇతర ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రతిరోజూ వేలాది మంది రోగులు వస్తుంటారు. తెలంగాణలోని గ్రామీణ, మారుమూల ప్రాంతాల నుంచి కూడా మెరుగైన వైద్యం కోసం ప్రజలు నగరానికి చేరుకుంటారు. అలాంటి చోట్ల రోగుల సంఖ్యకు తగిన వైద్య సేవలు అందకపోవడం, అవసరమైన మందుల కోసం బయటకు వెళ్లాల్సి రావడం, పరీక్షల కోసం ఎక్కువసేపు వేచి ఉండాల్సి రావడం వంటి ఫిర్యాదులు వినిపిస్తే వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. పెద్ద ఆసుపత్రులు ఉన్నాయని చెప్పుకోవడం పాలకుల గొప్పతనం కాదు. వాటికి వచ్చిన రోగులకు సమయానికి చికిత్స అందించడం, అవసరమైన మందులు సమకూర్చడం, ప్రాణాపాయ పరిస్థితుల్లో తక్షణ వైద్య సహాయం కల్పించడమే ప్రభుత్వ పనితీరుకు అసలైన కొలమానం. భారీ భవనాలున్నా వైద్యులు అందుబాటులో లేకపోతే, మందులు లభించకపోతే, రోగులకు గౌరవం దక్కకపోతే ఆ నిర్మాణాలకు ప్రజల జీవితాల్లో ప్రయోజనం ఏముంటుంది? అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స అందకపోవడం మరింత ఆందోళనకరం. ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి, అకస్మాత్తుగా అస్వస్థతకు గురైన వృద్ధుడికి, తీవ్ర జ్వరంతో బాధపడుతున్న చిన్నారికి సకాలంలో వైద్యం అందకపోతే ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది. ప్రాథమిక మందులు, అవసరమైన వైద్య పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది అందుబాటులో ఉండటం ప్రతి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తప్పనిసరి. ఇవి అదనపు సౌకర్యాలు కావు, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఉండాల్సిన కనీస ఏర్పాట్లు. అత్యవసర వైద్య సేవల్లో లోపాలు ఉన్నాయనే ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులు బాధ్యత నుంచి తప్పించుకోకుండా విచారణ జరిపి, లోపాలను తక్షణమే సరిదిద్దాలి. చికిత్స ఆలస్యం కావడం వల్ల జరిగిన నష్టాన్ని తర్వాతి హామీలు భర్తీ చేయలేవనే విషయాన్ని పాలకులు గుర్తించాలి. వైద్య సేవల నాణ్యతకు సిబ్బంది కొరత కూడా ప్రధాన సమస్యగా మారుతుంది. వైద్యులు, నర్సులు, ఫార్మసిస్టులు, ప్రయోగశాల సిబ్బంది, వార్డు సహాయకులు, పారిశుద్ధ్య కార్మికులు సరిపడా లేకపోతే ఆసుపత్రి మొత్తం పనితీరు దెబ్బతింటుంది. ఒక వైద్యుడు పరిమిత సమయంలో వందలాది మంది రోగులను చూడాల్సి వస్తే ప్రతి ఒక్కరికీ తగిన శ్రద్ధ చూపడం కష్టమవుతుంది. దీని ఫలితంగా రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి రావచ్చు. నొప్పితో బాధపడుతున్న వ్యక్తి నుంచి అత్యవసర చికిత్స కోసం ఎదురుచూస్తున్న రోగి వరకు ఈ పరిస్థితుల భారాన్ని మోయాల్సి వస్తుంది. అందువల్ల ఖాళీ పోస్టులను భర్తీ చేయడం, పని భారాన్ని సమతుల్యం చేయడం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యత కావాలి. వైద్య సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిందే. అదే సమయంలో వారు సమర్థంగా సేవలందించేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగుల పట్ల కొందరు సిబ్బంది అమానవీయంగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తే వాటిని కూడా తీవ్రంగా పరిగణించాలి. వైద్యం కోసం వచ్చిన వ్యక్తి అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులతోనూ సతమతమవుతుంటాడు. అలాంటి సమయంలో అతడికి ఓదార్పు, గౌరవం, భరోసా అవసరం. వైద్యం అనేది మందులు ఇవ్వడం, పరీక్షలు నిర్వహించడం వరకే పరిమితం కాదు, రోగితో మానవీయంగా వ్యవహరించడం కూడా అందులో భాగమే. డబ్బున్నవాడు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగలడు. అక్కడ సౌకర్యాలు నచ్చకపోతే మరో ఆసుపత్రిని ఆశ్రయించగలడు. కానీ పేదవాడికి ఆర్థిక స్తోమత లేక ప్రభుత్వ ఆసుపత్రిపైనే ఆధారపడాల్సి వస్తుంది. అక్కడ కూడా అవమానం ఎదురైతే తన బాధను ఎవరికి చెప్పుకోవాలి? ప్రజల పన్నులతో నడిచే వ్యవస్థలో ప్రజలకే గౌరవం దక్కకపోవడం పాలనా వైఫల్యానికి నిదర్శనం కాదా? నగరంలోని బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరుపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి. చిన్న జబ్బులకు కూడా ప్రజలు పెద్ద ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తే అక్కడ రోగుల రద్దీ పెరుగుతుంది. స్థానిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండి, ప్రాథమిక పరీక్షలు సక్రమంగా జరిగి, అవసరమైన మందులు లభిస్తే అనేక అనారోగ్య సమస్యలను తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించవచ్చు. అయితే ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు



చేశామని ప్రకటించడంతో బాధ్యత ముగిసిపోదు. అవి నిర్ణీత సమయాల్లో పనిచేస్తున్నాయా? వైద్యులు విధులకు హాజరవుతున్నారా? మందుల నిల్వలు ఉన్నాయా? ప్రజలకు వాస్తవంగా సేవలు అందుతున్నాయా? అనే అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. ప్రజాధనంతో ఏర్పాటు చేసిన ప్రతి వైద్య కేంద్రం ప్రజలకు ఉపయోగపడేలా చూడటమే ప్రభుత్వానికి ఉండాల్సిన ప్రధాన లక్ష్యం. వైద్యుల హాజరు, విధి నిర్వహణ విషయంలోనూ పారదర్శకమైన పర్యవేక్షణ ఉండాలి. నిర్ణీత సమయానికి ముందే విధులు ముగిస్తున్నారనే ఆరోపణలు వస్తే హాజరు రికార్డులు, బయోమెట్రిక్ వివరాలు, రోగుల ఫిర్యాదులను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలి. విధుల్లో నిర్లక్ష్యం చేసినట్లు రుజువైతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. అయితే కొందరి తప్పిదాల ఆధారంగా వైద్యులందరినీ నిందించడం సరికాదు. క్లిష్ట పరిస్థితుల్లోనూ సేవలందిస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందికి తగిన గుర్తింపు, భద్రత, పని చేయడానికి అనుకూలమైన వాతావరణం కల్పించాలి. బాధ్యతను విస్మరించే వారిని ఉపేక్షించకుండా, నిజాయితీగా పనిచేసేవారికి ప్రభుత్వం అండగా నిలవాలి. పర్యవేక్షణ ఉద్దేశం ఉద్యోగులను భయపెట్టడం కాదు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా వ్యవస్థను క్రమబద్ధీకరించడం కావాలి. ఆసుపత్రుల్లో వైద్య సేవల పేరుతో అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులపైనా నిష్పక్షపాత విచారణ జరగాలి. రోగుల అవసరాలను ఆసరాగా చేసుకుని డబ్బులు అడుగుతున్నట్లు ఆరోపణలు వస్తే బాధితులు భయపడకుండా ఫిర్యాదు చేసే వాతావరణాన్ని కల్పించాలి. ఆసుపత్రుల్లో ఫిర్యాదు కేంద్రాలు, హెల్ప్‌డెస్క్‌లు, సంప్రదింపు నంబర్లు ఏర్పాటు చేసి, వచ్చిన ఫిర్యాదులపై నిర్ణీత గడువులో విచారణ జరపాలి. ఆరోపణలు రుజువైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో ఆధారాలు లేకుండా వ్యక్తులను దోషులుగా చిత్రీకరించకూడదు. పేదవాడు తన చికిత్స కోసం అప్పు చేసి తెచ్చుకున్న డబ్బును కూడా అక్రమ వసూళ్లకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడితే అది వైద్య వ్యవస్థలోని లోపమే కాదు, ప్రజల హక్కులపై దాడి కూడా అవుతుంది. ఇక్కడే కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితిని ఎంతవరకు మెరుగుపరిచింది? వైద్యారోగ్య శాఖకు ఎంత బడ్జెట్ కేటాయించింది? ఎన్ని ఖాళీ పోస్టులను భర్తీ చేసింది? మందులు, వైద్య పరికరాల కొనుగోలుకు ఎంత ఖర్చు చేసింది? ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంది? ఆసుపత్రుల్లో రోగుల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో ఎన్ని పరిష్కరించింది? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం గణాంకాలతో సమాధానం చెప్పాలి. ప్రతిపక్షాల విమర్శలను రాజకీయ ఆరోపణలుగా కొట్టిపారేయడం కంటే వాస్తవ పరిస్థితిని ప్రజల ముందుంచి, లోపాలు ఉంటే వాటిని సరిదిద్దుకోవడం పాలకులకు మేలు చేస్తుంది. వైద్యారోగ్య శాఖకు కేటాయించిన నిధులు, వాటి విడుదల, ఖర్చుల వివరాల్లో పారదర్శకత ఉండాలి. ఏ ఆసుపత్రికి ఎంత నిధులు చేరాయి? మందుల కొనుగోలు, వైద్య పరికరాల సమకూర్పు, భవనాల మరమ్మతులు, సిబ్బంది నియామకాల కోసం ఎంత మొత్తం వినియోగించారు? నిధులు కేటాయించినా ఖర్చు చేయకపోవడానికి కారణాలేమిటి? ఖర్చు చేసినప్పటికీ రోగులకు అవసరమైన సేవలు అందకపోతే దానికి బాధ్యులెవరు? అనే అంశాలను ప్రభుత్వం సమీక్షించాలి. అవసరమైతే వైద్యరంగంపై శ్వేతపత్రం విడుదల చేసి, నిధుల వినియోగం నుంచి ఆసుపత్రుల పనితీరు వరకు సమగ్ర వివరాలను వెల్లడించాలి. ప్రజాధనం ఎలా ఖర్చవుతోందని ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న హక్కు. దానికి సమాధానం చెప్పడం ప్రభుత్వ బాధ్యత. ముఖ్యమంత్రి, వైద్యారోగ్యశాఖ మంత్రి ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించాలి. అలాంటి పర్యటనలు ప్రచార కార్యక్రమాలుగా మిగిలిపోకుండా రోగులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలి. మందులు అందుతున్నాయా? పరీక్షలు సకాలంలో జరుగుతున్నాయా? వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారా? అత్యవసర సేవల్లో ఎలాంటి లోపాలున్నాయి? అనే అంశాలను పరిశీలించాలి. అధికారుల నివేదికలతో పాటు రోగుల అనుభవాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అయితే ఒకసారి ఆసుపత్రికి వెళ్లి హామీ ఇవ్వడంతో సమస్యలు పరిష్కారమవవు. గుర్తించిన లోపాలను సరిదిద్దేందుకు బాధ్యులను నియమించి, అమలుకు గడువు విధించి, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలి. నాయకుల పర్యటనల విలువ వారు ఎన్ని ఆసుపత్రులకు వెళ్లారన్నదానిలో కాదు, ఆ సందర్శనల వల్ల ప్రజలకు ఎంత ప్రయోజనం కలిగిందన్నదానిలో ఉంటుంది. గత ప్రభుత్వం వైద్యరంగంలో చేపట్టిన కార్యక్రమాలు, ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న చర్యలను రాజకీయ ప్రచారంతో కాకుండా ఫలితాల ఆధారంగా అంచనా వేయాలి. గత పాలకులపై విమర్శలు చేయడం వల్ల ప్రస్తుత సమస్యలకు పరిష్కారం లభించదు. గతంలో కొన్ని పథకాలు అమలు చేశామని చెప్పుకోవడం ద్వారా ప్రస్తుత లోపాలను సమర్థించుకోవడమూ సరికాదు. ఏ ప్రభుత్వమైనా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత నుంచి తప్పించుకోలేదు. ప్రభుత్వాలు మారవచ్చు, పాలకులు మారవచ్చు, కానీ ప్రజల ఆరోగ్య హక్కు మారదు. అందువల్ల ప్రజారోగ్యాన్ని రాజకీయ లాభనష్టాల కోణంలో కాకుండా సామాజిక బాధ్యతగా చూడాలి. ప్రతిపక్షాలు కూడా ప్రజల అనారోగ్య సమస్యలను రాజకీయ ఆయుధంగా మాత్రమే ఉపయోగించకుండా, పరిష్కారాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడానికి తక్షణ చర్యలు అవసరం. ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలి. అత్యవసర మందుల సరఫరాలో అంతరాయం లేకుండా పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఆసుపత్రుల వారీగా మందుల నిల్వలు, సిబ్బంది హాజరు, వైద్య సేవల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలి. రోగుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు స్పష్టమైన విధానం రూపొందించాలి. వైద్య సేవల్లో నిర్లక్ష్యం, అక్రమ వసూళ్లు జరిగినట్లు రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు, రోగుల సహాయకులకు అవసరమైన వసతులను మెరుగుపరచాలి. ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలగాలంటే ప్రకటనల కంటే కనిపించే మార్పులు అవసరం. వైద్యం అనేది పాలకులు ప్రజలకు చేసే దానం కాదు, ప్రజలకు అందాల్సిన ప్రాథమిక హక్కు. ప్రజలు పన్నులు చెల్లించేది రహదారులు, భవనాలు నిర్మించుకోవడానికే కాదు, తమ కుటుంబ సభ్యులకు అవసరమైనప్పుడు నాణ్యమైన వైద్యం అందుతుందనే నమ్మకంతో కూడా. ఆ నమ్మకం దెబ్బతింటే ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల విశ్వాసం తగ్గిపోతుంది. డబ్బున్నవారికి మెరుగైన చికిత్స, ఆర్థిక స్తోమత లేనివారికి నిర్లక్ష్యం అనే భావన ఏర్పడే పరిస్థితి ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఒక పేద కుటుంబానికి చెందిన చిన్నారి ప్రాణం కూడా ధనవంతుడి కుటుంబంలోని చిన్నారి ప్రాణంతో సమానమైనదే. ఈ సమానత్వాన్ని మాటల్లో ప్రకటించడం కాదు, వైద్య సేవల్లో ఆచరణలో చూపించాలి. ఆర్థిక పరిస్థితి కారణంగా ఎవరూ చికిత్సకు దూరం కాకుండా చూడటం ప్రభుత్వానికి ఉండాల్సిన కనీస సామాజిక బాధ్యత. హైదరాబాద్‌ను నిజమైన ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలంటే అక్కడ నివసించే సామాన్య ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించాలి. రహదారులు, ఫ్లైఓవర్లు, ఐటీ టవర్లు నగరానికి ఆధునిక రూపాన్ని ఇవ్వవచ్చు. కానీ అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన పేదవాడికి సమయానికి మందులు అందడం, అత్యవసర పరిస్థితిలో ప్రాణాలు నిలిచే చికిత్స లభించడం, వైద్య సిబ్బంది గౌరవంగా వ్యవహరించడం నగరానికి నిజమైన గౌరవాన్ని తెస్తాయి. ఆసుపత్రి గుమ్మం వద్దకు వచ్చిన రోగికి భరోసా లభించాలి తప్ప భయం కలగకూడదు. వైద్యం కోసం వచ్చిన వ్యక్తికి చికిత్స అందాలి తప్ప అవమానం ఎదురుకాకూడదు. ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన వ్యవస్థే వారి పాలిట సమస్యగా మారితే ఆ లోపాలను సరిదిద్దడం పాలకుల మొదటి ప్రాధాన్యత కావాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారోగ్యానికి ఇస్తున్న ప్రాధాన్యతను మాటలతో కాకుండా చేతలతో నిరూపించుకోవాలి. ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితిని సమీక్షించి, వైద్యరంగానికి కేటాయించిన నిధుల వివరాలను వెల్లడించి, ఖాళీ పోస్టులను భర్తీ చేసి, మందుల కొరతను నివారించాలి. విధుల్లో నిర్లక్ష్యం, అక్రమ వసూళ్లు, వైద్య సేవల్లో లోపాలపై వచ్చే ఫిర్యాదులను నిష్పక్షపాతంగా విచారించాలి. నిర్లక్ష్యం కారణంగా రోగులకు నష్టం జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. ప్రాణనష్టం సంభవించిన సందర్భాల్లో వాస్తవాలను వెలికితీసి, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి. అదే సమయంలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వ్యవస్థాగత మార్పులు తీసుకురావాలి.

### ప్రజారోగ్యం రాజకీయ ప్రచారానికి పరిమితమా?

ప్రజారోగ్యాన్ని రాజకీయ ప్రచారానికి పరిమితం చేయకుండా, ప్రజల ప్రాణాలకు భరోసా ఇచ్చే బాధ్యతాయుతమైన వ్యవస్థగా ప్రభుత్వ వైద్య రంగాన్ని తీర్చిదిద్దాలి. చివరగా పాలకులను అడగాల్సిన ప్రశ్న ఒక్కటే. మహానగరమని గొప్పలు చెప్పుకునే హైదరాబాద్‌లో పేదవాడికి కనీస మందులు, ప్రథమ చికిత్స, గౌరవప్రదమైన వైద్యం అందించలేకపోతే ఆ అభివృద్ధికి అర్థమేమిటి? ప్రజల ఆరోగ్యాన్ని కాపాడలేని పాలన ప్రజా సంక్షేమాన్ని ఎలా సాధిస్తుంది? అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? పేదల ప్రాణాలు రాజకీయ ప్రకటనల కంటే తక్కువ విలువైనవా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది ప్రజలు కాదు; ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన పాలకులే. ప్రభుత్వ ఆసుపత్రి పేదవాడికి చివరి ఆశగా నిలవాలి తప్ప చివరి నిరాశగా మారకూడదు. ప్రజల ప్రాణాల విషయంలో నిర్లక్ష్యానికి తావులేని, ప్రతి ఒక్కరికీ సమానంగా వైద్యం అందించే వ్యవస్థను నిర్మించినప్పుడే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజారోగ్యం పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉందని ప్రజలు విశ్వసిస్తారు.



-మన్నారం నాగరాజు
తెలంగాణ లోక్‌సత్తా
పార్టీ వ్యవస్థాపకులు

# కేపీహెచ్‌బీలో ఘనంగా ఫన్ ఫేర్ ఎక్స్‌పో ప్రారంభం..

**ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు కోటంరెడ్డి వినయ్ రెడ్డి**




**కూకట్ పల్లి అక్టోబర్ 13 వెలుతురు:**
కేపీహెచ్‌బీ కాలనీలోని ఫోరం మాల్ పక్కన ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఫన్ ఫేర్ ఎక్స్‌పో మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు కోటంరెడ్డి వినయ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ఎగ్జిబిషన్ నిర్వాహకుడు రాజిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, హైదరాబాద్ నగరంలో తొలిసారిగా 360 డోమ్ షోను అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ఈ షోను ఒకేసారి 600 మంది వీక్షించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. చిన్నారులను విశేషంగా ఆకట్టుకునేలా బటర్‌ఫ్లై షో, డైనోసార్ షో వంటి ప్రత్యేక ఆకర్షణలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దసరా సెలవుల్లో పిల్లలు, కుటుంబ సభ్యులు కలిసి ఆనందంగా గడిపేందుకు ఈ ఎక్స్‌పో మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎక్స్‌పోలో గృహోపకరణాలకు సంబంధించిన వివిధ స్టాళ్లతో పాటు, పలు రకాల తినుబండారాల స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వివరించారు. నేటి నుండి 60 రోజుల పాటు ఈ ఎక్స్‌పో సందర్శకులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సందర్శకులు ఎక్స్‌పోను సందర్శించవచ్చన్నారు. ప్రవేశ రుసుము ఒక్కొక్కరికి రూ. 150గా నిర్ణయించినట్లు, ఈ టికెట్‌తో ఎక్స్‌పోలోని అన్ని విభాగాలను సందర్శించవచ్చని పేర్కొన్నారు. సందర్శకుల సౌకర్యార్థం ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై ఎక్స్‌పోను ప్రారంభించిన కోటంరెడ్డి వినయ్ రెడ్డికి నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# పేదింటి ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం

**ఎమ్మెల్యే కాలే యాదయ్య**



**శంకర్‌పల్లి, వెలుతురు అక్టోబర్ 13 :**
శంకర్‌పల్లి మండలం, మున్సిపాలిటీ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో 26 మంది లబ్ధి దారులకు 26,03, 016 రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ, పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణ లక్ష్మి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. నిరుపేద కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఆసరాగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ శ్వేత పాండురంగారెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ బొల్లారం వెంకటరెడ్డి, స్థానిక మండల రెవెన్యూ అధికారి సురేందర్, మున్సిపల్ కౌన్సిలర్లు అఖిల యాదిరెడ్డి, లలిత మోహనరెడ్డి, ఆనంద్, మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, ఇతర ప్రభుత్వ అధికారులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







## ప్రగతి నగర్ లో దసరా నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ముమ్మారెడ్డి ప్రేమకుమార్

**కూకట్ పల్లి అక్టోబర్ 13 వెలుతురు:**
మూసాపేట్ కైతలాపూర్ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన దసరా నవరోత్సవాల వేడుకల్లో జనసేన పార్టీ రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ పాల్గొన్నారు. వినోద్ కుమార్ ఆహ్వానం మేరకు వేడుకలకు హాజరైన ఆయన అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ప్రేమకుమార్ మాట్లాడుతూ, విజయదశమి పర్వదినం ప్రజల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా జీవించాలని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, శాంతి, సమృద్ధి కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని, ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్ రావు, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పాత ఓటర్లూ మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందే

**ఎన్నికల అధికారి ఆర్వీ.కర్ణన్**



మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల జాబితాను కొత్తగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం చర్యలు చేపట్టిందని ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ.కర్ణన్ తెలిపారు. ఇందులో భాగంగా పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6వ తేదీ వరకు గడువు విధించిందన్నారు. గతంలో ఓటరుగా నమోదైన వారు సైతం మరోసారి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పట్టభద్రుల నియోజకవర్గానికి ప్రతి ఎన్నికకు ముందు ఓటర్ల జాబితాను పూర్తిగా కొత్తగా (డీ-నోవో) రూపొందించాల్సి ఉండటంతో పాత జాబితాలో పేర్లు ఉన్నవారికి కూడా తాజా నమోదు తప్పనిసరి కానుందని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం సెప్టెంబర్ 14న జారీ చేసిన ఆదేశాల ప్రకారం మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఓటర్ల నమోదు ప్రక్రియ, అర్హతలు, అవసరమైన ధ్రువపత్రాలు, ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలను ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ.కర్ణన్ వెల్లడించారు. మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియ చేపట్టనున్నామని కర్ణన్ తెలిపారు. ఇందుకోసం 19 మంది రెవెన్యూ డివిజనల్ అధికారులను (ఆర్డీవోలు) అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లుగా (ఏఈఆర్వోలు) ఎన్నికల సంఘం నియమించిందని తెలిపారు. తొమ్మిది జిల్లాల ఆర్డీవోలు, ఏఈఆర్వోల ప్రతిపాదనల మేరకు తహసీల్దార్లు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్లు, కంటోన్మెంట్ బోర్డు సీఈవోను డిజిగ్నేటెడ్ అధికారులుగా నియమించామని చెప్పారు. వీరంతా దరఖాస్తుదారుల నుంచి అవసరమైన ధ్రువపత్రాలతో కూడిన ఫారం--18 దరఖాస్తులను నేరుగా (ఆఫ్‌లైన్) స్వీకరించనున్నారని తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల జాబితాను పూర్తిగా కొత్తగా రూపొందిస్తున్న నేపథ్యంలో గత ఎన్నికల్లో ఓటు వేసిన వారు సైతం తాజా ఫారం--18 సమర్పించాల్సి ఉంటుందని కర్ణన్ తెలిపారు. అర్హులైన పట్టభద్రులందరూ నవంబర్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల అధికారులు సూచించారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలంటే దరఖాస్తుదారు భారత పౌరుడై ఉండాలి. సంబంధిత పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో సాధారణ నివాసి అయి ఉండాలి. తెలంగాణ ప్రభుత్వం గెజిట్‌లో గుర్తించిన విశ్వవిద్యాలయాలు లేదా విద్యాసంస్థల నుంచి డిగ్రీ లేదా తత్సమాన అర్హతను పొంది ఉండాలి. 2026 నవంబర్ 1ని అర్హత తేదీగా నిర్ణయించారు. ఈ తేదీ నాటికి కనీసం మూడేళ్ల ముందు పట్టభద్రుడై ఉండాలి. అంటే 2023 నవంబర్ 1 నాటికి డిగ్రీ అర్హత సాధించినవారు నమోదుకు అర్హులు. అయితే మూడేళ్ల కాలాన్ని డిగ్రీ పరీక్ష ఫలితాలను సంబంధిత విశ్వవిద్యాలయం లేదా అధికార సంస్థ అధికారికంగా ప్రకటించిన తేదీ నుంచి లెక్కించనున్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి.. డా. సత్యం శ్రీరంగం



**కూకట్ పల్లి అక్టోబర్ 13 వెలుతురు:**
విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ, తమలోని ప్రతిభను వెలికితీసుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ అడహాక్ కమిటీ కన్వీనర్ డా. సత్యం శ్రీరంగం అన్నారు. కోల్‌కతాలో 2026 అక్టోబర్ 31, నవంబర్ 1 తేదీల్లో నిర్వహించనున్న సబ్ జూనియర్ త్రోబాల్ టోర్నమెంట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారుల ఎంపిక కోసం నిర్వహించిన పోటీలకు సంబంధించి డా. సత్యం శ్రీరంగం అధ్యక్షతన ఆయన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ ఎంపిక పోటీల్లో క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించిన ప్రతిభావంతులైన 15 మంది బాలురు, 15 మంది బాలికలను తెలంగాణ జట్టు తరఫున ఎంపిక చేసినట్లు తెలిపారు. క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించి, జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావడమే లక్ష్యంగా ఎంపిక ప్రక్రియను చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, జట్టుగా పనిచేసే నైపుణ్యాలను పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యతనిస్తూ, ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ అడహాక్ కమిటీ సభ్యులు చిత్రా షెనాయ్, కృష్ణ రాజ్‌పుత్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. క్రీడాకారుల ఎంపిక ప్రక్రియపై చర్చించిన అనంతరం ఎంపికలను విజయవంతంగా పూర్తి చేసినట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు.

## బతుకమ్మ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరణ



**రంగారెడ్డి జిల్లా వెలుతురు అక్టోబర్ 13:**
రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మరియు అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి గార్ల సమక్షంలో ఈరోజు రంగారెడ్డి జిల్లా బతుకమ్మ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించడం జరిగిందని పేర్కొన్న రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డా. కె. రామారావు, శ్రీనేష్ కుమార్ నోరి ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ నారాయణరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగకు విశిష్టమైన ప్రాధాన్యత ఉందని తెలిపారు. మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా జరుపుకోవాలని, బతుకమ్మ వేడుకల్లో అందరూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా టీజీఓల సంఘం రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ శ్రీమతి రేవతి గారు మాట్లాడుతూ, ఈ నెల 14వ తేదీన టీజీఓ భవన్, నాంపల్లి, హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 15వ తేదీన రంగారెడ్డి జిల్లా ఐడీఓసీ ప్రాంగణంలో జిల్లా స్థాయి బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.
ఈ వేడుకల్లో మహిళా ఉద్యోగులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ వైభవాన్ని చాటుతూ, బతుకమ్మ పండుగ వేడుకలను ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకోవాలని మహిళా ఉద్యోగులందరూ సమష్టిగా కృషి చేయాలని, బతుకమ్మ పండుగ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ శ్రీమతి రేవతి, కేంద్ర మహిళా విభాగం కోశాధికారి శ్రీమతి శాంతిశ్రీ గారితో పాటు డి. సైదమ్మ, బాలేశ్వరి, రాణి, రాకేష్, మహేష్, ఐశ్వర్య, స్వప్న, సంధ్య, జ్యోత్స్న, ప్రమీల, లావణ్య, స్వాతి, పద్మాంజలి, సమంత, శ్రీదేవి, మైతిలి, రాజ్యలక్ష్మి, రజిత, కరుణ, రవాణి, భాను, పుల్లమ్మ, ప్రశాంతి, మమత, శ్రీలత, భవాని తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలి

**బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ఆదేశాలు.**



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 13:**
మంగళవారం 130 – సుభాష్ నగర్ డివిజన్ "వాసు లేఔట్" కాలనీలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని, పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని, మౌలిక వసతులను మెరుగు పరిచాలని కాలనీ వాసులు ఎమ్మెల్యే ని కోరారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ...సుభాష్ నగర్ వాసు లే ఔట్ లో గతంలో ఎన్నో రకాల మౌలిక వసతులను కాలనీ అభివృద్ధికి అనుగుణంగా అభివృద్ధి పరిచామని, నూతనంగా ఏర్పాటైన కొన్ని గల్లీలల్లో త్రాగునీటి సరఫరా, సీసీ రోడ్లు వంటి మౌలిక వసతులను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరుస్తామన్నారు. కాలనీలో ప్రజలకు ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ తీగలను వెంటనే మార్చాలని, అదేవిధంగా దోమల బెడదను నివారించేందుకు క్రమం తప్పకుండా ఫాగింగ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉప కమీషనర్ లావణ్య, వివిధ విభాగాల అధికారులు, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు బలరాం రెడ్డి, ఇస్మాయిల్, గుబ్బాల లక్ష్మీ నారాయణ, కోల శ్రీకాంత్, సరస్వతి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పద్మలతా రెడ్డి, కాలనీ వాసులు భాస్కర్ రెడ్డి, హరీష్, రమణయ్య, రాంబాబు, శ్రీనివాస్, యోగేష్, ఆది నారాయణ, భాస్కర్ రావు, వెంకటేష్, వందన, స్వాతి, నిత్య, లక్ష్మీ, వసంత తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం

- వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి
- ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిఐ సిహెచ్ జితేందర్ రెడ్డి, పోలీస్ స్టేషన్ సిఐ మద్ది మహేందర్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం వెలుతురు అక్టోబర్ 13:**
ఇబ్రహీంపట్నంలో ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈకార్యక్రమంలో సిహెచ్ జితేందర్ రెడ్డి ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మరియు మద్ది మహేందర్ రెడ్డి ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పాల్గొని విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమా లపై అవగాహన కల్పించారు ఈసందర్భంగా మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాల ను రక్షించుకోవచ్చని ట్రిపుల్ రైడింగ్ చేయకూడదని అతివేగంగా వాహనాలు నడపకూడదని రాంగ్ రూట్‌లో ప్రయాణించకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని తప్పని స రిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్త గా వాహనాలు నడపాలని విద్యార్థులకు సూచించారు అదేవిధంగా ఇబ్రహీంపట్నంలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు ఈ తనిఖీ ల్లో మొత్తం 12 మందిని గుర్తించి వారి వాహనాలను అదుపులోకి తీసుకోవడం జరిగింది వీరి లో ఒక మైనర్ కూడా ఉన్నాడు సంబంధిత వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి తదుపరి చట్టపర మైన చర్యల్లో భాగంగా గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచడానికి చర్యలు తీసుకుం టాం అని అన్నారు మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించా లని తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని ట్రాఫిక్ నిబంధనలు పాటించండి సురక్షితంగా వాహనాలు నడపండి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోండి అని అన్నారు ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబులు తదితరులు పాల్గొన్నారు



## శ్రీశ్రీ హరిహర మహాక్షేత్ర ప్రాంగణంలో శ్రీ దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు

**మంచాల వెలుతురు అక్టోబర్ 13:**
మంచాల మండలం మంచాల గ్రామంలోని శ్రీశ్రీ హరిహర మహాక్షేత్ర ప్రాంగణంలో శ్రీ దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి శ్రీ దుర్గామాత నవరాత్రి ఉత్సవ కమిటీ మం చాల ఆధ్వర్యంలో ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోతు న్నారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివస్తున్నారు. అమ్మవారి సన్నిధిలో పూజలునిర్వ హించి తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని గ్రామ ప్రజలందరికీ ఆయురారోగ్యా లు అష్టైశ్వర్యాలు కలగాలని భక్తులు ప్రార్థిస్తున్నారు దసరా నవరాత్రుల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి పూజలు భక్తుల సందడిభక్తిశ్రద్ధల తో ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి నవరాత్రి ఉత్సవాల ద్వారా భక్తుల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందడంతో పాటు గ్రామంలో భక్తి భావం, ఐక్యత వెల్లివిరుస్తున్నాయిశ్రీ దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు ఈకార్యక్రమంలోశ్రీ దుర్గామాత నవరాత్రి ఉత్సవ కమిటీ, పాల్గొన్నారు

## ఏటీఎం చోరీల కట్టడికి పటిష్ట చర్యలు

- సెన్సార్లు, అలారం వ్యవస్థల పనితీరుపై ఆరా
- బ్యాంకు మేనేజర్లతో ఎస్పీ సమీక్ష
- ఏటీఎం భద్రతా లోపాలను వెంటనే సరిచేయాలి
- మెదక్ జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు




**మెదక్, వెలుతురు అక్టోబర్ 13**
ఏటీఎం కేంద్రాల్లో గ్యాస్ కట్టర్లతో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాల కదలికల నేపథ్యంలో ఏటీఎంల భద్రతను మరింత పటిష్టం చేయాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని వివిధ బ్యాంకుల మేనేజర్లు, సాంకేతిక సిబ్బందితో ఏటీఎం భద్రతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఏటీఎం చోరీలు జరగడానికి గల కారణాలు, భద్రతాపరమైన లోపాలు, వాటి నివారణకు పోలీస్ శాఖ, బ్యాంకులు సమన్వయంతో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గ్యాస్ కట్టర్లతో ఏటీఎంలను ధ్వంసం చేసి నగదు చోరీ చేస్తున్న సమయంలో సెన్సార్లు, అలారం వ్యవస్థలు ఎందుకు అప్రమత్తం చేయడం లేదని బ్యాంకుల సాంకేతిక సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. సాంకేతిక లోపాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

## ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి: కలెక్టర్

ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 129 దరఖాస్తులు అందగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత సమయంలోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 7 దరఖాస్తులు రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఒక దరఖాస్తు అందింది. దానిని సంబంధిత అధికారులకు పంపించి పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయా రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. స్థానిక ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను ఆయా కార్యాలయాల్లో సమర్పించాలని సూచించారు.

# చెరకు తీపి.. రైతు బతుకు చేదు!

- టన్నుకు రూ.5,500 ధర ప్రకటించాలి
- రూ.500 సబ్సిడీ ఇవ్వాలి
- ధర ఖరారయ్యాకే గానుగ ఆడించాలని మామిడిగి రైతుల డిమాండ్

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:** వర్షాభావ పరిస్థితులతో చెరకు దిగుబడి గణనీయంగా తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 2026--27 చెరకు క్రషింగ్ సీజన్‌కు సంబంధించి టన్నుకు రూ. 5,500 ధర ప్రకటించాలని, ప్రభుత్వం అదనంగా టన్నుకు రూ. 500 సబ్సిడీ అందించాలని



సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం మామిడిగి గ్రామ చెరకు రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సీజన్‌కు ధరను అధికారికంగా ప్రకటించిన తర్వాతే గానుగ ప్రారంభించాలని కోరుతున్నారు. సందర్భంగా చెరకు రైతు ఎం. రాజిరెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడంతో చెరకు పంట దిగుబడి తీవ్రంగా తగ్గిపోయిందన్నారు. ఎకరానికి 15 టన్నులకు మించి దిగుబడి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదని పేర్కొన్నారు. సాధారణంగా వచ్చే దిగుబడితో పోలిస్తే ఈసారి పంట ఉత్పత్తి తగ్గడంతో సాగు కోసం చేసిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సాగు ఖర్చులు పెరిగిపోవడంతో చెరకు రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని టన్నుకు రూ. 5,500 ధర ప్రకటించడంతోపాటు ప్రభుత్వం రూ. 500 సబ్సిడీ అందించాలని కోరారు. ధర ప్రకటించకుండానే క్రషింగ్ ప్రారంభిస్తే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని, అందువల్ల ముందుగానే ధరను ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎం. రాజిరెడ్డితోపాటు సంజీవరెడ్డి, బి. శ్రీనివాస్ రెడ్డి, కే. మల్లికార్జున్, వి. మొనప్ప తదితర చెరకు రైతులు పాల్గొన్నారు.

## మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

- బతుకమ్మ కుంట వద్ద సీసీ రోడ్డు, మెట్ల నిర్మాణం పూర్తి
- మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్

**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 13 :** సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణంలో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు బతుకమ్మ కుంట వద్ద సీసీ రోడ్డు, మెట్ల నిర్మాణం చేపట్టిన ఘనత నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డికి దక్కుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ అన్నారు. మంగళవారం నారాయణ ఖేడ్ పట్టణంలోని బతుకమ్మ కుంట వద్ద నిర్మించిన సీసీ రోడ్డు, మెట్లను ఆయన కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా దారం శంకర్ మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యేల సహకారంతో నారాయణఖేడ్ పట్టణం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. మహిళల అవసరాలను



గుర్తించి, వారి సౌకర్యార్థం బతుకమ్మ కుంట వద్ద సీసీ రోడ్డు, మెట్ల నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. మహిళల పట్ల ఎమ్మెల్యేకు ఉన్న చిత్తశుద్ధికి ఈ అభివృద్ధి పనులే నిదర్శనమని పేర్కొన్నారు. మహిళలకు గౌరవం కల్పిస్తూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కర్ర మహేష్ చవాన్, మాజీ ఎంపీటీసీ పండల్ రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ కార్యదర్శి

- సంగారెడ్డి వాస్తవ్యులు అవడం రంగనాథ్ అన్న
- నియామకం చేసిన జాతీయ అధ్యక్షులు కందగట్ల స్వామి

**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 13 :** సంగారెడ్డి జిల్లా :- తరపున ధన్యవాదములు తెలుపుచున్నాము. అదేవిదంగా అఖిల భారత పద్మశాలి సంఘము కార్యదర్శిగా అవడం రంగనాథ్ అన్న గారికి నాయొక్క హృదయ పూర్వక ఆర్థిక శుభాకాంక్షలు. అవడం రంగనాథ్ అన్న గారు ఇండియన్ కాస్ట్ అకౌంట్స్ సర్వీస్ (ICoAS) 2017 బ్యాచ్ అధికారి. ప్రస్తుతం వీరు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలో ఫైనాన్షియల్ అడ్వైజర్ (డిప్యూటీ డైరెక్టర్) గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అఖిల భారత పద్మశాలి సంఘము కార్యదర్శిగా నియమితులైన అవడం రంగనాథ్ అన్న గారికి నాయొక్క హృదయ పూర్వక ఆర్థిక శుభాకాంక్షలు తెలుపుతు మీ ....జట్ల. భాస్కర్ అధ్యక్షులు తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘము సంగారెడ్డి - మెదక్ జిల్లా. మరియు జిల్లా కార్యవర్గ సభ్యులు.




AKHILA BHARATHA PADMASHALI SANGHAM

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాలకు సిద్ధం కండి

- సేవా సంకల్ప్ అభియాన్ ప్రోగ్రాంలన్ని విజయవంతంగా పూర్తి చేయాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం

**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 13:** ఈ నెల 17వ తేదీతో 'సేవా సంకల్ప్ అభియాన్' ముగియనున్న నేపథ్యంలో, పార్టీ నిర్దేశించిన ప్రోగ్రాంలన్నీ విజయవంతంగా పూర్తి చేసేలా, రాబోయే 50 రోజుల పాటు ప్రజా సమస్యలపై, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై మరింత దూకుడుగా పోరాటాలు నిర్వహించేలా బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ముఖ్య నేతల సమావేశంలో కీలక దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు మంగళవారం రోజున కరీంనగర్లోని మహాశక్తి దేవాలయ ఆవరణలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి ని మల్లేశం మాట్లాడుతూ ... రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను, ఎన్నికల హామీల వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజాక్షేత్రంలో నిలబడి ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక రాష్ట్ర స్థాయి సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలని, అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఈ వైఫల్యాలను గడపగడపకూ తీసుకెళ్లి ఎండగట్టాలని కోరారు. ఈ నెల 17 తర్వాత రాబోయే 50 రోజుల పాటు



అనుసరించాల్సిన వివిధ కార్యక్రమాలు, ఆందోళనలు, ధర్నాలపై నేతలకు స్పష్టమైన ప్రణాళికను వివరించారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి చేపట్టబోయే కార్యక్రమాలన్నిటినీ విజయవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టే ప్రజా ఉద్యమాలకు పార్టీ శ్రేణులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, కన్న కృష్ణ, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, వైదరామానుజం, చేవూరి సత్యం, శ్రవణ్ , ముత్యాల జగన్ రెడ్డి , గుంజేటి శివకుమార్, మైనారిటీ మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ లతో పాటు బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సంఘ నరేష్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల యాత్రను విజయవంతం చేయాలి

**అర్థిక ఆధారిత పోరాట సమితి కో ఆర్డినేటర్ సంధి తిరుపతి రెడ్డి**

**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 13:** కులాలకు అతీతంగా ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల సాధన కోసం అక్టోబర్ 24 న సాయంత్రం 4-00 గంటలకు కామారెడ్డి పట్టణంలో నిర్వహించనున్న రథ యాత్ర ను విజయవంతం చేయాలని ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల పోరాట సమితి రాష్ట్ర కో ఆర్డినేటర్ సంధి తిరుపతి రెడ్డి కోరారు. మంగళవారం వేములవాడ మండలం లో ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల పోరాట సమితి ప్రతినిధులు నరేడ్ల రాఘవ రెడ్డి, పాశం నారాయణ రెడ్డి లతో కలసి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుక బడిన వారికి" కులాలకతీతంగా రిజర్వేషన్ ఇవ్వాలని "



ప్రవీణ్ అరోరా " అనే సామాజిక కార్యకర్త నాయకత్వం లో "ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ జాగరుక రథయాత్ర డిల్లీ నుండి వస్తుందనీ, ఇట్టి రథయాత్రకు మద్దతుగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో వేలాది మందితో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు

## మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

**వీఓఏ భవన స్లాబ్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన సర్పంచ్ ప్రేమ్ రాథోడ్**

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:** మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని లచ్చ నాయక్ తండా సర్పంచ్ ప్రేమ్ రాథోడ్ అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు, వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. జహీరాబాద్ మండలం లోని లచ్చ నాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో వీఓఏ భవనం ఆర్సీసీ స్లాబ్ నిర్మాణ పనులకు సర్పంచ్ ప్రేమ్ రాథోడ్ కొబ్బరికాయ కొట్టి భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే ప్రభుత్వం పలు రాయితీలు అందిస్తోంద న్నారు.



ఒక్కో మహిళా సభ్యురాలికి లక్ష రూపాయల చొప్పున, ఒక్కో గ్రూపునకు రూ. 20 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందించే అవకాశం ఉందని తెలిపారు. వీఓఏ భవనాల నిర్మాణంతో మహిళా సంఘాల సభ్యులకు సమావేశాలు నిర్వహించుకోవడానికి అనువైన వేదిక లభించడంతో పాటు, వారికి మరింత గౌరవం పెరుగుతుందని అన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని సర్పంచ్ ప్రేమ్ రాథోడ్ పేర్కొన్నారు.

## భక్తిభావాన్ని పెంపొందించే భజన పోటీలు

- పోటీలను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్
- జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు

**జహీరాబాద్ వెలుతురు అక్టోబరు 12:** దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికత, సామాజిక ఐక్యతకు ప్రతీకలని మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ అన్నారు. పట్టణంలోని భవానీ మందిరంలో నవరాత్రి ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, భవానీ భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భజన పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనుస్ మాట్లాడుతూ.. భజన పోటీలు భక్తిభావాన్ని పెంపొందించడంతోపాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఇటువంటి ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతోపాటు సోదరభావాన్ని, ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.




దేవి నవరాత్రుల సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో సిరిసంపదలు వెల్లివిరియాలని, ప్రజలందరూ దసరా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరుతూ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మంకల్ సుభాష్, వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి, కౌన్సిలర్ రంగా అరుణ్, స్థానిక నాయకులు శ్రీకాంత్ రెడ్డి, సతీష్, మహేష్, భవానీ భజన మండలి నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సేవాదళ్ మండల అధ్యక్షుడు పుర్ర శ్రీనివాస్‌కు ఘన సన్మానం

**పుర్ర శ్రీనివాస్‌ను అభినందించి ఆశీర్వదించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లన్న పటేల్...**




**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని కోహిర్ మండల కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడిగా ఎన్నికైన పుర్ర శ్రీనివాస్ మంగళవారం కాంగ్రెస్ పార్టీ కోహిర్ మండల అధ్యక్షుడు సువర్ణ మల్లన్న పటేల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్లన్న పటేల్ పుర్ర శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆశీర్వదించారు. తనపై నమ్మకంతో సేవాదళ్ మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు, సన్మానించి ఆశీర్వదించినందుకు పుర్ర శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసేవలో ముందుంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోహిర్ మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు పోచారం అశోక్, మనియార్‌పల్లి మాజీ అధ్యక్షుడు రమేష్, మాజీ ఎంపీటీసీ మున్నూరు రాజు, చంద్రశేఖర్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై ధర్నాలు చేస్తే కఠిన చర్యలు : ఏసీపీ

సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన మార్గాలు అనుసరించాలని, జాతీయ రహదారులపై ధర్నాలు చేపట్టి ప్రజా రవాణాకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హుజురాబాద్ ఏసీపీ మాధవి స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం ఏసీపీ కార్యాలయంలో టౌన్ సీఐ కరుణాకర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు.

సైదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొమ్మకల్ గ్రామానికి చెందిన బజ్జూరి తిరుమల (57) ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 9న ((క్రైమ్ నెం. 179/2026, సెక్షన్లు 118(2), 292, 351(2), 3(5) దీమీా) కేసు నమోదు చేసి, విచారణ అనంతరం బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి పంపించినట్లు ఏసీపీ తెలిపారు. అయితే, తిరుమలకు అన్యాయం జరిగిందంటూ చల్లూరి కోమల, మొలుగురి లక్ష్మి తదితర మహిళలను కూడగట్టుకుని ఈ నెల 11న తనను కలిసేందుకు వచ్చారని పేర్కొన్నారు. ఆ సమయంలో తాను అందుబాటులో లేకపోవడంతో, వారు నేరుగా జాతీయ రహదారిపైకి వెళ్లి దాదాపు అరగంట పాటు రాస్తారోకో నిర్వహించారని తెలిపారు.

దీనివల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడంతో తిరుమల, చల్లూరి కోమల, మొలుగురి లక్ష్మితో పాటు ఇతరులపై హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 308/2026, సెక్షన్లు 189, 126(2) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసినట్లు ఏసీపీ వెల్లడించారు. గతంలోనూ వీరు బోర్నపల్లి గ్రామంలో ఇదే తరహాలో ధర్నా చేయగా హెచ్చరించామని, మళ్లీ పునరావృతం చేయడంతో చట్టరీత్యా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

జాతీయ రహదారులపై నిత్యం రోగులు, అంబులెన్సులు, విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారని, అలాంటి కీలక మార్గాల్లో ధర్నాలు చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. సమస్యలు ఉంటే ఉన్నతాధికారులను ఆశ్రయించాలి తప్ప, ప్రజా జీవనానికి విఘాతం కలిగించడం సమంజసం కాదన్నారు.

హుజురాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, సాక్ష్యాధారాల ఆధారంగా న్యాయం చేస్తామని తెలిపారు. దర్యాప్తునకు కొంత సమయం పడుతుందని, బాధితులు పోలీసులకు సహకరించాలని కోరారు

## జహీరాబాద్ బస్టాండ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి

- మృతుడి ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి
- పట్టణ ఎస్ ఐ లవ కుమార్

**జహీరాబాద్ వెలుతురు, అక్టోబర్ 13:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న సింధు టిఫిన్ సెంటర్ పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు జహీరాబాద్ పట్టణ ఎస్ఐ లవ కుమార్ మంగళవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 12న రాత్రి సుమారు 8 గంటల సమయంలో 40 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతుడి ఒంటిపై



తెలుపు రంగు ఫుల్‌హ్యాండ్ చొక్కా, లోపల బూడిద రంగు టీషర్టు, నీలం రంగు ప్యాంటు ఉన్నాయి. కడుపుపై సిలువ ఆకారంలో పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, గుర్తింపు కోసం భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐను 8712656763 నంబర్‌లో సంప్రదించాలని లవ కుమార్ కోరారు.

## రెవిన్యూ అధికారుల తీరుపై కలెక్టర్‌ను సంప్రదిస్తాము

**బిడెకన్నే హన్మంతప్ప**



**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 13:** సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గంలో గుంటల చొప్పున భూముల రిజిస్ట్రేషన్ నిలిపివేసిన నేపథ్యంలో ఫాం ల్యాండ్ల యజమానులతో కలిసి జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేస్తామని ఖేడ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బిడెకన్నే హన్మంతప్ప అన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ.. రాష్ట్రంలో ఎక్కడ లేనిది కేవలం నారాయణఖేడ్ లోనే గుంటల భూముల రిజిస్ట్రేషన్ లు నిలిపివేయడం ఏమిటి అన్నారు. ఖేడ్ నియోజకవర్గంలో తహసీల్దార్లు గత 15 రోజుల నుండి గుంటల చొప్పున భూముల రిజిస్ట్రేషన్ లు ఎందుకు నిలిపివేశారని, భూ భారతిలో గుంటల భూమి కోసం స్లాట్ బుక్ చేసుకొని తహసీల్దార్ కార్యాల యానికి వెళ్లగా గుంటల చొప్పున రిజిస్ట్రేషన్ చేయమని తహసీల్దార్ లు అమ్మకం, కొనుగోలు దారులకు వెనుదిరిగి పంపించడం ఏమిటి అన్నారు. గుంటల చొప్పున భూములు రిజిస్ట్రేషన్ చేయనప్పుడు స్లాట్ పేరుతో కొనుగోలు దారుల వద్ద ప్రభుత్వం వేల రూపాయలు చలాన ఎందుకు తీసుకుంటున్నారు అని ప్రశ్నించారు. పక్క నియోజక వర్గాలలో గుంటల భూమి రిజిస్ట్రేషన్ కు నిబంధనలు లేనప్పుడు నారాయణఖేడ్ లో మాత్రమే ఎందుకు విధించారో రెవిన్యూ అధికారులు తెలపాలి అన్నారు. ఖేడ్ నియోజకవర్గంలోని ప్రతీ తహసీల్దార్ కార్యాలయంలో పదుల సంఖ్యలో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ పెండింగులో ఉన్నాయని, వాటిని ఎప్పుడు రిజిస్ట్రేషన్ చేస్తారో తెలపాలి అన్నారు. రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్నాక 6 నెలల వరకు ఎప్పుడైనా భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని అధికారులు చెప్పడం బాగుంది అంటే ప్రభుత్వానికి వేలు, లక్షల రూపాయలు చలాన చెల్లించి కూడా నెలల తరబడి తహసీల్దార్ కార్యాలయాల చుట్టు తిరగాల అని ప్రశ్నించారు. ఎవరి ఒత్తిడికి తలొగ్గి అధికారులు రిజిస్ట్రేషన్ లు నిలిపివేశారో తెలపాలని లేనియెడల ఫాం ల్యాండ్ల యజమానులతో కలిసి జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేస్తామని అవసరమైతే ముఖ్యమంత్రికి కూడా పిర్యాదు చేస్తాము అన్నారు.

## మాటలే కాదు చేతలతో నిరూపిస్తున్న సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్

**గ్రామ మినీ ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఘాట్ సుందరీకరణ పనులు.**

**కొడిపల్లి వెలుతురు అక్టోబర్ 13:** కొడిపల్లి మండల కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ పై బతుకమ్మ సంబరాలకు చెట్ల పొదలను తొలగించి ట్రాక్టర్లతో మట్టిని తెచ్చి గుంతలను పూడ్చడం, స్వయాన సర్పంచ్ ట్రాక్టర్ నడుపుతూ పనిచేయడం మహిళలపై తనకున్న అభిమానాన్ని చాటిచెప్పుతుంది.. జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు మరియు కొడిపల్లి సర్పంచ్ అయిన చంద్రం కృష్ణ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు చెప్పడమే కాదు చేసి చూపి






స్తుందని , అందులో మహిళలంటే మా ప్రభుత్వానికి ఎంతో గౌరవమని తెలిపారు. బతుకమ్మ సంబరాలను దృష్టిలో ఉంచుకొని మహిళా సోదరీ సోదరీమణులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందు జాగ్రత్తతో కొడిపల్లి చెరువు పై (మినీ ట్యాంక్ బండ్) పై బతుకమ్మ ఘాటును సుందరీకరణ పనులు చేయడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్వేతా మల్లికార్జున గౌడ్,, వార్డు సభ్యులు లక్ష్మీ శరత్ కుమార్, ప్రశాంత్, రెడ్డి మాధవి మహేష్,, మురళి, దేవేందర్,, మక్బూల్, సందీప్ కుమార్, పంచాయతీ కార్యదర్శి నాగేష్, కారోబర్ ఎల్లం, నాయకులు సంధ్య గళ్ళ మల్లేష్, భూమయ్య పటేల్, రమేష్ గౌడ్, మరియు పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేతను అరెస్ట్ చేయాలి

: భూవివాదం కారణంగా వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన రైతు కన్నబోయిన ఓదెలు ఆత్మహత్యకు కారణమైన స్థానిక కాంగ్రెస్ నేత, గ్రామ సర్పంచ్ భర్త పత్తి కృష్ణారెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజనీ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం హుజూరాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజూరాబాద్ మండలం వెంకట్రావుపల్లికి చెందిన కన్నబోయిన ఓదెలు 2018లో పత్తి విష్ణువర్ధన్ రెడ్డి (కృష్ణారెడ్డి సోదరుడు) నుంచి ఎకరం 4 గుంటల భూమిని సాదా బైనామా ద్వారా రూ. 10.40 లక్షలు చెల్లించి కొనుగోలు చేశారని రజనీ కుమార్ తెలిపారు. కుటుంబ తగాదాలు, న్యాయపరమైన వివాదాల వల్ల రిజిస్ట్రేషన్ ఆలస్యమైందన్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న సర్పంచ్ అనిత భర్త పత్తి కృష్ణారెడ్డి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై 2022లో ఆ భూమిని తన పేరిట నమోదు చేసుకున్నారని ఆరోపించారు. కొనుగోలు మొత్తాన్ని తిరిగి ఇవ్వకుండా కేవలం రూ. 2.70 లక్షలు మాత్రమే ఇస్తానని, "దిక్కున్న చోట చెప్పుకోండంటూ" బెదిరింపులకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఈ వేధింపులు తాళలేక తీవ్ర మనస్తాపానికి గురైన ఓదెలు గత నెల 2వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా, చికిత్స పొందుతూ 3వ తేదీన మృతి చెందారని తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా, నిందితుడు అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుడు కావడంతో పోలీసులు అరెస్ట్ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన విమర్శించారు. , కరీంనగర్ సీపీ, ఏసీపీలకు కూడా ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.




## టీజీవో బతుకమ్మ సంబురాలకు మంత్రి సీతక్కకు ఆహ్వానం

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:** టీజీవో సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 2026 బతుకమ్మ సంబురాలకు హాజరు కావాల్సిందిగా రాష్ట్ర మంత్రి సీతక్కగారిని టీజీవో సెంట్రల్ అసోసియేషన్ ప్రతినిధులు ఆహ్వానించారు. టీజీవో మహిళా విభాగం చైర్పర్సన్ శ్రీమతి జి. దీపారెడ్డి, కన్వీనర్ జె. సుజాత, హైదరాబాద్ జిల్లా టీజీవో అసోసియేషన్ అధ్యక్షులు ఎంబి కృష్ణ యాదవ్, మహిళా విభాగం కోశాధికారి శాంతిశ్రీ తదితరులు ఖైరతాబాద్‌లోని ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ కార్యాలయంలో మంత్రి సీతక్కగారిని కలిసి, బతుకమ్మ సంబురాలకు హాజరు కావాల్సిందిగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి సీతక్క 2026 బతుకమ్మ సంబురాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిశోర్, ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా), తెలంగాణ స్టేట్ సెంటర్ చైర్మన్ రమణ నాయక్, టీజీవో ఇంజినీర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాస్, ఇంజినీర్ సిద్ధార్థ్‌తో పాటు పంచాయతీరాజ్ శాఖకు చెందిన పలువురు ఇంజినీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంబి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ, బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నాంపల్లిలోని టీజీవో భవన్‌లో నిర్వహించనున్న బతుకమ్మ సంబురాలకు మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఖైరతాబాద్ ఉప ఎన్నికపై జనసేనలో ఆసక్తికర చర్చ!

- పవన్ కళ్యాణ్‌కు సన్నిహితుడైన పారిశ్రామికవేత్తకు అవకాశం దక్కేనా?
- కూటమికి సంబంధం లేకుండా సొంతంగా పోటీ చేసే ఆలోచనలో జనసేన !

**ఖైరతాబాద్ : అక్టోబర్ 13 ( వెలుతురు )** హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో జనసేన పార్టీ భవిష్యత్ కార్యాచరణపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో జనసేన తరఫున ఎవరిని బరిలోకి దింపుతారనే అంశం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు సన్నిహితంగా ఉండే, పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ ప్రముఖ పారిశ్రామికవేత్తకు అవకాశం కల్పించే అవకాశం ఉందన్న ప్రచారం సాగుతోంది. సాఫ్ట్‌వేర్, వ్యాపార రంగాల్లో విశేష అనుభవం కలిగి, సమాజం పట్ల బాధ్యతతో పాటు ప్రజాసేవపై ఆసక్తి ఉన్న నాయకుడిని ఎన్నికల బరిలోకి దింపాలనే ఆలోచనలో పార్టీ ఉందనే చర్చ వినిపిస్తోంది. వివాదాలకు దూరంగా ఉంటూ, వ్యాపార రంగంలో సంపాదించిన అనుభవాన్ని ప్రజాసేవకు వినియోగించగల వ్యక్తికి అవకాశం కల్పిస్తే పార్టీకి ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణలో జనసేనను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, యువతతో పాటు వివిధ సామాజిక వర్గాలకు చేరువ కావడం వంటి అంశాలపై పార్టీ దృష్టి సారిస్తున్న నేపథ్యంలో ఖైరతాబాద్ ఉప ఎన్నిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఎన్నిక ద్వారా పార్టీ ప్రజల్లో తన ఉనికిని మరింత బలోపేతం చేసుకునే అవకాశంపైనా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వ్యాపార, సాంకేతిక రంగాల్లో అనుభవం ఉన్న వ్యక్తులు రాజకీయాల్లోకి వస్తే అభివృద్ధి, ఉపాధి కల్పన, యువతకు అవకాశాలు, సామాజిక సంక్షేమం వంటి అంశాలపై వినూత్న ఆలోచనలకు అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సదరు పారిశ్రామికవేత్తకు జనసేన తరఫున అవకాశం దక్కుతుందా? తెలంగాణలో పార్టీ నాయకత్వం ఖైరతాబాద్ ఉప ఎన్నిక కోసం ఎలాంటి వ్యూహాన్ని అనుసరించనుంది? అన్న అంశాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అయితే, ఖైరతాబాద్ ఉప ఎన్నికలో జనసేన అభ్యర్థి ఎంపికకు సంబంధించి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ప్రచారంలో ఉన్న ఈ అంశాలపై స్పష్టత రావాలంటే పార్టీ అధిష్ఠానం నిర్ణయం వెలువడే వరకు వేచి చూడాల్సిందే. రానున్న రోజుల్లో జనసేన అనుసరించే వ్యూహం, అభ్యర్థి ఎంపికపై వెలువడే ప్రకటన తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారనుంది.

# ఉస్మానియా ఆసుపత్రి సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- జూనియర్ వైద్యుల డిమాండ్లు నెరవేర్చి సమ్మె విరమింపజేయాలి
- ఆరోగ్యశ్రీ బకాయిలు విడుదల చేసి వైద్యసేవలను పునరుద్ధరించాలి
- మందులు, వైద్య పరికరాలు, సిబ్బంది కొరతతో రోగుల అవస్థలు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ లేఖ

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 13**
ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, జూనియర్ వైద్యుల సమ్మెను విరమింపజేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి ప్రతిరోజూ వేలాది మంది పేద, మధ్యతరగతి రోగులు ఉచిత వైద్యం కోసం ఉస్మానియా ఆసుపత్రికి వస్తున్నారని తెలిపారు. అయితే సిబ్బంది కొరత, మౌలిక సదుపాయాల లేమి, మందుల కొరత, పారిశుద్ధ్య సమస్యలతో ఆసుపత్రి నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జూనియర్ వైద్యులు నిరవధిక సమ్మెకు దిగడంతో వేలాది మంది ఓపీ రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేద ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.



### ఆరోగ్యశ్రీ బకాయిలతో నిలిచిన శస్త్రచికిత్సలు

గత రెండేళ్లుగా ఆరోగ్యశ్రీ నిధులు విడుదల కాకపోవడంతో సరఫరాదారులు వైద్య పరికరాలు, మందుల సరఫరాను నిలిపివేశారని జాన్ వెస్లీ తెలిపారు. ఫలితంగా గుండె సంబంధిత విభాగంలో స్టెంట్లు అమర్చడం, క్యాథ్‌ల్యాబ్ సేవలు, అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. బకాయిలను వెంటనే విడుదల చేసి వైద్యసేవలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో ఎక్స్‌రే, ఎంఆర్ఐ, సీటీ స్కాన్, ఎండోస్కోపీ యంత్రాలు తరచూ పనిచేయడం లేదన్నారు. ఎముకల విభాగంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కీళ్ల మార్పిడికి అవసరమైన పరికరాలు అందుబాటులో లేవని, అత్యవసర విభాగాల్లో వెంటిలేటర్లు సక్రమంగా పనిచేయడం లేదని తెలిపారు. కీలక వైద్య పరికరాలకు వెంటనే మరమ్మతులు చేయించి, కొత్త పరికరాలను సమకూర్చాలని కోరారు.

### మందుల కోసం బయటకు పరుగులు

ఆసుపత్రి మందుల పంపిణీ కేంద్రాల్లో అత్యవసర మందులు సైతం అందుబాటులో ఉండటం లేదని, వైద్యులు రాసిన మందుల్లో కేవలం రెండు మూడు రకాలు మాత్రమే లభిస్తున్నాయని పేర్కొన్నారు. ఉచిత వైద్యం కోసం వచ్చే నిరుపేదలు మిగిలిన మందులను బయట కొనుగోలు చేయాల్సి రావడంతో ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రికి అవసరమైన అన్ని రకాల మందులను నిరంతరం ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

### వైద్యులపై తీవ్రమైన పనిభారం

ఆసుపత్రిలో వైద్యులు, నర్సులు, ప్రయోగశాల సాంకేతిక నిపుణులు, పారిశుద్ధ్య సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని జాన్ వెస్లీ తెలిపారు. దీంతో ప్రస్తుతం పనిచేస్తున్న వైద్యులపై అదనపు పనిభారం పడుతోందన్నారు. జూనియర్ వైద్యులు 24 నుంచి 48 గంటలపాటు విధులు నిర్వహిస్తున్నా సరిపడా విశ్రాంతి గదులు లేవని, గత కొన్ని నెలలుగా ఉపకార వేతనాలు అందడం లేదని పేర్కొన్నారు. పీజీ వైద్య శిక్షణలోనూ నాణ్యత లోపించిందన్నారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయడంతో పాటు బకాయి ఉపకార వేతనాలను విడుదల చేసి, వాటిని పెంచాలని కోరారు. వైద్య శిక్షణ నాణ్యతను మెరుగుపరిచి, విభాగాల పనితీరును సరిదిద్దాలని విజ్ఞప్తి చేశారు.

### పారిశుద్ధ్యం అధ్వానం.. కొత్త భవన పనులు వేగవంతం చేయాలి

ఆసుపత్రిలో మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, దోమల బెడద, చెత్తాచెదారం పేరుకుపోవడంతో రోగులు, వారి సహాయకులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్య వసతులు కల్పించాలని కోరారు. పాత ఆసుపత్రి భవనం దెబ్బతిని ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నూతన ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నిరుపేదలే ఆధారపడుతున్నారని జాన్ వెస్లీ గుర్తుచేశారు. గత జూన్‌లో తమ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సర్వే నిర్వహించి, గుర్తించిన సమస్యలను లేఖల ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉస్మానియా ఆసుపత్రిలో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు జూనియర్ వైద్యుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని కోరారు.

# నాకాఫ్ టెండర్లను తక్షణమే రద్దు చేయాలి

## బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:**
తెలంగాణ రాష్ట్రంలోని గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులకు నిత్యావసర సరుకులు సరఫరా చేసే టెండర్లను స్థానిక మహిళా సంఘాలకు కేటాయించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిత్యవసర వస్తువులను పంపిణీ చేయడానికి ప్రభుత్వం పిలిచిన కేంద్రీకృత టెండర్లలో భారీ అక్రమాలు చేటు చేసుకున్నాయని లింగం గౌడ్ ఆరోపించారు. గత ప్రభుత్వం బ్లాక్ లిస్టులో పెట్టిన నాకాఫ్ ను మళ్లీ అదే సంస్థకు కాంట్రాక్టు కట్టపెట్టడం సిగ్గుచేటన్నారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై లింగం గౌడ్ స్పందిస్తూ సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని ఆ సంస్థను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. కమిషన్లు తీసుకొని అనుభవం లేని వారికి సబ్ కాంట్రాక్టులు ఇచ్చిందని అధికారులందరూ మామూళ్ల మత్తులో తూగుతున్నారని విమర్శించారు

# తెలంగాణ-లివర్‌పూల్ భాగస్వామ్య బలోపేతం

## హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం పర్యటన

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 15**
యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లివర్‌పూల్ నగరానికి చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం అక్టోబర్ 14, 2026న హైదరాబాద్‌లో తన మూడు రోజుల పర్యటనను ముగించింది. ఈ పర్యటన ద్వారా తెలంగాణ, లివర్‌పూల్ ప్రాంతాల మధ్య ఆరోగ్య సంరక్షణ, లైఫ్ సైన్సెస్, పరిశోధన, ఆవిష్కరణలు, వాణిజ్యం, పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు తదితర రంగాల్లో ద్వైపాక్షిక సహకారం మరింత బలోపేతమైంది.
ఈ ప్రతినిధి బృందంలో లివర్‌పూల్ సిటీ కౌన్సిల్, లివర్‌పూల్ సిటీ రీజియన్ కంబైన్డ్ అథారిటీ, ఎన్‌హెచ్ఎస్ యూనివర్సిటీ హాస్పిటల్స్ లివర్‌పూల్ గ్రూప్‌కు చెందిన ఉన్నతాధికారులు, ఆరోగ్య సంరక్షణ సంస్థలు, పరిశోధనా సంస్థలు, వ్యాపార సంస్థలు, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆగస్టు 2026లో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు యునైటెడ్ కింగ్‌డమ్‌లో జరిపిన పర్యటన నేపథ్యంలో ఈ సహకార కార్యక్రమాలు మరింత ముందుకు సాగాయి.
అక్టోబర్ 13, 2026న తెలంగాణ ప్రభుత్వం మరియు లివర్‌పూల్ సిటీ కౌన్సిల్ మధ్య వ్యూహాత్మక అవగాహన ఒప్పందంకుదరడం ఈ పర్యటనలో కీలక మైలురాయిగా నిలిచింది. వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణలు, పారిశ్రామికవేత్తల ప్రోత్సాహం, విజ్ఞాన మార్పిడి, నైపుణ్యాభివృద్ధి, పర్యాటకం, సంస్కృతి, క్రీడలు వంటి రంగాల్లో దీర్ఘకాలిక సహకారానికి ఈ ఒప్పందం మార్గం సుగమం చేస్తుంది. ప్రతినిధి బృందం జీనోమ్ వ్యాలీని సందర్శించి తెలంగాణలోని ఆరోగ్య సంరక్షణ, లైఫ్ సైన్సెస్ రంగాల అభివృద్ధిని పరిశీలించింది. బయో ఫార్మాస్యూటికల్, ఫార్మాస్యూటికల్, వ్యాక్సిన్, వైద్య సాంకేతికత, పరిశోధనా సంస్థల ప్రతినిధులతో సమావేశమై పరిశోధన భాగస్వామ్యాలు, క్లినికల్ సహకారం, విద్య, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి అంశాలపై చర్చించింది.
అలాగే, ప్రతినిధి బృందం టీ-హబ్‌ను సందర్శించిన సందర్భంగా టీ-హబ్ మరియు నాలెడ్జ్ క్వార్టర్ లివర్‌పూల్/సియోంటెక్ మధ్య అవగాహన పత్రంపై సంతకాలు జరిగాయి. హైదరాబాద్--లివర్‌పూల్ ఇన్నోవేషన్ బ్రిడ్జ్‌ను ఏర్పాటు చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.




దీని ద్వారా ఇరు ప్రాంతాలకు చెందిన స్టార్టప్‌ల మధ్య అనుసంధానం, కొత్త మార్కెట్లకు ప్రవేశం, ఆవిష్కరణల ఆధారిత వ్యాపార భాగస్వామ్యాలకు అవకాశాలు ఏర్పడతాయి.
ఆరోగ్య సంరక్షణ రంగంలో కిమ్స్ మరియు యూనివర్సిటీ హాస్పిటల్స్ లివర్‌పూల్ గ్రూప్ పరిశోధన, వైద్య సేవల సహకారం, విద్య, శిక్షణ, సిబ్బంది నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లాయి.
లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్ ఫౌండేషన్ ద్వారా క్రీడలు, ఆరోగ్యం, సమాజాభివృద్ధి రంగాల్లో సహకార అవకాశాలను కూడా పరిశీలించారు.
తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ, గచ్చిబౌలిలోని ఎఫ్ఐఎఫ్ఏ--ఎఐఎఫ్ఎఫ్ఏ తెలంగాణ టాలెంట్ అకాడమీ, ఫుట్‌బాల్ క్లబ్‌లు, కోచ్‌లు, కార్పొరేట్ సీఎస్ఆర్ భాగస్వాములతో ప్రతినిధి బృందం చర్చలు జరిపింది. సెంటర్ ఫర్ స్పైన్ అండ్ స్పోర్ట్స్ హెల్త్, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలలో క్రీడా వైద్యం, క్రీడాకారుల ప్రతిభాభివృద్ధి, ఉన్నతస్థాయి క్రీడా శిక్షణపై చర్చలు జరిగాయి.
గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులను ఆకర్షించడానికి, పరిశోధనా భాగస్వామ్యాలను బలోపేతం చేయడానికి, హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి ఆవిష్కరణలు మరియు పారిశ్రామిక అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు.
తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఐఏఎస్, తెలంగాణ, లివర్‌పూల్ ప్రాంతాల మధ్య ఉన్న పరస్పర అనుకూల సామర్థ్యాలను వివరించారు. ఈ పర్యటనలో జరిగిన చర్చలు అర్థవంతమైన సంస్థాగత భాగస్వామ్యాలకు, ఆచరణాత్మక ఫలితాలకు దారితీస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.
తెలంగాణ--లివర్‌పూల్ భాగస్వామ్యాన్ని దీర్ఘకాలికంగా బలోపేతం చేయడంతో పాటు పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక వృద్ధికి ఇరు ప్రాంతాల్లో కొత్త అవకాశాలను సృష్టించేందుకు ఈ పర్యటన కీలక ముందడుగుగా నిలిచింది.



## ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు తప్పనిసరి : మాజీ ఎమ్మెల్యే

గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న, ఇటీవల ఓటు హక్కుకు అర్హత సాధించిన గ్రాడ్యుయేట్లు అందరూ ఓటరు నమోదు చేసుకోవాలని వైరా మాజీ ఎమ్మెల్యే బి. చంద్రావతి తెలిపారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 26వ డివిజన్‌లో బీఆర్ఎస్ నేత బానోతు కృష్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. వార్డులో స్వయంగా పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదును చేయించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ప్రాధాన్యం గురించి ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులకు ఆమె అవగాహన కల్పించారు. అనంతరం కృష్ణ క్యాంపు కార్యాలయంలో నేటి వరకు జరిగిన ఓటరు నమోదు ప్రక్రియ గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ నెల 25లోపు పూర్తిస్థాయిలో ఓటరు నమోదు ప్రక్రియ ముగిసే విధంగా చర్యలు తీసుకోవాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగులను ప్రత్యక్షంగా కలిసి ఆఫ్‌లైన్‌లో ఓటరు నమోదు చేయించాలన్నారు. అనంతరం స్వయంగా పార్టీ ఆధ్వర్యంలోనే ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు అయ్యే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

## రీ సర్వే పనులను పకడ్బందీగా పూర్తి చేయాలి : అదనపు కలెక్టర్

జిల్లాలో భూముల రీసర్వే పనులను పకడ్బందీగా, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం పెనుబల్లి మండలం తుమ్మలపల్లి రెవెన్యూ గ్రామం, కల్లూరు మండలం రఘునాథగూడెం రెవెన్యూ గ్రామం, తల్లాడ మండలం లక్ష్మీపురం రెవెన్యూ గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా గ్రామాల్లో సర్వే పనుల పురోగతిని సమీక్షించి, సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, రీసర్వేలో భాగంగా భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే నంబర్లు తదితర వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. భూ రికార్డుల్లోని వివరాలను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. రీసర్వే ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. భూములకు సంబంధించిన వివరాలపై అభ్యంతరాలు లేదా సందేహాలు వ్యక్తమైతే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- హైదరాబాద్ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ డిఎంహెచ్ఓ
- వైద్యాధికారులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలి.
- గర్భిణీ అని తెలిసిన వెంటనే నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి.
- గర్భిణులకు అవసరమైన వైద్య పరీక్షలు, ఆరోగ్య సేవలు, వ్యాధి నిరోధక టీకాలను సమర్థవంతంగా అందించాలి.
- బస్తీ దవాఖానాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలి.
- ప్రజలకు అన్ని రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- మురికివాడల్లో నివసించే పేద ప్రజలకు క్రమం తప్పకుండా వైద్య సేవలు అందించాలి.
- సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి, వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి.
- ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను 100 శాతం సాధించాలి.

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 13:**
హైదరాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ వైద్యాధికారులు, సిబ్బందికి ఈ మేరకు సూచనలు చేశారు. హైదరాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు, జిల్లా క్షయ నివారణ అధికారులు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (ఖూఎజం), బస్తీ దవాఖానాల వైద్యాధికారులు, రాష్ట్ర బాల ఆరోగ్య సురక్ష కార్యక్రమం (=దీూఖ) వైద్యాధికారులతో సమీక్ష సమావేశం మంగళవారం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రి సమావేశ మందిరంలో నిర్వహించారు.
ఈసందర్భంగా డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, వివిధ జాతీయ,




రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సూచికల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత చేరువయ్యేలా వైద్యాధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణుల ముందస్తు నమోదు, క్రమం తప్పకుండా గర్భిణీ పరీక్షలు, తల్లి మరియు శిశు ఆరోగ్య సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాల అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. అలాగే అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు, వైద్య పరీక్షల సదుపాయాలు అందుబాటులో ఉండేలా పర్యవేక్షించాలని తెలిపారు. వర్షాకాలం అనంతరం కూడా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, వ్యక్తిగత ఆరోగ్య జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా మురికివాడల్లో నివసించే పేద ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నిర్ణీత గడువులోగా 100 శాతం సాధించే దిశగా వైద్యాధికారులు సమన్వయంతో పనిచేయాలని, సేవల నాణ్యతను నిరంతరం మెరుగుపరచాలని డాక్టర్ పుట్ల శ్రీనివాస్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా క్షయ నివారణ అధికారి, జిల్లా కుష్ఠు నివారణ అధికారి, అదనపు జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ అనిత, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సాయిబాబా, డాక్టర్ శ్రీకళ, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ అశ్రిత, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు, డిప్యూటీ జిల్లా విస్తరణ మరియు మాధ్యమాధికారులు (డిప్యూటీ ఐజుమీలు), ఇన్‌చార్జ్ మలేరియా అధికారి, జిల్లా కార్యక్రమ అధికారి (ఖూా) తదితరులు పాల్గొన్నారు.



# లలిత కళా తోరణంలో నాలుగో రోజు నానబియ్యం బతుకమ్మ



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 13, 2026:**
తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకల్లో భాగంగా నాలుగో రోజు హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో ఉన్న లలిత కళా తోరణంలో "నానబియ్యం బతుకమ్మ" వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో తెలంగాణ సమృద్ధమైన పుష్ప, సాంస్కృతిక వారసత్వం ప్రతిబింబించింది. మహిళలు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం భక్తి, ప్రకృతి ప్రేమ, సామాజిక ఐక్యత స్ఫూర్తిని ప్రతిబింబించింది.
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (NITHM) మరియు నిర్మాణ్ సంస్థ ప్రతినిధులు కూడా వేడుకల్లో పాల్గొని ఉత్సవ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చారు. తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించి, ప్రోత్సహించడంతో పాటు, వాటిని రాష్ట్ర పర్యాటక అనుభవంలో అంతర్భాగంగా ప్రదర్శించేందుకు పర్యాటక శాఖ 2026 అక్టోబర్ 10 నుంచి 18 వరకు ఈ వేడుకలను నిర్వహిస్తోంది.







# ప్రముఖ కళాకారుడు వెంకట్ గడ్డం ఐదేళ్ల కళా ప్రస్థానం



## హైదరాబాద్‌లో ప్రత్యేక ప్రదర్శన

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 13:** ప్రముఖ కళాకారుడు వెంకట్ గడ్డం ఐదేళ్ల కళా ప్రస్థానాన్ని పురస్కరించుకుని మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రత్యేక కళా ప్రదర్శన ప్రారంభమైంది. అక్టోబర్ 13 నుంచి 15 వరకు మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఎగ్జిబి షన్‌లో పెయింటింగ్స్, వస్త్రాలపై రూపొందించిన కళాకృతులు, కవితలను ప్రదర్శిస్తున్నారు. జపనీస్ కళాకారిణి హిరోకో తకయామాతో కలిసి రూపొందించిన ప్రత్యేక కళాకృతులు ఈ ప్రదర్శనకు ఆకర్షణగా నిలుస్తున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ కరస్పాండెంట్ సరోజ ఈ ప్రదర్శనను ప్రారం భించారు. ప్రముఖ కళాకారుడు ఎంవీ రమణారెడ్డి సహా పలువురు ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రదర్శనలోని కళాకృతులను వీక్షించిన సరోజ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వెంకట్ గడ్డం ఇన్ని కళాకృతులను ఎప్పుడు రూపొం దించారని భావోద్వేగానికి గురయ్యారు. చిన్నప్పటి నుంచే వెంకట్‌లో ఎంతో ప్రతిభ ఉందని, చదువుతో పాటు కళల్లోనూ ముందుండేవారని అతిథులు ప్రశంసించారు. సంతోషం, బాధ వంటి విభిన్న భావోద్వేగాలను తన పెయింటింగ్స్‌లో ప్రతిబింబించేలా వెంకట్ కళాకృతులను రూపొందించారని పేర్కొన్నారు. తన ఐదేళ్ల కళా ప్రయాణాన్ని పురస్కరించుకుని ఈ ప్రదర్శన ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని వెంకట్ గడ్డం తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనను సందర్శించి తన కళాకృతులను వీక్షించాలని కళాభిమానులను కోరారు. హైదరా బాద్‌లో ఇలాంటి ప్రత్యేక కళా ప్రదర్శనలో భాగస్వామి కావడం ఆనందంగా ఉందని జపనీస్ కళాకారిణి హిరోకో తకయామా తెలిపారు. బుద్ధుడి ఆలోచనలు, స్ఫూర్తితో తాను కొన్ని కళాకృతులను రూపొందించినట్లు చెప్పారు. భారతీయ ప్రజలంటే తనకు ఎంతో ఇష్టమని, భారత్‌తో కళల ద్వారా అనుబంధాన్ని పంచుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ప్రదర్శనలోని పెయింటింగ్స్, డిజైన్స్ సందర్శ కులను ఆకట్టుకుంటున్నాయి. వెంకట్ గడ్డంలోని సృజనాత్మకత, కళాత్మక ప్రతిభను అతిథులు ప్రశంసించారు. కళలు, సంస్కృతి, భావోద్వేగాలను ఒకే వేదికపై ఆవిష్కరిస్తున్న ఈ ప్రదర్శన కళాభిమానులకు ప్రత్యేక అనుభూతిని అందిస్తోంది.




# పసికందుల మరణాలకు ఎలుకలే కారణమా..?



- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం
- రిమ్స్ అగ్నిప్రమాదంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 13:** ఆదిలాబాద్ రిమ్స్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఐదుగురు పసికందులు ప్రాణాలు కోల్పోవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. పసికందుల మరణాలకు ఎలుకలను కారణంగా చూపుతూ తప్పించుకోవాలని చూడటం సిగ్గుచేటని విమర్శించారు. నవజాత శిశువుల వార్డులో ఎలుకలు తిరగడమే దారుణమని, అవి ఏసీ వైర్లను కొరకడం వల్లే అగ్నిప్రమాదం జరిగిందని చెప్పడం మరింత బాధాకరమని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ అసమర్థత కారణంగానే ఐదుగురు శిశువులు మరణించారని ఆరోపించారు. ఇలాంటి నివేదికలతో ఎవరిని మభ్యపెట్టాలని చూస్తున్నారని, ఎవరిని కాపాడేందుకు ఈ నివేదికలు ఇస్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తన సొంత ప్రైవేటు ఆసుపత్రులపై ఉన్న శ్రద్ధ ప్రభుత్వ ఆసుపత్రులపై లేదని కేటీఆర్ విమర్శించారు. కనీస నిర్వహణ, పర్యవేక్షణ లేక ప్రభుత్వ ఆసుపత్రులు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని పరోక్షంగా డిమాండ్ చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి పసికందుల కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ అసమర్థ పాలనతో రైతులకు తీవ్ర నష్టం

**ఖమ్మం, వెలుతురు అక్టోబర్ 13:** కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనతో రాష్ట్రంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారి పరిస్థితి ఆందోళనకరంగా మారిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో నెలకొంటున్న కరువు పరిస్థితులు, సాగునీరు, విద్యుత్ కొరతతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంపై గత తొమ్మిది నెలలుగా ప్రపంచ వాతావరణ నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు, విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని రైతులకు అవసరమైన నీరు, విద్యుత్ అందించలేని పరిస్థితి నెలకొనడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. రైతుల సమస్యలపై తక్షణమే స్పందించి, సాగునీరు, విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేం దుకు ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ ఇదే వైఖరిని కొనసాగిస్తే ప్రజాగ్రహాన్ని ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

# రైతులకు కరెంట్ ఇవ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దిగాలి

- మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ డిమాండ్
- అన్నాసాగర్ సబ్‌స్టేషన్ వద్ద రైతుల ధర్నా



**ఆందోల్, వెలుతురు అక్టోబర్ 13 :** వ్యవసాయానికి సరిపడా నాణ్యమైన విద్యుత్ అందించలేని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ డిమాండ్ చేశారు. ఆందోల్ మండలం అన్నాసాగర్ ఉప విద్యుత్ కేంద్రం ఎదుట వివిధ గ్రామాల రైతులు నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. తక్కువ ఒత్తిడితో విద్యుత్ సరఫరా, కోతల కారణంగా పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ విభాగం డివిజనల్ ఇంజినీర్ వచ్చి సమస్యలు పరిష్కరించే వరకు కదిలేది లేదంటూ రోడ్డుపై బైఠాయించారు.

**నీటిని సముద్రం పాలు చేశారు...**

ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ముందస్తు హెచ్చరికలున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా కృష్ణా, గోదావరి జలాలను సముద్రం పాలు చేసిందని క్రాంతి కిరణ్ ఆరోపించారు. గతంలో రూ.4కే విద్యుత్ కొనుగోలు చేసే అవకాశాన్ని వదిలేసి, ఇప్పుడు రూ.15 చెల్లించేందుకు ప్రయత్నించడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల తీరుతో సాగునీరు, తాగునీరు, విద్యుత్ వ్యవస్థలు దెబ్బతిన్నాయని విమర్శించారు.

**సింగూర్ నీటిని ఖాళీ చేయించారు...**

గేట్ల మరమ్మతుల పేరుతో నిండుగా ఉన్న సింగూర్ ప్రాజెక్టు నీటిని దిగువకు వదిలి ఖాళీ చేయించిన ఘనత మంత్రి దామోదర రాజనర్సింహదేనని క్రాంతి కిరణ్ ఆరోపించారు. ఎండిపోతున్న పంటలను పరిశీలించి రైతులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. పెట్టుబడులు పెట్టి పంటలు నష్టపోతున్నామని, కౌలు ఎలా చెల్లించాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి అధ్యక్షత వహించగా, నాయకులు జైపాల్‌రెడ్డి, మాసంపల్లి నారాయణ, లింగాగౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌కు నోటి దూల ఎక్కువ

-ఆర్య వైశ్య కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ కల్వ సుజాత




**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 13 :** కేటీఆర్‌కు నోటి దూల ఎక్కువైందని, ఆయనకు సమయం దగ్గరపడిందని ఆర్య వైశ్య కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి కల్వ సుజాత విమర్శించారు. అధికారం లేకపోతే బతుకులే లేవన్నట్లుగా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దోపిడీకి పాల్పడి, ఏమాత్రం సిగ్గు లేకుండా అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. గాంధీ భవన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేటీఆర్ ఈ కార్ రేసు కేసును చిన్న కేసుగా అభివర్ణిస్తున్నారని, అలాంటప్పుడు కోర్టులో కేసు ఎందుకు ఎదుర్కొంటున్నారని సుజాత ప్రశ్నించారు. ఈ కేసు విషయంలో కేటీఆర్ ఎందుకు ఆందోళన చెందుతున్నారని నిలదీశారు. తప్పులు చేయకపోతే ఇంత గుబులు ఎందుకని ప్రశ్నించారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న సమయంలోనూ రూ.54 కోట్ల లావాదేవీలు జరిపారని ఆరోపించారు. తనకు నచ్చిన సంస్థకు రూ.54 కోట్లు బదిలీ చేయించుకోవడానికి ప్రభుత్వ సొమ్మును సొంత ఆస్తిలా భావించారా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్న కేటీఆర్ ఇప్పుడు తలదించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. భారతీయ జనతా పార్టీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని సుజాత ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని రాహుల్‌గాంధీ మాత్రమే కోరడం లేదని, దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు ఇదే డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఓట్లను కొల్లగొట్టి దేశంలో అధికారంలో కొనసాగాలని చూస్తున్నారని విమర్శించారు. యువతను మాదకద్రవ్యాలకు అలవాటు చేశారని, అదే యువత ఇప్పుడు ప్రధాని మోదీ, అమిత్ షాలకు ఎదురుతిరుగుతోందన్నారు. రాహుల్‌గాంధీని అణచివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన కాంగ్రెస్ పార్టీతో పెట్టుకుంటే మాడి మసైపోతారని హెచ్చరించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేదంటే దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని కల్వ సుజాత హెచ్చరించారు.

# పోక్సో కేసులో నిందితుడికి 35 ఏళ్ల జైలు

- బాలికను ప్రేమ పేరుతో వంచించి..
- లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పు
- సూర్యాపేట ఎస్పీ కె. నరసింహ




**సూర్యాపేట, వెలుతురు అక్టోబర్ 13:** మైనర్ బాలికను ప్రేమ పేరుతో వంచించి, వివాహం చేసుకుని లైంగిక దాడికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి 35 సంవత్సరాల జైలు శిక్ష, రూ.28,000 జరిమానా విధిస్తూ సూర్యాపేట మొదటి అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి, ఇన్‌చార్జ్ పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ పి. శివరామకృష్ణ ప్రసాద్ మంగళవారం తీర్పు వెలువరించారని జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ తెలిపారు. బాధితురాలికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ద్వారా రూ.7 లక్షల పరిహారం అందించాలని న్యాయస్థానం ఆదేశించినట్లు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన 13 ఏళ్ల బాలికకు ఆత్మకూరు (ఎస్) మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన కొమ్ము దయాకర్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమయ్యాడు. అనంతరం ప్రేమ పేరుతో బాలికను వేధిస్తూ, వివాహం చేసుకుంటానని వెంటపడేవాడు. బాలిక నిరాకరించినప్పటికీ, ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు.. పలుమార్లు దాడికి పాల్పడ్డ అనంతరం విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయంలో బాలికను వివాహం చేసుకుని, లైంగిక దాడిని కొనసాగించాడు. ఈ ఘటనపై బాలిక తండ్రి 2023 జూలై 18న సూర్యాపేట రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ ఎస్.కె. యాకూబ్ కేసు నమోదు చేశారు. అప్పటి సూర్యాపేట డీఎస్పీ పి. నాగభూషణం దర్యాప్తు చేపట్టి, న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన గౌరవనీయ న్యాయస్థానం నిందితుడు కొమ్ము దయాకర్‌పై నేరం నిరూపితం కావడంతో వివిధ సెక్షన్ల కింద 35 సంవత్సరాల కారాగార శిక్ష విధించి, రూ.28,000 జరిమానా విధించారు. ఈ కేసులో పోక్సో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. రఘురామయ్య ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. కోర్టు లైజన్ అధికారిగా హెడ్ కానిస్టేబుల్ గంపల శ్రీకాంత్, కోర్టు డ్యూటీ కానిస్టేబుల్ దొంగరి బ్రహ్మం న్యాయస్థానంలో కేసు విచారణకు అవసరమైన సమన్వయం అందించారు. మైనర్ బాలికలు, మహిళలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని ఎస్పీ తెలిపారు. బాలికలు, మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా కేసుల దర్యాప్తును సమర్థవంతంగా చేపట్టి, నిందితులకు చట్టప్రకారం శిక్షలు పడేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కలకలం

## రూ.2 కోట్ల హైడ్రోపోనిక్ గంజాయి పట్టివేత



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 13 :** శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నిషేధిత హైడ్రోపోనిక్ గంజాయిని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. బ్యాంకాక్ నుంచి హైదరాబాద్ వచ్చిన ఓ ప్రయాణికుడిని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో డీఆర్ఐ అధికారులు తనిఖీ చేయగా.. రూ. 2 కోట్ల విలువ చేసే హైడ్రోపోనిక్ గంజాయి లభించడం కలకలం రేపింది. ప్రయాణికుడి ఎలక్ట్రిక్ గీజర్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గీజర్‌లో దాచిన 73 హైగ్రేడ్ గంజాయి ప్యాకెట్లను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి నుంచి మొత్తంగా 7.750 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నార్కోటిక్ డ్రగ్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షించి గంజాయి అని నిర్ధారణ చేసుకున్న అనంతరం ప్రయాణికుడిని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

# రాజ్యాంగ వ్యవస్థలను బెదిరించే స్థాయికి కాంగ్రెస్ దిగజారింది

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు
- సుప్రీంకోర్టుపై కాంగ్రెస్, రాహుల్ గాంధీ నాటకీయ వైఖరిని ఖండిస్తూ హైకోర్టు బార్ కౌన్సిల్ గేట్ వద్ద న్యాయవాదుల భారీ నిరసన.
- రాజ్యాంగ వ్యవస్థలంటే కాంగ్రెస్‌కు ఏమాత్రం గౌరవం లేదు.
- 13 కోట్ల ఓట్ల తొలగింపు అంటూ కాంగ్రెస్ చేస్తున్నది పచ్చి అబద్ధం.



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 13:** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ శ్రేణులు నిన్న సుప్రీంకోర్టు వద్ద ప్రదర్శించిన నాటకీయ వైఖరిని యావత్ దేశ ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పేర్కొన్నారు. భారత న్యాయవ్యవస్థపై ప్రజలకున్న విశ్వాసాన్ని ఉద్దేశపూర్వకంగా దెబ్బతీసేలా రాహుల్ గాంధీ, కాంగ్రెస్ సాగిస్తున్న కుట్రలను నిరసిస్తూ హైదరాబాద్‌లోని తెలంగాణ హైకోర్టు బార్ కౌన్సిల్ గేట్ వద్ద న్యాయవాదులు చేపట్టిన భారీ నిరసన ప్రదర్శనలో ఆయన స్వయంగా ఒక న్యాయవాదిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన, న్యాయవ్యవస్థ స్వతంత్రతను, రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడేందుకు న్యాయవాద లోకమంతా ఏకతాటిపైకి వచ్చిందని స్పష్టం చేశారు. దేశంలోని సుప్రీంకోర్టు, కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ), రాష్ట్రపతి వ్యవస్థ వంటి అత్యున్నత రాజ్యాంగ సంస్థలపై రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ గౌరవం, ఆదరణ, విశ్వాసం ఉండాలని రాంచందర్ రావు హితవు పలికారు. సుప్రీంకోర్టు జడ్జిల అపాయింట్‌మెంట్ అడిగి రాజకీయ మెమోరాండాలు ఇస్తామనడం ఎంతవరకు సమంజసమని రాహుల్ గాంధీని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో పేరుమోసిన సీనియర్ న్యాయవాదులు ఉన్నప్పటికీ, న్యాయస్థానాల్లో పిటిషన్లు ఎలా దాఖలు చేయాలో రాహుల్ గాంధీకి కనీస సలహా కూడా ఇవ్వకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కోర్టుల వద్ద ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తూ రాజ్యాంగ వ్యవస్థలను అప్రతిష్టపాలు చేసే సంస్కృతిని సమాజం ఎన్నటికీ హర్షించబోదని తేల్చిచెప్పారు. మరోవైపు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ గారిని లక్ష్యంగా చేసుకుని కేరళం కాంగ్రెస్ అధికారికంగా పోస్టులు పెడుతూ, సీజేఐ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం న్యాయవ్యవస్థపై సాగిస్తున్న ప్రత్యక్ష దాడి అని మండిపడ్డారు. దేశంలో అశాంతిని, హింసను ప్రేరేపిస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్రతో కాంగ్రెస్ భారత ప్రజలపై యుద్ధం ప్రకటిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ న్యాయవ్యవస్థకు వ్యతిరేకంగా మాట్లాడితే, బంగ్లాదేశ్‌లో జమాతే ఇస్లామీ ర్యాలీలు తీయడం వెనుక దాగి ఉన్న శక్తులెవరో దేశ ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. గతంలో అనేకసార్లు కోర్టుల్లో అనేకసార్లు క్షమాపణలు చెప్పిన చరిత్ర కలిగిన రాహుల్ గాంధీకి న్యాయవ్యవస్థ అన్నా, న్యాయవాదులు అన్నా, ప్రజాస్వామ్య విలువలు అన్నా ఎలాంటి గౌరవం లేదని విమర్శించారు. ఎస్ఐఆర్ (ా×=) ద్వారా 13 కోట్ల ఓట్లను అక్రమంగా తొలగించారంటూ కాంగ్రెస్ నేతలు అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని రాంచందర్ రావు తీవ్రంగా మండిపడ్డారు. నిన్న మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన బాధ్యతారాహిత్య వ్యాఖ్యలకు బీజేపీ తరఫున సవాల్ విసిరామని, దమ్ముంటే ఆధారాలు బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ నిర్దేశిత రాజ్యాంగ నిబంధనల ప్రకారమే ఓట్ల నమోదు, తొలగింపు ప్రక్రియ జరుగుతుందని, ఎక్కడా ఒక్క ఓటు కూడా చట్టవిరుద్ధంగా తొలగించలేదని తేల్చిచెప్పారు. ఆధారాలు లేని అసత్య ప్రచారాలను ఇప్పటికైనా మానుకోకపోతే ప్రజలే కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## నీటి సంక్షోభం.. నీరు వృథా చేస్తే
# నాగ్‌పూర్‌లో రూ.5,000 ఫైన్

**పూనేలో వారానికోసారి నీళ్లు బంద్**



**మహారాష్ట్ర, వెలుతురు అక్టోబర్ 12:** మహారాష్ట్రలోని పెద్ద పట్టణాలైన నాగ్‌పూర్, పూనేలను తీవ్ర నీటి కొరత వేధిస్తోంది. అందుకే, ఉన్న నీటి వనరుల్ని సక్రమంగా వాడుకునేలా, నీరు వృథా, దుర్వినియోగం కాకుండా చూసేలా కఠిన చర్యలకు అక్కడి పాలకవర్గం సిద్ధమైంది. దేశంలో అత్యంత కరువు ఎదుర్కొనే రాష్ట్రాల్లో మహారాష్ట్ర ఒకటి. అక్కడ అనేక ప్రాంతాల్లో నీటి వనరులు చాలా తక్కువ. అందులోనూ ఈసారి ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడి, నీటి వనరులు తగ్గిపోయాయి. ఇదే సమయంలో పెద్ద పట్టణాలైన నాగ్‌పూర్, పూనేలను తీవ్ర నీటి కొరత వేధిస్తోంది. అందుకే, ఉన్న నీటి వనరుల్ని సక్రమంగా వాడుకునేలా, నీరు వృథా, దుర్వినియోగం కాకుం డా చూసేలా కఠిన చర్యలకు అక్కడి పాలకవర్గం సిద్ధమైంది. దీనిలో భా గంగా నీటిని వృథా చేసేవారికి రూ.5,000 జరిమానా విధించాలని నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్ఎంసీ) ప్రతిపాదించింది. అంటే, ప్రతి ఒక్క నీటి వృథాకి రూ.5,000 చొప్పున ఫైన్ విధిస్తారు. అలాగే, మరో పెద్ద పట్టణమైన పూనేలో కూడా పాలకవర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై అక్టోబర్ 15 నుంచి వారానికోసారి నీటికి వీక్లీ కట్ ఇవ్వనుంది. అంటే, ప్రతి గురువారం నీటి సరఫరా ఉండదు. నాగ్‌పూర్‌కు సంబంధించి నీటి రేషనింగ్‌ను ఎన్ఎంసీ పరిశీలిస్తోంది. నగరంలో నీటి కొరతపై మేయర్ నీతా తకారే అధికారులతో సమీక్ష జరిపారు. నీటి లభ్యత, సరఫరా వంటి వివరాల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నీటిని సద్వినియోగం చేసుకునే చర్యలపై దృష్టిపెట్టారు. దీని ప్రకారం తాగునీటిని వాహనాలు శుభ్రం చేయ డానికి వాడకూడదు.

రోడ్లను కడగడం, అరుగుల మీద నీళ్లు చల్లడం వంటివి చేయకూడదు. గార్డె న్లలో నీటి వినియోగం, నిర్మాణం రంగంలో నీటి వినియోగంపైనా పరిమితులు విధించనున్నారు. నాగ్‌పూర్‌కు నీళ్లు అందించే రిజర్వాయర్‌లో ప్రస్తుతం 746 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీళ్లున్నాయి. ఇది పూర్తి సామర్థ్యంలో 58 శాతం మాత్రమే. ఇటీవల వర్షాలు పడకపోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. అందువల్ల ఉన్న తక్కువ నీటిని సరిగ్గా వాడుకోవాలని ఎన్ఎంసీ భావిస్తోంది. పూనే నగరం కూడా ఈ అంశంపై దృష్టిపెట్టి, నీటి కోతలకు సిద్ధమైంది. ప్రజలు నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని సూచించింది. వారంలో గురువారం రోజు నీటి సరఫరా ఆపివేయనుంది. అక్రమంగా నీటిని వాడుకుంటున్న వారిపై కొరడా ఝుళిపించనుంది. అయితే, వేసవి కూడా రాకముందే పరిస్థితి ఇలా ఉంటే.. వచ్చే వేసవిలో ఇంకెలాంటి కఠిన పరిస్థితులు చూడాల్సి వస్తుందో అని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# జంతర్ మంతర్‌కు నిరసన వేదిక హోదా రద్దు

- మూడు వేరే ప్రత్యామ్నాయ ప్రదేశాల సూచన
- ఢిల్లీ పోలీసుల ఉత్తర్వు.. విపక్షాల ఆగ్రహం

**న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 12:** జంతర్ మంతర్‌ను నిరసనలు, ప్రదర్శనలకు నిర్దేశిత వేదికగా గుర్తించే హోదాను ఢిల్లీ పోలీసులు సోమవారం రద్దు చేశారు. అటువంటి సమావేశాలు, ప్రదర్శనల కోసం మూడు ప్రత్యామ్నాయ ప్రదేశాలను వారు సూచించారు. శాంతియుత నిరసన చేపట్టేందుకు అనుమతి విషయంలో కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ)తో ప్రతిష్ఠంభన నెలకొనడం, సుప్రీంకోర్టు ఇండియా కూటమి తలపెట్టిన పాదయాత్రకు ముందు రాజధానిలో భద్రతను కట్టుదిట్టం చేసిన నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు ఈ చర్య తీసుకున్నారు. ఈనెల 11న(ఆదివారం) నాటి ఒక స్టాండింగ్ ఆర్డర్ ప్రకారం కొత్తగా నిర్ణయించిన మూడు వేదికల్లో పాత ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం, తూర్పు ఢిల్లీలోని సీబీడీ మైదానం, ఉత్తర ఢిల్లీలోని బురారీ మైదానం ఉన్నాయి. ఈ మూడు ప్రదేశాలు సెంట్రల్ ఢిల్లీలోని జంతర్ మంతర్ నుంచి వరుసగా 3 కి.మీ, 13.5 కి.మీ, 44 కి.మీ. దూరంలో ఉన్నాయి. ఢిల్లీ పోలీసు కమిషనర్ అనురాగ్‌కుమార్ సంతకంతో వెలువడిన ఈ ఉత్తర్వు జంతర్ మంతర్‌ను నిరసన వేదికగా నిర్దేశిస్తూ 2022 ఏప్రిల్ 28న జారీ చేసిన మునుపటి ఉత్తర్వును పాక్షికంగా సవరించింది. ఈ మూడు కొత్త వేదికల వద్ద నిరసనలు, ప్రదర్శనల నిర్వహణకు సంబంధించిన సమగ్రమైన, సవరించిన ప్రామాణిక కార్యకలాపాల విధానాలను (ఎస్ఓపీ) విడిగా జారీ చేస్తామని పోలీసులు తెలిపారు. కాగా, జంతర్ మంతర్ వద్ద శాంతియుత నిరసన చేపట్టేందుకు అనుమతి విషయంలో సీజేపీ, ఢిల్లీ పోలీసుల మధ్య నెలకొన్న ప్రతిష్ఠంభన నేపథ్యంలో ఈ ఆదేశం వెలువడింది. నిరసన ప్రదర్శన కోసం ఒక తేదీని కేటాయించాలన్న తమ డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తూ, అనుమతి నిరాకరణకు గల కారణాలను కోరుతూ సీజేపీ నాయకులు సోమవారం పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. శాంతియుతంగా నిరసన తెలపాలన్న తమ ఉద్దేశం



గురించి పోలీసులకు అధికారికంగా సమాచారం అందించామని, వారు ఆ సమాచారాన్ని స్వీకరించారని సీజేపీ ప్రధాన ప్రతినిధి సౌరవ్ దాస్ తెలిపారు. అయితే నిరసనకు ఎటువంటి తేదీని ఖరారు చేయలేదని, అలాగే ఆంక్షలకు గల కారణాలపై తమకు ఎలాంటి వివరణ అందలేదన్నారు.

**ఇక యావద్దేశం 'జంతర్ మంతర్'గా మారుతుంది**
**ఢిల్లీ పోలీసుల ఉత్తర్వుపై దీప్కే రియాక్షన్**

జంతర్ మంతర్‌ను నిరసన వేదికల జాబితా నుంచి తొలగించి దానికి బదులుగా మూడు ప్రత్యామ్నాయ ప్రదేశాలను ప్రవేశపెట్టాలన్న ఢిల్లీ పోలీసుల నిర్ణయం నేపథ్యంలో యావద్దేశం జంతర్ మంతర్‌గా మారిపోతుంది అంటూ సీజేపీ కన్వీనర్ అభిజీత్ దీప్కే హెచ్చరించారు. ప్రజాస్వామిక నిరసనలను ప్రభుత్వం అణచివేస్తున్నదని, అసమ్మతిని తెలిపే హక్కును లక్ష్యంగా చేసుకుంటున్నదని ఆయన ఆరోపించారు. వారు(ఢిల్లీ పోలీసులు) జంతర్ మంతర్‌ను అధికారిక నిరసన ప్రదేశం జాబితా నుంచి తొలగించారు. అవును, అది ఇకపై నిరసన ప్రదేశం కాదు. ఏదేమైనా ఆ పిరికి నియంత దానిని యుద్ధ క్షేత్రంగా మార్చేశారు. ఇప్పుడు యావద్దేశం జంతర్ మంతర్‌గా మారిపోతుంది అని ఎక్స్ వేదికగా దీప్కే పేర్కొన్నారు.

**రైతులు, రెజ్లర్లు, విద్యార్థులు**

తమ సమస్యలకు విస్తృత గుర్తింపును కోరుకునే వర్గాలకు జంతర్ మంతర్ ఒక వేదికగా నిలుస్తూనే వచ్చింది. 2017లో వ్యవసాయ రంగ సంక్షోభం, అప్పుల భారం, కరువు వల్ల కలిగిన నష్టాలు, తమ జీవనోపాధికి ఎదురైన ఇబ్బందులను ఎత్తిచూపుతూ తమిళనాడు రైతులు 41 రోజుల పాటు నిరసన చేపట్టారు. 2023లో ఒలింపిక్ విజేతలతో సహా ప్రముఖ రెజ్లర్లు అప్పటి భారత రెజ్లింగ్ సమాఖ్య అధిపతి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. క్రీడాకారిణులను ఆయన లైంగికంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఆయనపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2024లో నీట్-యూజీ పేపర్ లీక్ వివాదంపై కూడా ఈ ప్రదేశంలో ప్రదర్శనలు జరిగాయి. నీట్-యూజీ 2026 పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం లీక్ వివాదం నేపథ్యంలో ఇది రాజధానిలో నిరసనలకు దారితీసి పరీక్షా విధానంపై చర్చను తీవ్రతరం చేసింది. జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన ఆందోళన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ముగిసింది. తాజాగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఈనెల 10న జంతర్ మంతర్ వద్ద సీజేపీ తలపెట్టిన ప్రదర్శనకు ఢిల్లీ పోలీసులు అనుమతి ఇవ్వలేదు. అంతేగాక నిరసనను అడ్డుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఢిల్లీని పోలీసులతో దిగ్బంధం చేశాయి.

## ధిక్కార స్వరాలకు వేదిక



దశాబ్దాలుగా అధికారంలో ఉన్న వారికి తమ గళాన్ని వినిపించాలనుకునే ప్రజలకు మధ్య ఒక వేదికగా సెంట్రల్ ఢిల్లీలోని 'జంతర్ మంతర్' ఒక నిలుస్తున్నది. అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం, నిర్భయ సామూహిక అత్యాచార ఘటన తర్వాత జరిగిన నిరసనలు, నీట్ పరీక్షకు సంబంధించిన ఆందోళనల వరకు ప్రజల సమస్యలను జాతీయ స్థాయిలో చర్చనీయాంశం చేసిన అనేక ఉద్యమాలకు ఈ ప్రాంతం సాక్షిగా నిలిచింది. ఇప్పుడు ఢిల్లీ పోలీసులు దీనిని నిర్దేశిత నిరసన ప్రదేశం జాబితా నుంచి తొలగించడంతో శాంతియుత ప్రదర్శనలు, జవాబుదారీతనం కోసం డిమాండ్లతో సన్నిహితంగా ముడిపడి ఉన్న ఆ ప్రముఖ ప్రదేశం భవిష్యత్తుపై ఆందోళనలు తలెత్తాయి. రాజధాని నడిబొడ్డున ఉన్న జంతర్ మంతర్ అవినీతి, సామాజిక అన్యాయం నుంచి మహిళల భద్రత, రైతుల కష్టాలు, ప్రభుత్వ పరీక్షల్లోని అక్రమాల వరకు వివిధ సమస్యలను లేవనెత్తడానికి భిన్న నేపథ్యాల ప్రజలను ఒకచోట చేర్చింది. ప్రభుత్వ ఆర్థిక విధానాలు, మతతత్వానికి వ్యతిరేకంగా 'జైల్ భరో' నిరసన కోసం 33 సంస్థలు ఏకమైనప్పుడు 1993లో ఆ ప్రదేశంలో జరిగిన ఒక ముఖ్యమైన ప్రారంభ నిరసన కార్యక్రమం చోటుచేసుకుంది. ఈ సమీకరణ స్థాయిని ఆ తర్వాత పార్లమెంట్‌లో ప్రస్తావించారు. ఇందులో దాదాపు 25,000 మంది ప్రజలు పాల్గొన్నారని ఒక ఎంపీ పేర్కొన్నారు. అవినీతిని అరికట్టడానికి లోక్‌పాల్ బిల్లును కోరుతూ సామాజిక ఉద్యమనేత అన్నా హజారే ఐదు రోజుల నిరాహార దీక్షను ప్రారంభించినప్పుడు 2011 ఏప్రిల్‌లో జంతర్ మంతర్ ప్రజా సమీకరణకు ఒక ప్రధాన కేంద్రంగా ఆవిర్భవించింది. 2012లో ఢిల్లీలో కదులుతున్న బస్సులో ఒక మహిళపై జరిగిన సామూహిక లైంగిక దాడి తర్వాత జంతర్ మంతర్, దాని చుట్టుపక్కల ప్రాంతాలు నిరసనలకు ముఖ్యమైన ప్రదేశాలుగా మారాయి. నిర్భయంగా విస్తృతంగా పేరుగాంచిన ఆ బాధితురాలు ఆ తర్వాత గాయాల కారణంగా మరణించడంతో దేశవ్యాప్తంగా ఆగ్రహం చెలరేగింది. 2014లో ఆగ్నేయ ఢిల్లీలో దాడికి గురై మరణించిన అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన విద్యార్థి నిడో తానియా మరణం తర్వాత కూడా నిరసనలు వెల్లువెత్తాయి.

## సౌదీపై హౌతీ దాడుల ఎఫెక్ట్..
# రియాద్, జెద్దా నుంచి విమానాలు రద్దు

**సౌది, వెలుతురు అక్టోబర్ 12:** సౌదీ అరేబియాపై హౌతీ ఉగ్రవాదుల దాడులు కొనసాగుతున్నాయి. సౌదీలోని ఎయిర్‌పోర్టులే లక్ష్యంగా హౌతీలు దాడులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇండియాకు చెందిన విమానయాన సంస్థ ఇండిగో కీలక నిర్ణయం తీసుకుంది. ఇండియా నుంచి సౌదీకి, అలాగే సౌదీ నుంచి ఇండియాకు వచ్చే విమాన సర్వీసులన్నింటినీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపింది. అక్టోబర్ 17 వరకు ఈ నిర్ణయం అమలులో ఉంటుందని వెల్లడించింది. దీని ప్రకారం సౌదీ రాజధాని రియాద్, జెద్దా, దమ్మాం, మదీనా ఎయిర్‌పోర్టుల నుంచి ఇండియాకు.. ఇండియా నుంచి ఆ ఎయిర్‌పోర్టులకు ఇండిగో విమాన సర్వీసులు నిలిచిపోయాయి. ప్రస్తుతం సౌదీలో నెలకొన్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో ఇండిగో సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ విషయంపై ప్రయాణికులకు సమాచారం అందించింది. అలాగే, పూర్తి వివరాల కోసం, విమాన సర్వీసుల కోసం సంస్థ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది. ప్రయాణికుల అభ్యంతరాలపై సమాచారం అందించేందుకు




సపోర్ట్ టీం అందుబాటులో ఉంటుందని సంస్థ పేర్కొంది. ప్రయాణికుల సంక్షేమం, భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఇండిగో సంస్థ మాత్రమే కాకుండా ఇతర విమానయాన సంస్థలు కూడా ఆయా ప్రాంతాలకు విమాన సర్వీసుల్ని నిలిపి వేశాయి. సౌదీలోని రెండో అతిపెద్ద ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు అయిన కింగ్ ఖలీద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు సహా ఇతర ఎయిర్‌పోర్టులపై హౌతీ ఉగ్రవాదులు బాలిస్టిక్ మిస్సైళ్లు, డ్రోన్లతో దాడులు చేస్తున్నారు. దీంతో అనేక ఎయిర్‌పోర్టుల నుంచి విమానయాన సేవలు నిలిచిపోయాయి. హౌతీ ఉగ్రవాదులకు ఇరాన్ మద్దతుగా నిలుస్తోంది. మరోవైపు సౌదీ అరేబియా.. యెమెన్ ప్రభుత్వానికి అండగా ఉంటోంది. యెమెన్‌లోని తిరుగుబాటు సైన్యమే హౌతీలు.

## సీఈసీలకు పద్మ అవార్డుల్ని
# కాంగ్రెస్ లంచాలుగా ఇచ్చింది

**కేంద్ర మంత్రి పీయూష్ సంచలన ఆరోపణ**

**ఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 12:** కాంగ్రెస్ పార్టీపై కేంద్ర మంత్రి, బీజేపీ అగ్రనేత పీయూష్ గోయల్ సంచలన ఆరోపణలు చేశారు. గతంలో పని చేసిన సీఈసీలకు కాంగ్రెస్ లంచాలు ఇచ్చిందన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాల్సిందే అంటూ నిరసన చేపట్టిన కాంగ్రెస్ పార్టీపై కేంద్ర మంత్రి, బీజేపీ అగ్రనేత పీయూష్ గోయల్ సంచలన ఆరోపణలు చేశారు. గతంలో పని చేసిన సీఈసీలకు కాంగ్రెస్ లంచాలు ఇచ్చిందన్నారు. ప్రతిష్ఠాత్మక పద్మ అవార్డుల్ని సీఈసీలకు లంచంగా ప్రకటించిందని పీయూష్ విమర్శించారు. అలాగే, వారికి రాజకీయ పదవులు కూడా ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. పీయూష్ గోయల్ మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సంచలన ఆరోపణలు చేశారు. సీఈసీలకు, ఈసీలకు కాంగ్రెస్ పదవులు



ఇచ్చిందన్నారు. మాజీ సీఈసీ ఎంఎస్ గిల్.. ఎన్నికల సంఘం నుంచి పార్లమెంట్‌కు, అక్కడినుంచి కేంద్ర మంత్రిగా మారిన సంగతిని గోయల్ వివరించారు. అంతకుముందు సీఈసీగా కొనసాగిన టీఎన్ శేషన్ పదవీకాలం ముగిసిన వెంటనే గుజరాత్ గవర్నర్‌గా నియమించారని గోయల్ ప్రస్తావించారు. 2005లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు నవీన్ చావ్లాను ఎన్నికల కమిషనర్‌గా నియమించ డంలో సోనియా గాంధీ పాత్ర లేదా అని ప్రశ్నించారు. ఎన్నికల కమిషనర్‌గా ఉన్న చావ్లా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నా రని 2009లో ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎన్.గోపాలస్వామి ఆరోపించిన విషయాన్ని కూడా గోయల్ గుర్తు చేశారు. ఇదే సమయంలో ఇటీవల సీఈసీ రాజీనామా విషయంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శల్ని, ఆయన తీరును పీయూష్ గోయల్ తప్పుబట్టారు. రాహుల్ ప్రవర్తన ద్వంద్వ ప్రమాణాలను సూచిస్తోందని, చిన్న పిల్లాడిలా ఆయన ప్రవర్తన ఉందని విమర్శించారు. ఎన్నికల సంఘానికి తమ ఎన్‌డీయే ప్రభుత్వం పూర్తి స్వతంత్రంగా పని చేసే స్వేచ్ఛ ఇచ్చిందన్నారు. ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావు ఇవ్వలేదని వివరించారు. చట్టపరమైన నిబంధనల్ని ఉల్లంఘించి, రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు ప్రయత్నించలేదన్నారు. ప్రజల కోసం నిజాయితీగా పని చేసేలా చూశామని గోయల్ తెలిపారు.

## కేంద్ర బలగాలను
## 20 వరకు ఉపసంహరించొద్దు




ఢిల్లీ, **వెలుతురు అక్టోబర్ 12:** హోంశాఖకు ఢిల్లీ పోలీసుల ఆందోళనలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర సాయుధ పోలీసు బలగాల లను ఇప్పుడే ఉపసంహరించవద్దని, కేంద్ర బలగాల మోహరింపును ఈ నెల 20 వరకు పొడిగించాలని ఢిల్లీ పోలీసులుకి లేఖ రాశారు. ఈ విషయాన్ని ఢిల్లీ ఉన్నతాధికారులు మంగళవారం వెల్లడించారు. ఆందోళనలు పెరిగే అవకాశం ఉందనే నిఘావర్గాల సమాచారం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలను కాపాడటంతోపాటు ఉద్రిక్తతలకు తావులేకుండా ఉండేందుకే గడువు పెంచాలని కోరినట్లు చెప్పారు. కాగా ప్రస్తుతం విధుల్లో ఉన్న 273 కంపెనీల బలగాల మోహరింపు గడువు సోమవారంతో ముగిసింది. మరోవైపు జంతర్‌మంతర్, ఎన్నికల సంఘం కార్యాలయం, పార్లమెంట్ హౌస్, ఇండియా గేట్ వంటి ప్రాంతాల్లో నిరసనలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఈ 273 సీఏపీఎఫ్ కంపెనీల మోహరింపును పొడిగించాలని పోలీసులు తమ లేఖలో పేర్కొన్నారు. నిరసనల నేపథ్యంలో ఢిల్లీలో మొత్తం 301 కంపెనీల సీఏపీఎఫ్ బలగాలకు అనుమతి లభించింది. అక్టోబర్ 6న 221 కంపెనీలకు, 8న మరో 80 కంపెనీలకు ఆమోదం తెలపడంతో ఆ కంపెనీలు విధుల్లో పాల్గొన్నాయి. అదనంగా మంజూరైన 80 బలగాల్లో 28 సోమవారం నాటికి ఢిల్లీకి చేరుకోలేదు.

## కేంద్ర మంత్రి పదవీకి రాజీనామా

**చెన్నై, వెలుతురు అక్టోబర్ 12:** బీజేపీని తమిళనాడులో బలోపేతం చేసేందుకేనని ప్రకటన ా వీబతీబస్త్రుఅ : కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం తన నిర్ణయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించారు. కేంద్ర మంత్రి పదవికి ఎల్ మురుగన్ రాజీనమా.. బీజేపీని తమిళనాడులో బలోపేతం చేసేందుకేనని ప్రకటనూ వీబతీబస్త్రుఅ : కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం తన నిర్ణయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించారు. ప్రస్తుతం మురుగన్ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖతోపాటు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిగా కూడా కొనసాగుతున్నారు. తమిళనాడులో బీజేపీని బలోపేతం చేసేందుకు కృషి చేసే ఉద్దేశంతోనే తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు మురుగన్ పేర్కొన్నారు.

# ఇద్దరు అమెరికన్‌లకు నోబెల్

**స్టాక్‌హోమ్, వెలుతురు అక్టోబర్ 12:** ఆర్థిక, ఇంధన సంక్షోభాలు, ద్రవ్యోల్బణం వంటి సమస్యలను ప్రభుత్వాలు, కేంద్రబ్యాంకులు మెరుగ్గా ఎదుర్కొనేందుకు ఉపయోగపడే ఆర్థిక నమూనాల అభివృద్ధిలో చేసిన కృషికి అమెరికన్ ఆర్థికవేత్తలు రాబర్ట్ ఈ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్ సోమవారం ఆర్థిక శాస్త్రంలో నోబెల్ పురస్కారానికి ఎంపికయ్యారు. స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఈ విజేతలను ప్రకటించింది. దశాబ్దాలపాటు ప్రభుత్వాలు ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొనేందుకు బ్రిటిష్ ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కీన్స్ సూచించిన విధానాలను అనుసరించాయి.

**రాబర్ట్ ఈ హాల్, వుడ్‌ఫోర్డ్‌లకు అవార్డు**

ఆర్థిక, ఇంధన సంక్షోభాలు, ద్రవ్యోల్బణం వంటి సమస్యలను ప్రభుత్వాలు, కేంద్రబ్యాంకులు మెరుగ్గా ఎదుర్కొనేందుకు ఉపయోగపడే ఆర్థిక నమూనాల అభివృద్ధిలో చేసిన కృషికి అమెరికన్ ఆర్థికవేత్తలు రాబర్ట్ ఈ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్ సోమవారం ఆర్థిక శాస్త్రంలో నోబెల్ పురస్కారానికి ఎంపికయ్యారు. స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఈ విజేతలను ప్రకటించింది. దశాబ్దాలపాటు ప్రభుత్వాలు ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొనేందుకు బ్రిటిష్ ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కీన్స్ సూచించిన విధానాలను అనుసరించాయి. మహామాంద్యం కాలంలో ప్రాచుర్యం పొందిన ఈ విధానాల ప్రకారం, ఆర్థిక వ్యవస్థను తిరిగి వృద్ధి బాట పట్టించేందుకు పన్నులు తగ్గించడం, ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం ద్వారా వినియోగదారులు, వ్యాపార సంస్థలు ఖర్చులు, పెట్టుబడులు పెంచేలా చేయాలి. కీన్స్ సూచించిన ఈ విధానం ఒక దశవరకు బాగా పనిచేసిందని, కానీ తర్వాత విఫలమైందని నోబెల్ ఆర్థికశాస్త్ర పురస్కార కమిటీకి చెందిన



టిమో బొప్పార్ట్ అన్నారు. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉన్నప్పుడు నిరుద్యోగం తక్కువగా ఉంటుందని, ద్రవ్యోల్బణం తగ్గినప్పుడు నిరుద్యోగం పెరుగుతుందని విధాన నిర్ణేతలు గతంలో భావించేవారు. అంటే, ఆర్థిక వ్యవస్థను నిర్వహించడంలో కొన్ని అంశాల మధ్య పరస్పర సంబంధాలు ఉంటాయని వారు నమ్మేవారు. అయితే 1970 దశకంలో ప్రపంచం ఎదుర్కొన్న స్టాగ్‌ఫ్లేషన్ ఈ అంచనాలు సాధారణమైనవని నిరూపించింది. ఆ సమయంలో అధిక ద్రవ్యోల్బణం, అధిక నిరుద్యోగం రెండూ ఒకేసారి కొనసాగాయి. హాల్, వుడ్‌ఫోర్డ్ తమ పరిశోధనల ద్వారా కీన్స్ ఆర్థిక నమూనాను మెరుగుపరిచేందుకు కృషి చేశారు. వినియోగదారులు, వ్యాపార సంస్థలు వాస్తవంగా ఎలా నిర్ణయాలు తీసుకుంటాయనే అంశాలను అందులో చేర్చారు. మొత్తం ఆర్థిక వ్యవస్థను విస్తృత దృక్పథంతో మాత్రమే అధ్యయనం చేయకుండా, వ్యక్తులు, సంస్థల నిర్ణయాల ఆధారంగా రూపొందించిన నమూనాలను ఉపయోగించడం ద్వారా ఆర్థిక స్థిరీకరణ విధానాల సిద్ధాంతంలో గణనీయమైన మార్పు వచ్చిందని కమిటీ వివరించింది.

## నౌకపై దాడి ఘటనలో ఇద్దరు భారతీయుల గల్లంతు

**టెహ్రాన్, వెలుతురు అక్టోబర్ 12:** హొర్ముజ్ జలసంధిలో ఎంటీ పెట్రో డాల్ఫిన్ నౌకపై ఆదివారం దాడి జరిగింది. ఇందులో 11 మంది భారతీయ నావికులున్నారు. 9 మందిని రక్షించగా ఇద్దరు గల్లంతయ్యారు. ఒమన్‌లోని సోహార్ నౌకాశ్రయం సమీపంలో నికరగువ జెండాతో ప్రయాణిస్తున్న ఈ నౌకపై డ్రోన్ దాడి జరిగినట్టు సమాచారం. గల్లంతైన వారి కోసం స్థానిక సంస్థలతో కలిసి గాలిస్తున్నట్టు ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. మరోవైపు మార్షల్ ఐస్‌లాండ్ జెండాలతో ప్రయాణిస్తున్న ఎంటీ వాల్డెరా నౌకపై కూడా క్షిపణి దాడి జరిగిందని తెలుస్తున్నది. ఆ నౌకలోనూ 11 మంది భారత నావికులున్నారని, వారి భద్రతపై ఆరా తీస్తున్నట్టు కేంద్రమంత్రి సర్బానంద వెల్లడించారు. ఈ దాడులకు పాల్పడింది ఎవరనేది ఇంకా తెలియరాలేదు.



ఈ దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. పౌర నౌకలు, ఇంధన నౌకలపై దాడులను నిలిపివేయాలని సూచించింది.

## జంతర్ మంతర్ వద్ద
## సీజేపీ నేతలు సౌరవ్, ఆశుతోష్ అరెస్టు



**న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 12:** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టేందుకు ప్రభుత్వం నిరాకరించిన విషయం తెలిసిందే. అయితే ఇవాళ ఆ నిరసన ప్రదేశానికి సీజేపీ నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంక్కా చేరుకున్నారు. దీంతో ఆ ఇద్దర్నీ పోలీ సులు అదుపులోకి తీసుకున్నారు. సీజేపీ ప్రధాన ప్రతినిధి సౌరవ్ దాస్, జాతీయ ప్రతినిధి అశుతోష్ రాంక్కాలను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను ఆయన తన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. జంతర్ మంతర్‌ను మళ్లీ పొందామని, ఆ నిరసన ప్రదేశంలోకి ప్రవేశించామని, కానీ మమ్మల్ని అరెస్టు చేశారని దాస్ తన పోస్టులో తెలిపారు. కొందరు సీజేపీ నేతలు జాతీయ జెండాతో జంతర్ మంతర్‌లోకి ప్రవేశించారని, వారిని పోలీసులు అరెస్టు చేసినట్లు దీప్కే పేర్కొన్నారు.

## ప్రాణం తీసిన మెట్రో సీటు గొడవ..
### -ఢిల్లీలో మాజీ ఐఏఎస్ అధికారి అరెస్ట్



**న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 12:** మెట్రో సీటు విషయంలో జరిగిన గొడవ చివరకు వ్యక్తి ప్రాణాలు తీసింది. ఈ నెల 8న జరిగిన ఈ ఘటన ఇప్పుడు సంచలనంగా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పవన శర్మ (48), ఆయన తల్లి దుర్గాదేవి (65) యమునా విహార్‌వైపు ఢిల్లీ మెట్రోలో వెళు న్నారు. మండి స్టేషన్ వద్ద రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సంజయ్ ప్రతాప్ సింగ్ (65), ఆయన కొడుకు సిద్దార్థ్ సింగ్ ఎక్కారు. వారు శర్మ, ఆయన తల్లి వద్దకు వచ్చి సీనియర్ సిటిజన్ సీటు విషయంలో గొడవపడ్డారు. సంజయ్ ప్రతాప్ సింగ్ పవన శర్మను చెంప మీద కొట్టాడు. దీంతో పవన శర్మ ప్రతిఘటించడంతో సిద్దార్థ్ సింగ్ కూడా దాడి చేశాడు. ఈ దాడిలో పవన్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. పోలీసులు పవన శర్మను దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు తెలిపారు. దుర్గాదేవి ఫిర్యాదుతో నిందితులు సంజయ్ ప్రతాప్ సింగ్, సిద్దార్థ్ సింగ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు.

# తెలుగు గంగ నీటి విడుదల పెంచాలి

## సీఎం చంద్రబాబుకు తమిళనాడు సీఎం విజయ్ విజ్ఞప్తి



**విజయవాడ, వెలుతురు:**

సీఎం చంద్రబాబుతో తమిళనాడు సీఎం విజయ్ భేటీ అయ్యారు. తెలుగు గంగ నీటి విడుదల అంశంపై చర్చ జరిగింది. ఈ ఏడాది చెన్నైకి 4.08 టీఎంసీల నీరు అందించినట్లు చంద్రబాబు విజయ్ కు వివరించారు. నీటి విడుదల పెంచాలని తమిళనాడు సీఎం విజయ్ విజ్ఞప్తి చేసారు. నీటి లభ్యత ఆధారంగా నిర్ణయం తీసుకోనున్నట్లు చంద్రబాబు బదులిచచారు. తరువాత గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై చర్చ జరిగింది. సమావేశంలో మంత్రులు నారాయణ, నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిలను సీఎం విజయ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు పరిచయం చేశారు.

అంతకుముందు ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి చేరుకున్న తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్ కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్వాగతం పలికారు. సీఎం విజయ్ కు పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానం పలికారు.

# కనకదుర్గమ్మను దర్శించుకున్న సీఎం విజయ్





**ఇంద్రకీలాద్రి, వెలుతురు:**

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ విజయవాడలో పర్యటిస్తున్నారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మను ఆయన దర్శించుకు న్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సీఎం విజయ్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకులు వేద మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎం విజయ్ తన పర్యటనలో భాగంగా మరికాసేపట్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ కానున్నారు. ఈ సమావేశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. అనంతరం విజయవాడ ఉత్సవ్ 2.0 కార్యక్రమంలో సీఎం విజయ్ పాల్గొననున్నారు. ఆయన పర్యటన నేపథ్యంలో నగరంలో ఈ కార్యక్రమంపై ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ కార్యదర్శి కె. కన్నబాబు, కమిషనర్ కె. రామచంద్ర మోహన్, ఆలయ పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ సంయుక్తంగా అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు, దివ్య చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ ఎంపీ కేసినేని చిన్ని, కలెక్టర్, దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అధికారులు, నగర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దేశ ప్రజలంతా మాతో ఉన్నారు



- **జ్ఞానేశ్ రాజీనామా చేసే వరకు నిరసనలు : రాహుల్**
- **రాహుల్ గాంధీ నివాసంలో తేనీటి విందు**
- **హాజరైన 'ఇండీ' కూటమి నేతలు, విద్యార్థి, పౌర సంఘాల ప్రతినిధులు**

**న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 13:**

దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం విపక్షాలు, విద్యార్థి, పౌర సంఘాలు ఏకతాటిపై నిలబడి ఐక్యపోరాటం చేస్తున్నట్లు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలిపారు. ఆయన తన నివాసంలో 'ఇండీ' కూటమి నేతలకు, పౌర, విద్యార్థి సంఘాల ప్రతినిధులకు తేనీటి విందు ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రాహుల్‌గాంధీ, ఓటు చోరీకి బాధ్యులైన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను కోర్టు ముందు నిలబెట్టడమే ప్రతిపక్షాల లక్ష్యమన్నారు. సుప్రీం కోర్టుతో పాటు ప్రధాన న్యాయమూర్తిపై తమకు అత్యంత గౌరవం ఉందన్నారు. ఈ విషయంలో న్యాయవ్యవస్థ తన పాత్రను నిర్వర్తిస్తుందని ఆశిస్తున్నట్లు రాహుల్‌గాంధీ తెలిపారు.

మోదీ సారథ్యంలోని ప్రభుత్వం దేశంలో ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల వ్యవస్థను నాశనం చేసిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. జంతర్ మంతర్ను డినోటిఫై చేయటాన్ని ఆయన ఖండించారు. దేశ ప్రజలంతా తమతో ఉన్నారని రాహుల్ గాంధీ చెప్పారు. దేశ భవిష్యత్తు కోసమే తాము పోరాటం చేస్తున్నామన్నారు. సోమవారం జరిగిన నిరసనలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని చెప్పారు. సోమవారం దిల్లీ వీధుల్లో తాము చేపట్టిన నిరసనలకు హాజరై, మద్దతు తెలిపిన ప్రజలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఓటు చోరీ వెనుక ఎవరున్నా శిక్ష అనుభవించాల్సిందేనని స్పష్టంచేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేవరకు రాజకీయ, ప్రజా నిరసనలు కొనసాగుతాయని రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు. "దేశానికి ఉన్న ఒకే ఒక శత్రువు బీజేపీ. నిరసనలు తెలిపే హక్కును కూడా బీజేపీ లాక్కుంది. ప్రజాస్వామ్యం కోసం ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేశారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై చట్టపరంగా క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. ఓటు చోరీతోనే బంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. స్వేచ్ఛాయుత ఎన్నికల వ్యవస్థను జ్ఞానేశ్‌కుమార్ నాశనం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ చోరీ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే ఆపాలి. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై చట్టపరంగా క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై ప్రజలు కోపంగా ఉన్నారు. నిరసనలను అణిచివేయాలని చూస్తున్నారు. జంతర్‌మంతర్ లో నిరసనలు చేయకుండా డీనోటిఫై చేశారు. జంతర్‌మంతర్‌ను డీనోటిఫై చేస్తే నిరసనలు ఎక్కడ చేయాలి? రాజ్యాంగ సంస్థలు ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలుగా మారాయి" అని ఇండియా కూటమి నేతలు విమర్శించారు.

# అభ్యర్థుల ఎంపికపై పూర్తి స్థాయిలో ఫోకస్

**అమరావతి, వెలుతురు:**



ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఊపందుకోవడంతో ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపికపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టింది. కూటమి ప్రభుత్వానికి గట్టి పోటీ ఇచ్చేలా బలమైన నేతలను బరిలోకి దించేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు, సీనియర్ నాయకులతో అత్యంత కీలకమైన సమావేశాన్ని నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ అభ్యర్థుల ఎంపికను వీలైనంత త్వరగా పూర్తి చేసి క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని ముమ్మరం చేయాలని జగన్ భావిస్తున్నారు. స్థానిక సమరంలో అందరికంటే ముందే అభ్యర్థులను ప్రకటించి సైకలాజికల్ అడ్వాంటేజ్ దక్కించుకోవాలనే వ్యూహంతో వైఎస్సార్‌సీపీ ఉంది. ఇందులో భాగంగానే ఇప్పటికే నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా సీనియర్ నేత ఆనం విజయ్‌కుమార్ రెడ్డి పేరును వైఎస్ జగన్ అధికారికంగా ఖరారు చేశారు. రిజర్వేషన్ల సమీకరణాలను బేస్ చేసుకుని రేపు జరగబోయే రీజనల్ కోఆర్డినేటర్ల సమావేశంలో మిగిలిన ప్రధాన నగరాల మేయర్ అభ్యర్థుల ఎంపికపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. రాజకీయంగా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కీ-కార్పొరేషన్లపై ఈ భేటీలో ప్రధానంగా చర్చ జరగనుంది. విజయవాడ, గుంటూరు, వైజాగ్, కాకినాడ, ఒంగోలు, కడప, అనంతపురం నగరాల మేయర్ అభ్యర్థులను రేపటి సమావేశం ముగిసిన అనంతరం వైఎస్ జగన్ అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో బలమైన ప్రచారం సాగుతోంది. ఇప్పటికే గుంటూరు మేయర్ స్థానానికి మాజీ మంత్రి అంబటి రాంబాబు కుమార్తె పేరు కూడా పరిశీలనలోకి వచ్చినట్లు లీకులు వస్తుండటంతో, రేపటి అధికారిక లిస్ట్‌పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కూటమి ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు, అక్రమ కేసులను ధీటుగా ఎదుర్కొంటూ క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను సమాయత్తం చేయాలని రీజనల్ కోఆర్డినేటర్లకు వైఎస్ జగన్ దిశా నిర్దేశం చేయనున్నారు. పోలింగ్ బూత్ ల వారీగా నిఘా ఉంచడం, అభ్యర్థుల ఆర్థిక, సామాజిక బలాలను అంచనా వేయడం వంటి అంశాలపై సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి తదితర ప్రాంతీయ సమన్వయకర్తలతో జగన్ వన్-టు-వన్ సమీక్షించనున్నారు. రేపటి ప్రకటనతో ఏపీ మున్సిపల్ ఎన్నికల రాజకీయం మరింత ఊపందుకోనుంది. రాజకీయాల్లో సామాజిక వర్గాల సమీకరణాలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే కేవలం కుల సమీకరణాలను ఆధారంగా చేసుకుని ఎన్నికల్లో విజయం సాధించడం సాధ్యం కాదు. ప్రజల్లో పలుకుబడి, స్థానిక సమస్యలపై అవగాహన, నాయకుడి బలం, పార్టీ శ్రేణులతో సంబంధాలు కూడా ఫలితాలను ప్రభావితం చేస్తాయి. ఈ విషయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇప్పటికైనా పరిగణనలోకి తీసుకోవాలనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో తీసుకున్న కొన్ని నిర్ణయాలు ఆశించిన ఫలితాలను ఇవ్వకపోవడంతో పార్టీ వ్యూహాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మంగళగిరి నియోజకవర్గంలో జరిగిన పరిణామాలు ఈ చర్చకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. గతంలో బలమైన స్థానిక నాయకుడిగా గుర్తింపు పొందిన ఆళ్ల రామకృష్ణారెడ్డిని పక్కనపెట్టి, మురుగుడు లావణ్యకు అవకాశం కల్పించడం ద్వారా బీసీ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ భావించింది. అయితే ఎన్నికల్లో ఆమె విజయం సాధించలేకపోయారు. ఓటమి తర్వాత నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలను బలోపేతం చేయడంపై కూడా మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సామాజిక సమీకరణాలతో పాటు అభ్యర్థి స్థానిక బలం, ప్రజలతో అనుబంధాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ పరిణామం గుర్తుచేస్తోంది. విజయవాడ నగర రాజకీయాల్లోనూ ఇలాంటి చర్చ కనిపిస్తోంది. నగర మేయర్ పదవి విషయంలో బీసీ మహిళకు అవకాశం కల్పించాలనే నిర్ణయాన్ని వైసీపీ తీసుకుంది. ఈ క్రమంలో రాయన భాగ్యలక్ష్మి మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. అయితే ఆమె నాయకత్వం, నగర రాజకీయాల్లో పార్టీకి వచ్చిన ప్రయోజనాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కీలకమైన స్థానాల్లో సామాజిక ప్రాతినిధ్యాన్ని పెంచడం ఎంత ముఖ్యమో, ఆ పదవుల్లో ఉన్నవారు ప్రజల్లో గుర్తింపు సంపాదించడం, పార్టీకి రాజకీయంగా ఉపయోగపడటం కూడా అంతే ముఖ్యమనే వాదన వినిపిస్తోంది. గత ఎన్నికల్లో విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలో కూడా వైసీపీ ప్రయోగం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. అట్టడుగు వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో తీసుకున్న నిర్ణయాలు ఎన్నికల్లో విజయంగా మారకపోవడంతో అభ్యర్థుల ఎంపిక విధానంపై సమీక్ష అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం తప్పు కాదు. అయితే అభ్యర్థి సామర్థ్యం, స్థానికంగా ఉన్న బలం, ఎన్నికల నిర్వహణలో అనుభవం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ప్రస్తుతం వైసీపీ ముందున్న మరో ప్రధాన సమస్య పార్టీలోని అంతర్గత విభేదాలు. కొన్ని నియోజకవర్గాల్లో సమన్వయకర్తలు, సీనియర్ నాయకుల మధ్య విభేదాలు పెరుగుతున్నాయనే చర్చ ఉంది. వీటిని పరిష్కరించకుండా వదిలేస్తే పార్టీ కేడర్‌పై ప్రభావం పడే అవకాశం ఉంది. స్థానిక ఎన్నికలకు ముందే నాయకుల మధ్య సమన్వయం పెంచడం, నియోజకవర్గాల వారీగా పార్టీ బలాబలాలను అంచనా వేయడం అవసరం. సామాజిక సమీకరణాలు రాజకీయాల్లో ముఖ్యమైనవే అయినప్పటికీ అవే విజయానికి హామీ ఇవ్వవు. బలమైన నాయకత్వం, ప్రజలతో నిరంతర సంబంధాలు, సమర్థమైన అభ్యర్థుల ఎంపిక, అంతర్గత సమస్యల పరిష్కారం కూడా కీలకం. ఈ అంశాలపై వైసీపీ నాయకత్వం దృష్టి పెట్టకపోతే భవిష్యత్తు ఎన్నికల్లో సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. పార్టీ పునరుద్ధరణకు వ్యూహాత్మక మార్పులు ఎంతవరకు ఉపయోగపడతాయన్నది జగన్ తీసుకునే నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది

# దసరా పర్వదినాల్లో పార్టీ పేరు, జెండా, ఎజెండా సిద్ధం



**విజయవాడ, వెలుతురు:**

రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి తన రాజకీయ భవిష్యత్‌పై మరో ప్రకటన చేశారు. ఆయన త్వరలోనే పార్టీ పెట్టబోతుండడం తెలిసిందే. అందుకు తగిన సన్నాహాలు జోరుగా సాగుతున్నాయని వెల్లడించారు. రాజకీయాల్లో తనది బాల్ థాకరే (శివసేన వ్యవస్థాపకుడు) వంటి పాత్రేనని, అధికారం యువతరానిదే (జెన్-జీ) అని తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. "పార్టీ పేరు, జెండా, ఎజెండా ఈ పవిత్ర దసరా పర్వదినాల్లో సిద్ధం అవుతున్నాయి" అని వెల్లడించారు. తాను పార్టీ పెట్టవద్దని కోరుకునే వారు చేస్తున్న చౌకబారు ప్రచారాలకు విలువివ్వాల్సిన అవసరం లేదని కొట్టిపారేశారు. రాష్ట్రంలోని రెండు కుటుంబ పార్టీలపై తిరుగుబాటుగానే తన పార్టీ ఆవిర్భవిస్తుందని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో మెరికల్లాంటి కొత్త నాయకత్వాన్ని తయారు చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. "మరోసారి చెపుతున్నా... అధికారం జెన్-జీది, నాది బాల్ థాకరే పాత్ర" అని తన పోస్టులో వివరించారు. గత సార్వత్రిక ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో విజయసాయిరెడ్డి వైసీపీకి దూరమైన విషయం తెలిసిందే. ఆ తర్వాత పార్టీకి రాజీనామా చేసి, కొంతకాలం వ్యవసాయంపై దృష్టి సారించారు. ఆయన వేరే పార్టీలో చేరతారంటూ ప్రచారం జరిగినా, వాటన్నింటినీ తోసిపుచ్చుతూ సొంతంగా పార్టీ పెట్టడానికే మొగ్గు చూపారు. రాష్ట్రంలో రెండు కుటుంబాలే నిరంతరం పాలన సాగిస్తున్నాయని, వారి వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని గత కొన్ని రోజులుగా విజయసాయిరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. చంద్రబాబు, జగన్ కుటుంబ పార్టీలకు ప్రత్యామ్నాయంగా నూతన రాజకీయాలకు శ్రీకారం చుడతామని ప్రకటించారు. తాను స్థాపించబోయే పార్టీలో తాను లేదా తన కుటుంబసభ్యులు ముఖ్యమంత్రి రేసులో ఉండరని, కేవలం మార్గదర్శకుడిగా ఉండి, బాల్‌ఠాక్రే పాత్ర పోషిస్తానని పలుమార్లు స్పష్టం చేశారు. రాజకీయంపై పూర్తి పట్టున్న ప్రముఖ వ్యక్తిని సీఎం స్థానంలో కూర్చోబెడతాన్నారు. అలాగే తమ పార్టీలో అన్ని వర్గాల ప్రాతినిధ్యంతో పాటు ఉవని-జి యువతకు సింహభాగం సీట్లు కేటాయిస్తామని వెల్లడించారు.

# గీత దాటే వారికి ఫైనల్ డెడ్ లైన్

**అనంతపురం, వెలుతురు:**



ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వానికి కొందరు ఎమ్మెల్యేల వ్యవహారశైలి పెద్ద తలనొప్పిగా మారింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ శ్రేణులకు , ప్రజాప్రతినిధులకు అవినీతి రహిత, పారదర్శక పాలన అందించాలని పదే పదే దిశానిర్దేశం చేస్తున్నారు. పద్ధతి మార్చుకోవాలని పలుమార్లు వ్యక్తిగతంగా పిలిపించి క్లాస్ పీకినా, హెచ్చరికలు జారీ చేసినా కొందరు నాయకులు మాత్రం తమ పాత అలవాట్లను మానుకోకపోవడం క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఇమేజ్‌ను దెబ్బతీస్తోంది. అనంతపురం అర్బన్ టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ , పోలవరం జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజుల వ్యవహారాలు రాష్ట్ర రాజకీయాల్లో, సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపాయి. అనంతపురంలో అధికారులు, వ్యాపారుల నుంచి అక్రమ వసూళ్లు, సెటిల్‌మెంట్ల ఆరోపణలు రావడంతో పాటు ఆడియో క్లిప్పులు వైరల్ కావడం స్థానికంగా కలకలం రేపింది. మరోవైపు పోలవరం నియోజకవర్గంలో ఇసుక మైనింగ్ దందాలు, దేవుడి భూముల వివాదాలు, రూ.21 లక్షల డీలింగ్స్ ఆడియో లీక్‌లతో జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వార్తల్లో నిలిచారు. గతంలోనే పవన్ కళ్యాణ్ ఈయన్ను పిలిపించి హెచ్చరించినప్పటికీ ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో, ఏకంగా ఓ హైలెవెల్ ఎంక్వైరీ కమిటీని నియమించి సీరియస్ యాక్షన్‌కు శ్రీకారం చుట్టారు. వీరిద్దరే కాకుండా రాయలసీమ, ఉత్తరాంధ్ర , కోస్తా జిల్లాలకు చెందిన మరికొందరు కూటమి ఎమ్మెల్యేలు కూడా అధికారులపై బెదిరింపులకు దిగడం, ఇసుక-మద్యం మాఫియాలతో చెయ్యి కలపడం, స్థానిక కాంట్రాక్టర్ల వద్ద కమిషన్ల డిమాండ్ చేయడం వంటి వివాదాల్లో చిక్కుకుంటున్నారు. మేము కష్టపడి అధికారాన్ని తెస్తే.. వీరు ఐదేళ్ల మైండ్‌సెట్‌తో దోచుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు అని స్థానిక క్యాడర్, కూటమి శ్రేణులు సోషల్ మీడియా వేదికగా బహిరంగంగానే అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. ఎమ్మెల్యేల అతివల్ల ప్రభుత్వం కష్టపడి తెచ్చుకుంటున్న మంచి పేరు కాస్తా తుడిచిపెట్టుకుపోతోందనే ఆగ్రహం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో కూటమి అధిష్టానాలు అంతర్గత సర్వేల ద్వారా ఎమ్మెల్యేల పనితీరు, వారిపై వస్తున్న అవినీతి ఆరోపణలపై పక్కా నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గాల్లో ప్రజల నుంచి వస్తున్న స్పందన, సోషల్ మీడియా ట్రాకింగ్ ద్వారా నివేదికలు తెప్పించుకుంటున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్.. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదనే స్పష్టమైన సంకేతాలిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేల స్వేచ్ఛా దోపిడీ వల్లే ప్రజలు వారిని తిరస్కరించారనే విషయాన్ని గుర్తుచేస్తూ, పార్టీ పరువు తీసే నాయకులను దూరం పెట్టడమే మేలనే అభిప్రాయానికి వచ్చారు. ప్రస్తుతానికి మొదటి దశగా పోలవరం ఎమ్మెల్యేపై పవన్ కళ్యాణ్ కమిటీ నియామకంతో విచారణ ప్రారంభించగా, విచారణ నివేదికల ఆధారంగా అక్రమాలు రుజువైతే పార్టీ బాధ్యతల నుంచి తొలగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. టీడీపీలోనూ వివాదాస్పద ఎమ్మెల్యేలకు చంద్రబాబు లాస్ట్ అండ్ ఫైనల్ డెడ్‌లైన్ విధించినట్లు తెలుస్తోంది. మార్పు రాకపోతే రాబోయే రోజుల్లో వారిని శాసనసభాపక్షం నుంచి పక్కనబెట్టడం వంటి కఠిన చర్యలు ఉంటాయని భావిస్తున్నారు.

అధికారంలోకి వచ్చిన కూటమికి ఈ వివాదాస్పద ఎమ్మెల్యేల ప్రవర్తన పెద్ద పరీక్షగా మారింది. అధినేతలు కేవలం హెచ్చరికలకే పరిమితం కాకుండా, ఒకరిద్దరిపై బహిరంగంగా కఠిన చర్యలు తీసుకుంటేనే మిగిలిన నాయకుల్లో భయం, క్రమశిక్షణ నెలకొంటాయని సామాన్య ప్రజలతో పాటు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## జగనన్న కాలనీల లబ్ధిదారులకు బిగ్ అలర్ట్..

**అమరావతి, వెలుతురు:** ఆంధ్రప్రదేశ్‌లోని జగనన్న కాలనీలలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు సంబంధించి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఒక అతిముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన ప్లాట్లలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడానికి సిద్ధంగా ఉన్నారో లేదో ప్రత్యక్షంగా తెలుసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో ఇళ్లు కట్టుకోవడం ఇష్టం లేని లబ్ధిదారులకు ప్రత్యామ్నాయంగా వేరే ప్రాంతా లలో స్థలాలు కేటాయించే అంశాన్ని నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఈ విషయంలో లబ్ధిదారుల స్పష్టమైన అభిప్రాయాన్ని సేకరించ డానికి వారికి త్వరలోనే అధికారిక నోటీసులు పంపనున్నట్లు వెల్లడించారు. ఈ సమస్యను సమగ్రంగా పరిష్కరించేందుకు గృహనిర్మాణ మంత్రి పార్థసారథి, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, మంత్రులు కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్‌లతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. గతంలో కేటాయించిన కాలనీల్లో సరైన మౌలిక వసతులు లేకపోవడం వల్ల చాలామంది అక్కడ ఇళ్లు కట్టడానికి వెనుకాడుతున్నారని మంత్రులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, లబ్ధిదారులు వద్దనుకున్న ప్లాట్ల రిజిస్ట్రేషన్లను తక్షణమే రద్దు చేసి, వాటిని అర్హులైన ఇతర పేదలకు పునఃకేటాయించాలని స్పష్టం చేశారు. మ్యాప్‌లు చూడండిఇటీవల నిర్వహించిన 'ఆవాస్' సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 2 లక్షల మందికి ఇళ్ల స్థలాలు అవసరమని తేలడంతో, వారి కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. ఇళ్ల స్థలాల సేకరణ పేరుతో జరిగిన భారీ అక్రమాలు, అక్రమ లావాదేవీలపై సమగ్ర దర్యాప్తు జరిపి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించడంతో తీవ్ర కలకలం రేగుతోంది.



## చినిగిపోని.. తడిసినా చెడిపోని
# మీ సేవ సర్టిఫికెట్లు

- 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లతో కొత్త పేపర్
- ఏళ్ల తరబడి భద్రంగా దాచుకునేలా ప్రత్యేక తయారీ
- మీసేవలో జారీ చేసే సర్టిఫికెట్లకు ఇక లామినేషన్ పని లేదు
- ప్రజాభవన్‌లో ప్రారంభించిన ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, వెలుతురు:

ప్రభుత్వ ధ్రువపత్రాల భద్రత, మన్నిక పెంచే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. చినిగిపోకుండా, నీళ్లు పడినా దెబ్బతినకుండా ప్రత్యేకంగా రూపొందించిన కొత్త మీ సేవ సర్టిఫికెట్ పేపర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం ప్రారంభించారు. హైదరాబాద్ లోని ప్రజాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో

ఎమ్మెల్యేలు రాజ్ ఠాకూర్, విజయ రమణా రరావు, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్డీ) కమిషనర్ టి. రవికిరణ్, అధికారులు, ప్రింటింగ్ ఏజెన్సీలు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లు

కొత్త మీ సేవ సర్టిఫికెట్ పేపర్‌లో 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లను పొందుపరిచారు. నకిలీ సర్టిఫికెట్ల తయారీ, అనధికార నకళ్లను అరికట్టేలా వీటిని రూపొందించారు. భద్రతా కారణాల తో ఈ ఫీచర్ల పూర్తి వివరాలను వెల్లడించడం లేదు. ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ పేపర్ సులభంగా చినిగిపోదు. నీళ్లు పడినా త్వరగా దెబ్బతినదు. సాధారణ వినియోగం, మడతపెట్టడం, ఎక్కువ కాలం భద్రపరచడం వల్ల కలిగే నష్టాన్ని తగ్గిస్తుంది. దీంతో సర్టిఫికెట్లను ఏళ్ల తరబడి మంచి స్థితిలో దాచుకునే అవకాశం ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో వాటికి లామినేషన్ చేయించాల్సిన అవసరం కూడా తగ్గుతుంది.

### జీవితాంతం అవసరమయ్యే పత్రాలకు మరింత రక్షణ

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు విద్య, ఉద్యోగ, ఇతర అధికారిక అవసరాలకు ఉపయోగించే సర్టిఫికెట్లు ప్రజల జీవితంలో ఎంతో ముఖ్యమైనవని పేర్కొన్నారు. కొత్త సెక్యూరిటీ పేపర్‌తో సర్టిఫికెట్ల మన్నిక పెరగడంతో పాటు నకిలీలను అరికట్టేందుకు వీలవుతుందన్నారు. ప్రభుత్వ ధ్రువపత్రాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.

### 2011 నుంచి మీ సేవ సెక్యూరిటీ పేపర్

తెలంగాణలో మీ సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అనేక రకాల ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. 2011 నుంచి మీ సేవ సర్టిఫికెట్ల ముద్రణకు ప్రత్యేక సెక్యూరిటీ పేపర్‌ను వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు ఉన్న పేపర్ స్థానంలో మరింత నాణ్యత, భద్రత, మన్నిక కలిగిన కొత్త పేపర్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.

# తెలంగాణకు ఎల్నినో గండం..
## 50 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం

హైదరాబాద్, వెలుతురు:




ఎల్ నినో గండంతో రాష్ట్రంలో రానున్న 10 నెలలు, ఆపై కూడా తీవ్ర కరువు పరిస్థితులు ఉండే అవకాశం వుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ములుగు నియోజకవర్గంలో విద్యుత్ కోతలతో పంటలు ఎండుతున్నాయి. మంగపేట, ఏటూరునాగారం, తాడ్వాయి మండలాల్లో విద్యుత్ కోతల వల్ల పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం 24 గంటలు కరెంటు ఇస్తున్నామని చెప్తున్నా, క్షేత్రస్థాయిలో కేవలం 5 నుంచి 6 గంటల కరెంటు మాత్రమే వస్తోందని రైతుల ఆందోళన.

తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం కుడా వుందని సమాచారం. పంటలకు సాగునీరు అందించడం కష్టమే.. వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపనుంది. భూగర్భ జలమట్టాలు రోజుకు దాదాపు మూడు అడుగుల మేర పడిపోతున్నాయి. సాధారణ స్థాయితో పోలిస్తే ప్రస్తుతం రాష్ట్రంలోని జలాశయాల నీటి నిల్వలు 50 శాతమే ఉన్నాయి. అందుబాటులో ఉన్న నీటిని తాగునీరు, పశువుల అవసరాలకే వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. హైదరాబాద్లోనూ తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తే అవకాశం వుందని అంచనా.

# తెలంగాణ విద్యారంగం ప్రపంచంతో పోటీపడేలా
## విద్యకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట




- ఉపాధ్యాయులే భావి తరాల నిర్మాతలు..
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంలో భాగస్వాములు కావాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




హైదరాబాద్, వెలుతురు:

విద్య ద్వారానే సమాజంలో సామాజిక, ఆర్థిక అసమానతలను అధిగమించి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడం సాధ్యమవుతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ, భారీగా నిధులు కేటాయించడంతోపాటు విప్లవాత్మక సంస్కరణలు చేపడుతోందని తెలిపారు. ప్రపంచంతో పోటీపడే స్థాయిలో తెలంగాణ విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో జీ తెలుగు న్యూస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గురు వందనం-ఎడ్యుకేషన్ కాంక్లేవ్ అండ్ టీచర్స్ అవార్డ్స్-2026' కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొని మాట్లాడారు. సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థులను ఉన్నతమైన మానవ వనరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు మరింత చురుగ్గా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

సమాజంలో విద్య ఎంతగా అభివృద్ధి చెందితే, ఆ సమాజం అన్ని రంగాల్లో అంతగా పురోగమిస్తుందని శాస్త్రీయ అధ్యయనాలు సైతం నిరూపించాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా పరిస్థితుల సర్వేలోనూ విద్యకు ఉన్న ప్రాధాన్యం స్పష్టమైందన్నారు. వెనుకబడిన వర్గాలు, ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాలు అభివృద్ధి సాధించడానికి విద్య కీలకమైన మార్గమని సర్వే గణాంకాలు వెల్లడిస్తున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సమాజాన్ని ప్రపంచంతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖను తన వద్దే ఉంచుకొని, విద్యారంగ అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు.

### ఉపాధ్యాయ నియామకాలు...

విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు డీఎస్సీ ద్వారా పెద్దఎత్తున ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని, జూనియర్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్ల నియా మకాలను కూడా పూర్తి చేశామని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన విద్యాబోధన అందించడంతోపాటు విద్యార్థుల సంక్షే మానికి అనేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని గురుకుల, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు డైట్ ఛార్జీలను 40శాతం, కాస్మెటిక్ ఛార్జీలను 200శాతం పెంచినట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు.

### 105 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు

అంతర్జాతీయ ప్రమాణాలతో, ఆంగ్ల మాధ్యమంలో విద్య అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేసి, నిర్మాణ పనులను వేగవంతం చేసినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఒక్కో పాఠశాలలో 2,000నుంచి 2,500మంది విద్యార్థులు చదువుకునేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు క్రీడలు, మైదానాలు, ఇతర పాఠ్యేతర కార్యక్రమాలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులకు సైతం పాఠశాలల ప్రాంగణాల్లో నివాస సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతోపాటు ప్రతి నియోజకవర్గానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను మంజూరు చేసినట్లు వెల్లడించారు ఆధునిక యంత్రాలు, కంప్యూటరైజ్డ్ సాంకేతిక పరిజ్ఞానంపై యువతకు నైపుణ్య శిక్షణ అందించి, ఉద్యోగాలకు అవసరమైన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

### ఉపాధ్యాయుల భాగస్వామ్యంతోనే లక్ష్య సాధన

విద్యారంగంలో ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు భవిష్యత్తులో గేమ్ ఛేంజర్‌గా మారుతాయని భట్టి విక్రమార్క విశ్వాసం వ్యక్తం చేశారు. విద్య ద్వారా తెలంగాణ సమాజం రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బలోపేతమై ప్రపంచంతో పోటీపడే స్థాయికి చేరుకుంటుందని అన్నారు. 'గురు వందనం' కార్యక్రమంలో అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులందరూ ప్రభుత్వ లక్ష్యాల సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె కేశవ రావు, పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు జీ న్యూస్ సిఈఓ, ఎడిటర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

## బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో బీజేపీ స్టేట్ చీఫ్ ప్రత్యేక పూజలు



హైదరాబాద్, వెలుతురు:

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నేడు బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన.. జగన్మాత ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని, రైతన్నల పంటలు సమృద్ధిగా పండి రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆయన శరన్నవరాత్రుల శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత

- హ్యామ్ రోడ్ల పనులు వేగవంతం చేయాలి
- నాణ్యతలో రాజీ పడొద్దు
- ఇంజనీరింగ్ అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు




హైదరాబాద్, వెలుతురు:

హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్, తెలంగాణ స్టేట్ సెంటర్‌లో నిర్వహించిన ఇన్‌స్టిట్యూషనల్ స్ట్రెంగ్తెనింగ్ ప్రోగ్రామ్‌కు మంత్రి సీతక్క హాజరయ్యారు. హామ్ రోడ్ల విధానంలో టెక్నికల్ షెడ్యూల్, పనుల పరిధి, సాంకేతిక బాధ్యతలు, ఇతర విధివిధానాలపై ఫీల్డ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, రహదారుల అభివృద్ధి పనుల పురోగతి, లక్ష్యాలు, అమలు తీరుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిశోర్, ఈఎన్‌సీ జగదీశ్వర్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, నిర్దేశించుకున్న లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 7,448 కిలోమీటర్లకు పైగా హామ్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని, ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించి రోడ్ల నిర్మాణానికి లక్ష్యాలను నిర్దేశించారని, ఆ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

### ప్రజల ప్రాణాలు కాపాడటంలో రోడ్ల పాత్ర కీలకం

రహదారులు కేవలం ప్రయాణ సౌకర్యాలు మాత్రమే కాదని, ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్నాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఒక మనిషి ప్రాణాన్ని కాపాడాలన్నా, అత్యవసర సమయంలో అంబులెన్స్ ఆసుపత్రికి చేరాలన్నా, గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలు అందాలన్నా రహదారులు ఎంతో అవసరమని వివరించారు. పోయిన ప్రాణం, గడిచిపోయిన సమయం తిరిగి రావు. అందుకే ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పనులను సకాలంలో పూర్తి చేయాలి అని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఎక్కడా నాణ్యత లోపించకుండా చూడాలని ఆదేశించారు. అక్టోబర్ నుంచి జూన్ వరకు పనులు చేపట్టేందుకు అనువైన సమయమని, ఈ కాలాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని చెప్పారు. ఇది పని చేసుకునే సమయం. ఈ అవకాశాన్ని కోల్పోతే మళ్లీ రాదు. లక్ష్యాలను నిర్దేశించుకొని, సమన్వయంతో పనిచేసి పనులను పూర్తి చేయాలి అని అన్నారు.

### గ్రామాల అభివృద్ధే లక్ష్యం

అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని, ప్రజలు నివసించే ప్రాంతాల్లోనే మౌలిక సదుపాయాలు కల్పించాలని మంత్రి సీతక్క పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో సమాన అభివృద్ధి జరగాలని అన్నారు. గ్రామాల్లోనే కుటుంబాలు గౌరవంగా, సౌకర్యవంతంగా జీవించే పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు.

# ఎల్‌నినో ప్రభావ పరిస్థితులపై ఫోకస్

- పశుగ్రాస కొరత రాకుండా ముందస్తు చర్యలు
- చెరువులు, కుంటల శిఖం భూముల్లో పశుగ్రాసం సాగు చేయాలని నిర్ణయం
- 45 రోజుల్లో పశుగ్రాసం అందుబాటులోకి వచ్చేలా యుద్ధప్రాతిపదికన చర్యలు
- నిర్వహణ బాధ్యత స్వయం సహాయక సంఘాలకు




హైదరాబాద్, వెలుతురు:

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, పశుగ్రాసం కొరత ఏర్పడే పరిస్థితులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. పశువులకు అవసరమైన గ్రాసాన్ని అందుబాటులో ఉంచడంతో పాటు, మూగజీవాలకు నీటి ఇబ్బందులు కలగకుండా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా నీటి లభ్యత ఉన్న చెరువులు, కుంటల శిఖం భూముల్లో పశుగ్రాసం సాగు చేయాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టి, 45 రోజుల్లో పశుగ్రాసం అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ అధ్యక్షతన నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఇలంబర్తి, పంచాయతీరాజ్ కమీషనర్ దివ్య దేవ రాజన్, గ్రామీణ అభివృద్ధి శాఖ స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి,పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ ఎం.శ్రీనివాస్, నీటిపారుదల, కమాండ్ ఏరియా అభివృద్ధి శాఖ (ఐ అండ్ సీఏడీ) ఈఎన్‌సీ రమేష్ బాబు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఈఎన్‌సీ మధుసూదన్, వీబీజీ రాంజీ అధికారులు పాల్గొన్నారు.

### శిఖం భూముల్లో పశుగ్రాసం సాగు

నీటి వసతి ఉన్న చెరువులు, కుంటల పరిధిలోని శిఖం భూములను గుర్తించి, ఒక్కో ప్రాంతంలో ఐదు నుంచి పది ఎకరాల విస్తీర్ణంలో పశుగ్రాసం సాగు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఇందుకు అనువైన స్థలాలను గుర్తించే బాధ్యతను నీటిపారుదల, కమాండ్ ఏరియా అభివృద్ధి శాఖకు అప్పగించారు. గుర్తించిన భూముల్లో సాగుకు అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేపట్టి, నిర్ణీత గడువులోగా పశుగ్రాసాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ఆదేశించారు.

పశుగ్రాస సాగుకు అవసరమైన నిధులను ఉపాధి హామీ పథకం నిధుల నుంచి సమకూర్చనున్నారు. సాగుకు అనువైన, అధిక దిగుబడినిచ్చే సీఎస్‌హెచ్ 24-ఎంఎఫ్ (సిఎస్ హెచ్ 24-ఏంఎఫ్) రకం పశుగ్రాసాన్ని సాగు చేయాలని నిర్ణయించారు. అవసరమైన విత్తనాలను పశుసంవర్ధక శాఖ ఉచితంగా అందించనుంది. దీంతో సాగు ప్రారంభానికి అవసరమైన విత్తనాల ఖర్చు రైతులు, సంబంధిత సంఘాలపై పడకుండా చర్యలు తీసుకోనున్నారు.

### నిర్వహణ బాధ్యత స్వయం సహాయక సంఘాలకు

గుర్తించిన భూముల్లో పశుగ్రాసం సాగు, పంట సంరక్షణ, నీటి నిర్వహణ వంటి పనులను పర్యవేక్షించే బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని నిర్ణయించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. భూముల గుర్తింపు, సాగు ఏర్పాట్లు, విత్తనాల సరఫరా, పంట నిర్వహణ వంటి అంశాల్లో జాప్యం జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకున్నా పశువులకు అవసరమైన మేత కొరత ఏర్పడకుండా ముందుగానే పశుగ్రాసాన్ని సిద్ధం చేసుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. నీటి లభ్యత ఉన్న భూములను వినియోగించుకోవడం ద్వారా అందుబాటులో ఉన్న వనరులతోనే పశుగ్రాస ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

### మూగజీవాలకు తాగునీటి సదుపాయం

పశుగ్రాసంతో పాటు పశువులకు తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన ప్రాంతాల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పశువులకు నిరంతరం తాగునీరు అందేలా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పశుగ్రాసం సాగు, నీటి తొట్టెల నిర్మాణం వంటి పనులను సమాంతరంగా చేపట్టి, 45 రోజుల్లోగా పశుగ్రాసాన్ని అందుబాటులోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. శాఖల మధ్య సమన్వయంతో పనులు వేగవంతం చేసి, క్షేత్రస్థాయిలో అమలు తీరును పర్యవేక్షించాలని అధికారులు నిర్ణయించారు.

పశువుల పోషణకు అవసరమైన పచ్చిమేత, తాగునీరు అందుబాటులో ఉండటం పాడి పరిశ్రమతో పాటు గ్రామీణ కుటుంబాల జీవనోపాధికి కూడా కీలకం. ఈ నేపథ్యంలో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణ అమలు చేయడం ద్వారా పశుగ్రాస కొరతను నివారించడంతో పాటు, పశుసంపదను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

# పోస్టుమెట్రిక్ విద్యార్థులకు రూ.204.40 కోట్ల భరోసా

- 32,976 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ నిధుల విడుదల
- హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఫీజు బకాయిలకు మరో రూ.14.68 కోట్లు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



హైదరాబాద్, వెలుతురు:

రాష్ట్రంలోని ఎస్సీ విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద 32,976మంది విద్యార్థులకు మొత్తం రూ.204.40కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తన 40 శాతం వాటాగా రూ.101.44 కోట్లు, కేంద్ర ప్రభుత్వం 60శాతం వాటాగా రూ.102.96 కోట్లు విడు దల చేసినట్లు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. కళాశాలల నుంచి అందుతున్న పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అర్హత ఉన్న విద్యార్థులకు దశలవారీగా స్కాలర్‌షిప్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా, స్కాలర్‌షిప్‌ల చెల్లింపులు సకాలంలో జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు.

### విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం

ఆర్థిక పరిస్థితులు కారణంగా ఏ ఒక్క ఎస్సీ విద్యార్థి ఉన్నత విద్యకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని స్కాలర్‌షిప్ ప్రక్రియలో జాప్యాన్ని తగ్గించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

### హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు రూ.14.68 కోట్లు

ఇదిలా ఉండగా, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.14.68 కోట్లను విడుదల చేసింది. విద్యార్థుల విద్యకు సంబంధించిన ఫీజు బకాయిలను పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని తెలిపారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com